# దారి దీపం

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

మాసపత్రిక

సంపుటి 3 - సంచిక 7 | 2025 ఏప్రిల్ | వెల : రూ.15

విదేశీ ప్రేరిత ఉగ్రవాదుల దుశ్చర్య

నయాకశ్మీర్ పహల్గాంకు ఎలా చేరింది

వ్యవస్థలు కాదు, రాజ్యాంగమే సర్వోన్నతం

శ్రామిక వర్గ కోణంలో 'సుంకాల యుద్ధం'

బీహార్ కులగణన - ఆర్థికాభివృద్ధి

సూడో సైన్సు

ఫూలే దంపతుల ఆదర్శ విద్యా విధానం

హిందూ మతోన్మాదానికి అంబేద్కర్ ఓ సవాల్

మతం సాంస్కృతిక ఆయుధంగా ఎలా మారింది ?

ఎవరు దేశభక్తుడు ? ఎవరు దేశద్రోహి ?

వ్యంగ్యం వద్దు కవిత్వం వద్దు, కావలసింది ప్రభుత్వ భజనే

విష వలయంలో ఆంధ్రప్రదేశ్.. ప్రజల కోసం శాస్త్రవేత్తల ప్రకటన

'ముసల్మాన్ల మొహల్లా'

హిందుత్వ - హిందూ మతాల మధ్య తేడాపై అరుణ్‌శౌరీ ఏమన్నారు ?

భారతీయ ప్రస్థానం : జాలువారిన జ్ఞాపకాలు

కొత్త చూపు.. సమాజానికో దారిదీపం

సంపన్న దేశాల యువత దృష్టిలో కమ్యూనిజం అంటే ఏమిటి?

విప్లవాలకు కొత్త చూపునిచ్చే లెనిన్ అధ్యయన పద్ధతి

పిల్లలకు ఏం చెప్పాలి.. ఎలా పెంచాలి ?

ఏప్రిల్ - 2025

పేజీలు : 44

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 3 - సంచిక : 7

డీవీవీఎస్ వర్మ

- సంపాదకులు

సంపాదక వర్గం

కొప్పర్తి వెంకటరమణమూర్తి

మందలపర్తి కిషోర్

డి.సోమసుందర్

డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..


1). విదేశీ ప్రేరిత ఉగ్రవాదుల దుశ్చర్య
- సంపాదకీయం 3

2). నయాకశ్మీర్ పహల్గాంకు ఎలా చేరింది
- రాజ్‌దీప్ సర్దేశాయ్ 4

3) వ్యవస్థలు కాదు, రాజ్యాంగమే సర్వోన్నతం
- ఎ.కృష్ణారావు 6

4) శ్రామిక వర్గ కోణంలో 'సుంకాల యుద్ధం'
- రంగనాయకమ్మ 8

5) బీహార్ కులగణన - ఆర్థికాభివృద్ధి
- నెల్లూరు నరసింహారావు 9

6) సూడో సైన్సు - విరించి విరివింటి 12

7) ఫూలే దంపతుల ఆదర్శ విద్యా విధానం
- సంగిరెడ్డి హనుమంతరెడ్డి 14

8) హిందూ మతోన్మాదానికి అంబేద్కర్
ఓ సవాల్ - నాదెండ్ల శ్రీనివాస్ 16

9) మతం - ఒక సాంస్కృతిక ఆయుధంగా ఎలా మారింది? - పురుషోత్తం 17

10) ఎవరు దేశభక్తుడు ? ఎవరు దేశద్రోహి ? - ప్రకాశ్‌రాజ్ 24

11) వ్యంగ్యం వద్దు కవిత్వం వద్దు, కావలసింది ప్రభుత్వ భజనే.. - మాడభూషి శ్రీధర్ 25

12) విష వలయంలో ఆంధ్రప్రదేశ్ 27

13) "ముసల్మాన్ల మొహల్లా" - నిఖిల్ సచాన్ 29

14) హిందుత్వ- హిందూ మతాల మధ్య తేడాపై అరుణ్‌శౌరీ ఏమన్నారు ?
- కొండూరి వీరయ్య 31

15) భారత ప్రస్థానం: జాలువారిన జ్ఞాపకాలు - రామచంద్ర గుహ 33

16) కొత్త చూపు.. సమాజానికో దారిదీపం - బంగారు వి బి ఆచార్యులు 35


17) సంపన్న దేశాల యువత దృష్టిలో కమ్యూనిజం అంటే ఏమిటి? - రాజు దాస్ 37

18) విప్లవాలకు కొత్త చూపునిచ్చే లెనిన్ అధ్యయన పద్ధతి - డి వి వి యస్ వర్మ 40

19) పిల్లలకు ఏం చెప్పాలి ? ఎలా పెంచాలి ? - పెరియార్ రామస్వామి 42

20 ) కార్టూన్లు.. 43

21) కొత్త పుస్తకాల స్వీకారం 44


కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM

దారి దీపం

మాసపత్రిక

మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495



# విదేశీ ప్రేరిత ఉగ్రవాదుల దుశ్చర్య

కాశ్మీర్ పహల్గాంలోని బైసరన్ మైదానంలో ఉగ్రవాదులు పర్యాటకులపై చేసిన పైశాచిక దాడి దేశ ప్రజలను దిగ్భ్రాంతులను చేసింది. ఈ దుండగులు 26 మంది పర్యాటకుల్ని బలి తీసుకున్నారు. వీరంతా నిరాయుధులు. ఆహ్లాదకరమైన ప్రకృతి అందాలను ఆస్వాదించడానికి వచ్చిన వారు. అలాంటి ప్రకృతి ప్రేమికుల ఆనందాన్ని విషాదం చేశారు. ఆయా కుటుంబాలను కకావికలం చేశారు. ఉగ్రవాదం ఒక ఉన్మాదం. మతం దానికి కేవలం ముసుగు మాత్రమే. మానవీయతను కోల్పోయిన మతం, రాజకీయంలోకి మారిన మతం సృష్టించే వికృత రూపం ఉగ్రవాదం. ఇది ఏ ఒక్క మతానికో ప్రత్యేకమైంది కాదు. మతం దారి తప్పి ఉన్మాదంగా, రాజకీయ సాధనంగా మారితే ఏ మతమైనా ఈ వికృత రూపాన్ని ధరిస్తుంది.

కాశ్మీర్ ఒక అంతర్జాతీయ పర్యాటక కేంద్రం. అందులో పహల్గాంలోని బైసరన్‌కు చాలా ప్రత్యేకతలు వున్నాయి. ప్రపంచంలో ప్రకృతి రమణీయతకు ఇది ప్రసిద్ధి. హిమాలయ పర్వతాల నేపథ్యం, పలు వృక్ష జాతుల వనాలు, విశాలమైన మైదానాలు, ట్రెక్కింగ్‌కు అనువైన ప్రదేశాలు, మండు వేసవిలో సైతం పది డిగ్రీలకు మించని ఆహ్లాదకర వాతావరణంతో పర్యాటకుల్ని ఆకర్షిస్తుంది. కాశ్మీర్ ఆర్థిక వ్యవస్థ పర్యాటకం మీదే ప్రధానంగా ఆధారపడింది. అక్కడి ప్రజలు.. ప్రత్యేకించి పేదలకు పర్యాటకులే జీవనాధారంగా వున్నారు. అందుకే కాశ్మీర్ ప్రజలు పర్యాటకులను ఎంతో ప్రేమగా చూసుకుంటారు. పర్యాటకులను గుర్రాల మీద సందర్శన స్థలాలకు చేరుస్తారు. కొన్నిచోట్ల పర్యాటకులను తమ భుజాలపై ఎత్తుకుని తీసుకువెళతారు. ఇలా వచ్చిన సంపాదనతోనే కుటుంబాలను పోషించుకుంటారు. పర్యాటకుల వల్ల వారికున్న అనుబంధం ఈ ఉగ్రదాడిలోనూ మనకు కనిపిస్తుంది. ఉగ్రదాడి నుంచి పర్యాటకుల్ని కాపాడడంలో ఒక ముస్లిం మరణించాడు. చాలా మంది పర్యాటకులు తమకు ముస్లిం సోదరులు ఎలా రక్షణగా నిలబడిందీ చెప్పారు. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించడంలో వారు ప్రధాన పాత్రధారులుగా వున్నారు.

ఈ దాడి హిందూ ముస్లిం మధ్య జరిగిన దాడి కాదు. ఇది ఉగ్ర దాడి. ఈ దాడి చేసింది లష్కరే తోయిబా సంస్థకు అనుబంధంగా వున్న టీఆర్ఎఫ్ సంస్థ. ఇదొక అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ. దీనికి పాకిస్థాన్ మద్దతు వుంది. వారి శిక్షణ వుంది. భారత్‌లో చొరబాటుకు సహకారం వుంది. ఇది పాకిస్థాన్‌లోని పాలకవర్గాల దుష్ట పన్నాగం. భారతదేశాన్ని బలహీన పర్చడానికి చేస్తున్న కుట్రపూరిత కార్యకలాపం. దీన్ని తిప్పికొట్టాల్సిందే. విదేశీ ఉగ్రవాదం, చొరబాటుదారులకు కాశ్మీర్‌లో ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించే వారు లేకపోతే వాళ్లు తేలిగ్గా దొరికిపోతారు. మరోసారి ప్రవేశించడానికి సాహసించరు. అలా జరగాలంటే కాశ్మీర్ యువతను నిరుద్యోగం నుంచి బైట పడెయ్యాలి. వారిలో వున్న అసంతృప్తిని తొలగించాలి. దేశంలోనే అత్యధికంగా నిరుద్యోగాన్ని పెంచింది మోదీ ప్రభుత్వం. కాశ్మీరులో అది మరింత విస్తృత స్థాయిలో యువతను తీవ్ర అసంతృప్తికి గురిచేస్తూ ఉగ్రవాద కార్యకలాపాలకు ఏదో రూపంలో మద్దతు ఇచ్చే స్థితిని కల్పించింది.

ఆర్టికల్ 370 రద్దు తర్వాత 'పరిస్థితి' మెరుగైనట్లు మోదీ, షాలు చేస్తున్న ప్రకటనలు నీటి బుడగల్లా తేలిపోతున్నాయి. కాశ్మీర్‌ను ముక్కలు చేశారు. రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతం చేశారు. రాష్ట్ర హోదా కల్పిస్తామన్న హామీని తుంగలో తొక్కారు. కాశ్మీర్ ప్రజలు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో మునుపెన్నడూ పాల్గొనని రీతిలో అత్యధికంగా ఓట్లు వేశారు. కాని, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని మోదీ ప్రభుత్వం పక్కన పెట్టి కేంద్ర పాలిత ప్రాంతం పేరుతో అన్ని అధికారాలు గవర్నర్‌కు కట్టబెట్టింది. పాలనాధికారాలు లేని ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే స్థితిలో లేదు. రక్షణ బాధ్యత నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వ భద్రతా వైఫల్యం ఈ ఘటనలో స్పష్టంగా కనిపించింది. ఈ సంఘటనను హిందూ ముస్లిం ఘర్షణగా దిగజార్చకుండా దేశ ప్రజలందరూ సమైక్యంగా ప్రతిఘటించడానికి తగిన ఐక్యతా సందేశాన్ని ఇవ్వాలి. మృతుల కుటుంబాలకు దారిదీపం సానుభూతి తెలియజేస్తుంది.

- డీవీవీఎస్ వర్మ
సంపాదకులు, 85006 78977

# నయాకశ్మీర్ పహల్గాంకు ఎలా చేరింది



- రాజ్‌దీప్ సర్దేశాయ్

జమ్మూ కశ్మీర్‌లో సుదీర్ఘకాలంగా ఎడతెగని హింసాత్మక సంఘర్షణను వర్ణించే, వివరించే, వ్యాఖ్యానించే పదజాలంలో ఒక మాట మళ్లీ మళ్లీ ప్రస్తావితమవుతోంది. ఆ పునరావృత పదమే 'సాధారణ పరిస్థితి'. కశ్మీర్ లోయలో సాధారణ పరిస్థితి ఎలా పునరుద్ధరింపబడిందో రాజకీయవేత్తలు, పరిశీలకులు, పాత్రికేయులు విజయోత్సాహంతో తరచూ మాట్లాడుతుండడం కద్దు. వాస్తవమేమిటి? మూడున్నర దశాబ్దాలుగా కశ్మీర్‌లో పరిస్థితులు సాధారణ స్థాయిలో ఉన్నాయని చెప్పేందుకు వీలు లేని భిన్న రీతిలోనే ఉంటూ వస్తున్నాయి. ఇదొక కఠోర సత్యం. హింసారిరంస తో రక్తమోడుతున్న కశ్మీర్ లోయలో పరిస్థితులు చక్కపడతాయనే ఆశాకుసుమాలు వికసించిన ప్రతిసారీ ఉగ్రభూతాలు వాటిని ఛిద్రం చేసేస్తున్నాయి. ఉగ్రవాద కాఠిన్యానికి పహల్గాంలో నిన్న గాక మొన్న కనీసం 28 మంది పర్యాటకులు హతమారిపోవడం ఆ విషాద, వికృత సత్యాన్నే మరొకసారి గుర్తు చేస్తూ జాతిని కలచివేస్తోంది. ప్రాణాంతకమైన ఒక విపత్కర పరిస్థితిలో కశ్మీర్ చిక్కుకున్నది. ఆగస్టు 2019లో జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న అధికరణ 370ని రద్దు చేసిన అనంతరం ఒక కొత్త కశ్మీర్ (నయా కశ్మీర్) విషయమై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన దార్శనికతను ఎలా ఆవిష్కరించారో గుర్తు చేసుకోండి. కశ్మీర్‌లో మామూలు పరిస్థితులను పునరుద్ధరించే దిశలో అదొక ప్రధాన ముందడుగు అని మోదీ పేర్కొన్నారు. త్వరలోనే పెట్టుబడుల వెల్లువను కశ్మీర్ చూడనున్నదని ప్రధానమంత్రి హామీ ఇచ్చారు. సత్వరమే మౌలిక సదుపాయాలను అభివృద్ధి పరుస్తామని వాగ్దానం చేశారు. బాలీ వుడ్ సినిమా మాంత్రికులు నీలాల నింగిని చుంబించే హిమవత్ప ర్వతాలు, కన్నులపండువైన పచ్చిక మైదానాలకు తిరిగి వస్తారని నరేంద్రమోదీ ఉత్సాహంగా చెప్పారు. ఇదొక 'కొత్త సాధారణ' మని, జమ్మూ కశ్మీర్ శీఘ్రగతిన 'న్యూ ఇండియా' ప్రధాన స్రవంతిలో కలిసిపోతుందని మోదీ నిశ్చిత స్వరంతో చెప్పారు. ప్రధానమంత్రి హామీ ఇచ్చిన 'సాధారణ పరిస్థితి' పైకి కనిపించే దృశ్యం. కొత్త రహదారులు, హైవేలు, కొండలు తొలిచి నిర్మించిన సొరంగాలు పెనుమార్పులకు ప్రతీకలే, సందేహం లేదు.




ఇప్పుడు శ్రీనగర్ నుంచి అనంతనాగ్ లేదా బారాముల్లాకు వాయువేగంతో వెళ్లవచ్చు. ఈ ప్రయాణ సౌఖ్యం కొద్ది సంవత్సరాల క్రితం అయితే కలలో కూడా ఊహించలేని విషయం మరి. అయితే 'సాధారణ పరిస్థితి' అనేది భౌతిక వసతులకు మాత్రమే పరిమితమైనది కాదు. అది, అంతిమంగా ప్రజల మనస్సును, హృదయాన్ని గెలుచుకోవడమే అని చెప్పి తీరాలి. అయితే ఇది జరగలేదు. కనుకనే కశ్మీరీలలో చాలా కాలంగా ఉన్న మనోక్లేశాలు, హృదయావేదనలు సమసిపోవడం లేదు. ఎలా సమసిపోతాయి? భారత్‌లో ముస్లింలు అధిక సంఖ్యాకులుగా ఉన్న ఏకైక రాష్ట్రమైన జమ్మూ-కశ్మీర్‌ను రాత్రికి రాత్రి శాసనవిహిత ఫర్మానాతో విభజించి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా కుదించి వేసినప్పుడు అక్కడ 'సాధారణ పరిస్థితి' ఎలా ఉంటుంది? ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులను అదుపులోకి తీసుకుని గృహ నిర్బంధంలో ఉంచినప్పుడు అది 'సాధారణ'మెలా అవుతుంది? వేలాది కశ్మీరీలను క్రూర చట్టాల కింద అరెస్ట్ చేసి జైళ్లలో కుక్కివేసినప్పుడు కశ్మీర్‌లో 'సాధారణ పరిస్థితి' ఎలా మొలకలేస్తుంది? నెలల తరబడి పాఠశాలలను మూసివేసినప్పుడు, ఇంటర్నెట్ షట్‌డౌన్ నిత్య వ్యవహారమైనప్పుడు 'సాధారణ పరిస్థితి' ఎలా నెలకొంటుంది? కశ్మీర్ లోయలో అడుగడుగునా వేలాది సైనికులను మోహరించినప్పుడు భారత ప్రభుత్వ వాగ్దానాలను కశ్మీరీలు ఎలా విశ్వసిస్తారు? ఆ అందమైన లోయకు 'సాధారణ' జీవన సౌందర్యం మళ్లీ ఎలా సమకూరుతుంది? భయభీతులను వ్యాపింపచేసేందుకు, హింసాకాండను రగిలించేందుకు కశ్మీరీ యువకులకు ఆయుధాలు, శిక్షణ ఇవ్వడాన్ని పాకిస్థానీ దుష్ట రాజ్యవ్యవస్థ కొనసాగిస్తున్నప్పుడు 'సాధారణ పరిస్థితుల' దిశగా కశ్మీర్ ఎలా పురోగమిస్తుంది? గత ఏడాది తొలుత లోక్‌సభకు, ఆ తరువాత విధానసభకు జరిగిన ఎన్నికలలో అంతకు ముందు ఎన్నడూ లేని రీతిలో అత్యధిక ఓటర్లు తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకున్నారు. కశ్మీర్‌లో నెలకొన్న సాధారణ పరిస్థితులను ఈ పరిణామాలు ప్రతిబింబించడం లేదా అని

హిమాలయ శిఖరాలనెక్కి కన్యాకుమారిలోని వారికి కూడా వినపడేలా ప్రశ్నించారు. ఏ కశ్మీరీ వేర్పాటువాద పార్టీ కూడా ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునివ్వలేదు. ఓటు వేయవద్దని ఓటర్లను ఒత్తిడి చేయలేదు. వేర్పాటువాద పార్టీల సమష్టి వేదిక అయిన హురియత్ కాన్ఫరెన్స్ సర్వశక్తిమంతమైన భారత రాజ్య యంత్రాంగం పుణ్యమా అని కకావికలైపోయింది.

జమ్ము-కశ్మీర్‌కు ఒమర్ అబ్దుల్లా ప్రజాస్వామ్యబద్ధంగా 'ఎన్నికైన' ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన పార్టీ పూర్తి మెజారిటీని సాధించుకున్నది. అయితే ముఖ్యమంత్రికి ఎలాంటి అధికారాలు, కనీసం కీలక అధికారులను నియమించేందుకు, బదిలీ చేసేందుకు సైతం అధికారాలు లేనప్పుడు అది 'సాధారణ' ప్రజాస్వామ్య పాలన ఎలా అవుతుంది? కశ్మీర్‌తో ఎటువంటి సంబంధమూ లేని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక కాని లెఫ్టినెంట్ గవర్నర్‌కు శాంతిభద్రతల సంరక్షణతో సహా సమస్త అధికారాలను కట్టబెట్టడం 'సాధారణ పరిస్థితి' పునరుద్ధరణకు ఎలా దోహదం చేస్తుంది? ప్రత్యేక ప్రతిపత్తిని కోల్పోయిన తమ రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర హోదా పునరుద్ధరణ జరుగుతుందనే ఆశాభావంతోనే జమ్ము-కశ్మీర్ ప్రజలు సంఖ్యానేకంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొన్నారు. కేంద్రం తన హామీని నెరవేర్చలేదు. కశ్మీరీల ఆశలు వమ్మయ్యాయి. 'సాధారణ పరిస్థితులు' నెలకొన్నాయనే విషయమై కేంద్ర ప్రభుత్వ కథనాలు, కోవిడ్ అనంతరం పర్యాటక రంగం పుంజుకోవడంలో భాగంగా కశ్మీర్ లోయకు పర్యాటకులు వెల్లువెత్తడాన్ని ప్రస్తావిస్తున్నాయి. శ్రీనగర్ ఉద్యాన వనాలలో ట్యులిప్ పువ్వులు శోభాయమానంగా వికసిస్తున్నాయి. దాల్ సరస్సులో యాత్రికులు విహరిస్తున్నారు. పహల్గాంలో ట్రెక్కింగ్, గుల్మార్గ్‌లో స్కీయింగ్ సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. పర్యాటక-స్నేహపూరిత గమ్యంగా జమ్ము కశ్మీర్‌ను ప్రమోట్ చేసేందుకు కేంద్రం మే 2023లో శ్రీనగర్‌లో ఒక జీ20 పర్యాటక సదస్సును నిర్వహించింది. అయితే పర్యాటక రంగం పుంజుకోవడమే సాధారణ పరిస్థితి'కి ఎంత మాత్రం చిహ్నం కాదు. ప్రజలు భయరహితంగా సంచరించడం, ఉగ్రవాద కార్యకలాపాలు పూర్తిగా సమసిపోవడం, ఉగ్రవాదులు తమ ఇష్టానుసారం దాడి చేయలేని అశక్తతలో పడడమే సాధారణ పరిస్థితుల పునరుద్ధరణకు నిదర్శనమవుతుంది. ఉగ్రవాద దాడులలో చనిపోయిన పౌరుల సంఖ్య ఇటీవలి సంవత్సరాలలో బాగా తగ్గిపోయిందని కేంద్రం చెప్పడం సమర్థనీయమే.

అయితే ఉగ్రవాద మిలిటెంట్లు, సాయుధ బలగాల మధ్య ఎన్‌కౌంటర్లు కొనసాగుతున్నాయన్న నిష్ఠుర సత్యాన్ని ఆ అంకెలు మరుగు పరుస్తున్నాయి. 'సాధారణ పరిస్థితులే' ఉంటే ఉగ్రవాదులు లక్షిత దాడులకు ఎలా పాల్పడుతున్నారు? అక్టోబర్‌లో శ్రీనగర్‌లో ఒక ప్రముఖ కెమిస్ట్, ఒక ఆహార విక్రేత, ఒక టాక్సీ డ్రైవర్‌ను ఒక గంట వ్యవధిలోనే ఉగ్రవాదులు కాల్చివేసిన వైనాన్ని గుర్తుచేసుకోండి. హతుడైన కెమిస్ట్ మఖన్‌లాల్ బింద్రూ ఒక కశ్మీరీ పండిట్. 1990ల్లో లోయ నుంచి పండిట్‌లు పెద్ద సంఖ్యలో వేరే రాష్ట్రాలకు శరణార్థులుగా వెళ్లిపోయినప్పటికీ మఖన్‌లాల్ తన స్వస్థలంలోనే ఉండిపోయారు. కశ్మీరీ హిందూ కుటుంబాలు ఇప్పటికీ తమ పూర్వీకుల గృహాలకు తిరిగి రాలేకపోవడం 'సాధారణ' పరిస్థితులకు ఎలా అద్దం పడుతుంది?

అమర్‌నాథ్ యాత్ర ఇప్పటికీ ఉగ్రవాద దాడుల భీతిలోనే జరుగుతుండడం సాధారణ పరిస్థితుల పునరుద్ధరణను ఎలా సూచిస్తుంది? పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో ఇస్లామిక్ ఉగ్రవాదులు తమ ప్రభావ ప్రాబల్యాలను కశ్మీర్ లోయలో మరింతగా విస్తరించుకుంటున్నప్పుడు అదెలా 'సాధారణ'మవుతుంది? లష్కరే మిలిటెంట్లకు పాకిస్థాన్ అన్ని విధాల ఆశ్రయమివ్వడం కొనసాగుతున్నప్పుడు పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ద్విజాతి సిద్ధాంతాన్ని బలపరుస్తూ కశ్మీర్‌ను పాక్ కంఠ రక్తనాళంగా అభివర్ణిస్తున్నప్పుడు లోయలో సాధారణ పరిస్థితులు నెలకొనడం ఎలా సాధ్యమవుతుంది? ఇటీవలి సంవత్సరాలలో పాకిస్థానీ 'విదేశీ' ఉగ్రవాదులు, స్థానిక కశ్మీరీలతో కలిసి హింసాత్మక దాడులకు పాల్పడడం ప్రబలిపోయింది. ఉపాధి, ఉద్యోగాలు లేని యువకులు ఉగ్రవాద కార్యకలాపాలలో పాల్గొంటూ ఉపశమనం పొందడం ఎలా 'సాధారణ'మవుతుంది? నిజమేమిటంటే సీమాంతర ఉగ్రవాదాన్ని తుదముట్టించడంలో వెనకటి ప్రభుత్వాలు విఫలమైనట్టే మోదీ సర్కార్ సైతం ఆ భయానక బెడదను నిర్మూలించలేకపోయింది. భారత్ వ్యతిరేక ఉగ్రవాద కార్యకలాపాలకు, కశ్మీర్‌లో హింసాత్మక సంఘర్షణలకు పాకిస్థాన్ ప్రభుత్వ మద్దతు కొనసాగుతుందని పఠాన్‌కోట్ నుంచి పహల్గాం దాకా సంభవించిన ఉగ్ర బీభత్సాలు రుజువు చేస్తున్నాయి. పాకిస్థాన్ రాజ్య వ్యవస్థ 'ఇస్లామీకరణ' మాత్రమే కాకుండా మన సమాజంలో తీవ్రమవుతున్న మతపరమైన విభజనలు కూడా ఆ హింసాత్మక విధ్వంసాన్ని పురిగొల్పుతున్నాయి. రాజకీయ పక్షాలు, వాటి మద్దతుదారులు విద్వేషం, మత సంకుచితత్వాన్ని నిత్య వాస్తవాలుగా చేస్తున్నప్పుడు కశ్మీర్‌లో పరిస్థితులు 'సాధారణ స్థితి'లో ఎలా ఉంటాయి? హిందూ-ముస్లిం విభేదాలు మరింతగా పెరిగిపోయేందుకు దుష్ట పాకిస్థానీ సైనిక-రాజ్య వ్యవస్థ పహల్గాం ఉగ్రవాద ఘటనను ఉపయోగించుకుంటుంది. అటువంటి దుష్ట పన్నాగాలను మనం ముందస్తుగా ఎదుర్కోవాలి. పాకిస్థాన్ తన పైశాచిక చర్యలకు భారీ మూల్యం చెల్లించి తీరాలి. అవధులు లేని ఆగ్రహంలోను, అంతులేని ఆవేదనలోను మనం ఐక్యంగా ఉండాలి. ❑

**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో..)**

# వ్యవస్థలు కాదు, రాజ్యాంగమే సర్వోన్నతం



- ఎ.కృష్ణారావు

ప్రభుత్వం, న్యాయవ్యవస్థ, గవర్నర్‌లు, ఇతర వ్యవస్థల మధ్య సంబంధాలు బలహీనపడడం, అవి పరస్పరం గౌరవాన్ని కోల్పోవడం దేశంలో అరాచక పరిస్థితులను ఏర్పడిస్తాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ సంఘటనలు రాజ్యాంగం గౌరవాన్ని కాపాడే అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి. వ్యవస్థలు పరస్పరం గౌరవం కోల్పోయి ఒక దానిపై మరొకటి దాడి చేస్తే దేశంలో అరాచక పరిస్థితి నెలకొంటుందనడంలో సందేహం లేదు. వ్యవస్థలు బలహీనపడితే వర్తమానంలో ప్రయోజనాలు లభిస్తాయని భావించే వారుంటారు కాని దీనివల్ల దీర్ఘకాలికంగా దేశం నష్టపోతుందని వివేకవంతులు గ్రహిస్తారు.

ఇవాళ దేశంలో సర్వోన్నత న్యాయస్థానం రాష్ట్రపతి, గవర్నర్ విచక్షణాధికారాల్ని ప్రశ్నిస్తోంది. రెండవ ఉన్నత రాజ్యాంగాధినేత అయిన ఉప రాష్ట్రపతి సర్వోన్నత న్యాయస్థానాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. అధికార పార్టీ ఎంపీ ఒకరు మరింత ముందుకుపోయి దేశంలో ప్రజల మధ్య యుద్ధాల్ని ప్రేరేపిస్తున్నారని ప్రధాన న్యాయమూర్తినే నేరుగా ఆక్షేపించారు. ఆ ఎంపీపై కోర్టు ధిక్కారచర్యలు తీసుకునేందుకు అనుమతిని ఇవ్వాలని అటార్నీ జనరల్‌ను సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ కోరింది. తమ పార్టీ ఎంపీ చేసిన వ్యాఖ్యలతో పార్టీకి నిమిత్తం లేదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అన్నారు. కాని ఆ ప్రజా ప్రతినిధి నోటికి అడ్డుకట్ట వేసే చర్యలు మాత్రం తీసుకోలేదు!

> **అసలు దేశంలో ఏం జరుగుతోంది ? వ్యవస్థల మధ్య సమన్వయం ఎందుకు ఏర్పడడం లేదు ? వ్యవస్థల మధ్య సంఘర్షణాయుత వైఖరి ఏర్పడుతోందని చెప్పేందుకు ఈ ఉదంతాలు తోడ్పడుతున్నాయి. అందుకు కారణం ఎవరన్నది మాత్రం చర్చనీయాంశం. మూడేళ్ల క్రితం వరకూ గవర్నర్‌గా ఉన్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖడ్, బీజేపీ ఎంపీ నిశికాంత దుబే ఎవరూ ప్రేరేపించకుండానే సర్వోన్నత న్యాయస్థానాన్ని, భారత ప్రధాన న్యాయమూర్తిని తీవ్రంగా విమర్శిస్తారా అన్న అనుమానాలకు మాత్రం ఆస్కారం ఉన్నది.**

ఈ దేశంలో న్యాయస్థానాలను విమర్శించేందుకు అనేక కారణాలు ఉండవచ్చు. న్యాయవ్యవస్థలో కూడా అవినీతి ఉండవచ్చు. న్యాయమూర్తులు ఇచ్చే తీర్పులు, కోర్టుల్లో విచారణ జరుగుతున్న తీరు, వాయిదాలు, ఆలస్యాలు ప్రశ్నార్థకం కావచ్చు. కాని న్యాయవ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టవల్సిన బాధ్యత మాత్రం అందరిపై ఉన్నది. ఎందుకంటే జరుగుతున్న పరిణామాలపై అంతిమంగా తీర్పు చెప్పవల్సింది మాత్రం న్యాయవ్యవస్థే. ఈ దేశంలో అనేకసార్లు ప్రభుత్వాలు పాల్పడిన అరాచకాల నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడిన ఘనత న్యాయ వ్యవస్థదే అన్నది స్పష్టం. అందువల్ల న్యాయవ్యవస్థ తన్ను తాను మెరుగు పరుచుకునేందుకు తోడ్పడుతూ, అదే సమయంలో తన తప్పులు కూడా సవరించుకోవాల్సిన బాధ్యత చట్టసభలు, కార్యనిర్వాహక వర్గానికి మాత్రమే ఉన్నది.

ఈ దేశంలో గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగపరుస్తున్నారని వస్తున్న విమర్శలు కొత్తవి కాదు. కాంగ్రెస్ హయాంలో ఈ వ్యవస్థ అమితంగా దుర్వినియోగమైంది. రామ్‌లాల్, కుముద్‌బెన్ జోషీ, రమేశ్ భండారీ లాంటి వారు వ్యవహరించిన తీరు చరిత్రలో నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టేందుకు గవర్నర్‌లను కాంగ్రెస్ ఉపయోగించుకున్న ఉదంతాలు ఎన్నో కదా. యూపీఏ ప్రభుత్వ హయాంలో బిహార్‌లో నితీశ్‌కుమార్‌కు బీజేపీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్నప్పటికీ అప్పటి గవర్నర్ బూటా సింగ్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించకుండా రాష్ట్రపతి పాలనకు సిఫారసు చేశారు. మన్మోహన్ సింగ్ మంత్రివర్గం ఈ సిఫారసును ఆమోదించింది. రాష్ట్రపతి పాలన ఆదేశాలపై సంతకాలు చేసే పత్రాలను రష్యా పర్యటనలో ఉన్న రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌కు పంపించి నడిరాత్రి సంతకాలు చేయించారు. సుప్రీంకోర్టు రాష్ట్రపతి పాలనను రద్దు చేసి నితీశ్ కుమార్‌కు అనుకూలంగా తీర్పునిచ్చింది. దీనితో బూటాసింగ్ తన గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. ఇక్కడ గవర్నర్, రాష్ట్రపతి రాజ్యాంగం ఇచ్చిన అధికారాలను దుర్వినియోగం చేసినట్లా కాదా ? సుప్రీంకోర్టు జోక్యం చేసుకోకపోతే ఏమయి ఉండేది ? బూటాసింగ్ తర్వాత బిహార్ గవర్నర్‌గా ఉన్న గోపాలకృష్ణ గాంధీ, నితీశ్ ప్రభుత్వం ఎడాపెడా జారీచేసిన అనేక ఆర్డినెన్స్‌లను నిలిపివేశారు. నితీశ్‌కుమార్ చాలా సందర్భాల్లో తన తప్పుల్ని గ్రహించి సరిదిద్దుకున్నారు. గోపాలకృష్ణ గాంధీ మహాత్మాగాంధీ మనుమడు. ఇదే గోపాలకృష్ణ గాంధీ పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా ఉన్నప్పుడు 2007లో నందిగ్రామ్‌లో తీవ్ర హింసాకాండ జరిగింది. పారిశ్రామిక ప్రయోజనాల కోసం సంకల్పించిన భూసేకరణను గ్రామస్తులు వ్యతిరేకించారు. పోలీసులే కాదు, సీపీఐ(ఎం) కార్యకర్తలు కూడా గ్రామస్తులపై

హింసాకాండకు పాల్పడ్డారు. దీనిపై గవర్నర్ ఈ హింసాకాండపై ఆందోళన ప్రకటిస్తూ పత్రికా ప్రకటన చేయాల్సి వచ్చింది. సమస్య పరిష్కరించే పద్ధతి ఇది కాదని ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యకు గవర్నర్ సూచించారు. మహాశ్వేతాదేవి వంటి గొప్ప రచయిత్రి గవర్నర్‌కు ఫోన్ చేసి 'ఏదైనా చేయండి ప్లీజ్' అని అభ్యర్థించారు. గోపాలకృష్ణగాంధీ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు ఇంటికి స్వయంగా వెళ్లి పరిస్థితిని అదుపులోకి తీసుకురావల్సిందిగా కోరారు. అప్పుడు కేంద్రంలో యూపీఏ ప్రభుత్వానికి సీపీఐ(ఎం) మద్దతునిస్తోంది. 'కావాలంటే నన్ను తీసేయమని చెప్పండి' అని గోపాలకృష్ణ గాంధీ ముఖ్యమంత్రికి చెప్పారు. 'నేను అలాంటి వ్యక్తిని కాదు' అని బుద్ధదేవ్ భట్టాచార్య అన్నారు. ప్రధాని మన్మోహన్ సింగ్ బుద్ధదేవ్‌కు ఫోన్ చేసి 'మీకు గోపాలకృష్ణ గాంధీకంటే మంచి గవర్నర్ దొరకడు. ఆయన ఆందోళనను అర్థం చేసుకోండి..' అని నచ్చజెప్పారు. చివరకు పరిస్థితి సద్దుమణిగింది. నందిగ్రామ్‌లో జరిగిన హింసాకాండ రాజ్యాంగ వ్యతిరేకమని హైకోర్టు తీర్పునిచ్చింది.

> **ప్రభుత్వం తీసుకున్న తొందరపాటు చర్యలను తొలుత గవర్నర్, తర్వాత హైకోర్టు సరిదిద్దింది. గ్రామీణులకు అనుకూలంగా మాట్లాడి, హింసాకాండను అరికట్టిన గోపాలకృష్ణ గాంధీ లాంటి గవర్నర్‌లు ఇప్పుడు ఎంత మంది ఉన్నారు ? గవర్నర్ పదవిలో ఉన్న వ్యక్తి ప్రభుత్వం - ప్రతిపక్షానికీ మధ్య నిష్పాక్షికంగా వ్యవహరిస్తున్నట్లు కనపడాలి.**

యూపీఏ తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ హయాంలో అన్ని వ్యవస్థలతో సహా గవర్నర్ వ్యవస్థను కూడా సరిదిద్దేందుకు నరేంద్రమోదీకి అవకాశం లభించింది. కాని ఆయన వ్యవస్థలను మెరుగు పరచడంలో ఆసక్తి చూపలేదు. అదే సమయంలో కాంగ్రెస్ దారిలోనే ఆ వ్యవస్థలను తనకు అనుకూలంగా ఉపయోగించుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేశారు. ఎవరన్నా ప్రశ్నిస్తే గతంలో జరగలేదా అని నిలదీసేందుకు ఆస్కారం ఉన్నదని ఆయనకు తెలుసు. 'రాజకీయాల్లో సరైనది న్యాయవ్యవస్థకు సరైనదని అనిపించకపోవచ్చు' అని కాంగ్రెస్ నేతలు భావించేవారు. ప్రస్తుత ప్రభుత్వమూ అదే దారిలో నడుస్తోంది. న్యాయవ్యవస్థే చట్టాలు చేస్తే పార్లమెంట్ ఎందుకు.. ప్రభుత్వాన్ని వారే నడుపుకోవచ్చు కదా అని కొందరు విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే పార్లమెంట్ నిజంగా చట్టాలు చేస్తోందా, ప్రభుత్వాన్ని అడ్డుకుంటుందా అన్న విషయం చర్చించాల్సి ఉన్నది. అసలు పార్లమెంట్, సుప్రీంకోర్టుల్లో ఏది గొప్ప వ్యవస్థ అన్న చర్చ ఎందుకు తలెత్తుతోంది? చట్టసభలు, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థ ఈ మూడింటికీ రాజ్యాంగం వేర్వేరు అధికారాలను ఇచ్చింది. ప్రతి ఒక్క వ్యవస్థ బాధ్యతలను నిర్దేశించింది. అవి తమ తమ పరిధుల్లో రాజ్యాంగం ప్రకారం రాజ్యాంగ మౌలిక స్ఫూర్తిని కాపాడుతూ పనిచేయాల్సిందే.. ఈ మూడు వ్యవస్థలను నిర్దేశించే రాజ్యాంగమే అన్నిటికన్నా గొప్పది అని చెప్పక తప్పదు. రెండేళ్ల క్రితం పంజాబ్‌లో గవర్నర్ అసెంబ్లీనే సమావేశపరిచేందుకు నిరాకరించారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడంతో ఆయన సభను సమావేశపరిచారు. ఆ తర్వాత మనీ బిల్లులతో సహా ఏడు బిల్లులను ఆమోదించకుండా తన వద్దే ఉంచుకున్నారు. దానిపై ప్రభుత్వం ఆర్టికల్ 32 క్రింద మళ్లీ కోర్టుకు వెళ్లింది. రాజ్యాంగంలోని అధికరణ 200 క్రింద గవర్నర్ బిల్లులను తన వద్ద ఉంచుకోవడానికి వీల్లేదని అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ తీర్పునిచ్చారు. తాజాగా తమిళనాడు గవర్నర్ విషయంలో కూడా సుప్రీంకోర్టు కొత్తగా ఏమీ వ్యవహరించలేదు. గవర్నర్ తన వద్ద బిల్లులను ఇష్టం వచ్చినంతకాలం ఉంచుకునేందుకు వీలు లేదని స్పష్టం చేసింది. నిర్దిష్ట కాల పరిమితిలోపు వాటిపై నిర్ణయం తీసుకోవాలని చెప్పింది.

నిజానికి గతంలో దాదాపు మూడేళ్లపాటు బిల్లులను గవర్నర్ పెండింగ్‌లో ఉంచిన ఉదంతాలు లేనే లేవు. సుప్రీంకోర్టును ప్రశ్నిస్తున్న వారు అసలీ పరిస్థితి ఎందుకు తలెత్తిందని ఎందుకు ప్రశ్నించడం లేదు? రాష్ట్రపతిని కూడా సుప్రీం నిర్దేశిస్తుందని విమర్శిస్తున్నారు కాని రాష్ట్రపతి అనే వ్యక్తి కేంద్ర మంత్రివర్గ సిఫారసులకు అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుందన్న విషయం వారు మరిచిపోతున్నారు. రాష్ట్రపతి పదవి వివాదంలో పడుతున్నదంటే అందుకు కారణం ఆయనను నిర్దేశించే కేంద్ర ప్రభుత్వానిదే కారణం. బూటాసింగ్ బిహార్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని సిఫారసు చేసినప్పుడు ఉన్నతమైన వ్యక్తి అని ఎందరో భావించే అబ్దుల్ కలామ్ కూడా వివాదంలో పడ్డారు. ప్రభుత్వంతో న్యాయవ్యవస్థకు సుహృద్భావ సంబంధాలు ఉండాలని దివంగత ప్రధానమంత్రి పీవీ నరసింహారావు అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్యతో అన్నారు. 'సుహృద్భావ సంబంధాలు అవసరం లేదు, సరైన సంబంధాలు ఉంటే చాలు' అని సీజేఐ జవాబిచ్చారు. ప్రభుత్వం, న్యాయవ్యవస్థల మధ్య సరైన సంబంధాలు ఉంటే బండి సక్రమంగా నడుస్తుంది. కాని న్యాయవ్యవస్థను తన దారికి అడ్డంగా తొలగించుకోవాలని ప్రభుత్వం భావిస్తే అది వేరే సంగతి. గతంలో ఇందిరాగాంధీ అలాంటి పని చేసి చరిత్రలో నియంతగా నిలిచిపోయారు. వ్యవస్థల్ని గౌరవిస్తున్నారా లేదా అన్నది ప్రశ్న కాదు. రాజ్యాంగాన్ని అయినా గౌరవిస్తున్నారా అన్నదే ప్రధానం. రాజ్యాంగ గౌరవాన్ని కాపాడితే అన్నీ సర్దుకుంటాయి. ❑

**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో..)**

# శ్రామిక వర్గ కోణంలో 'సుంకాల యుద్ధం'



- రంగనాయకమ్మ

కొన్ని వారాలుగా, వార్తల్లో వినవస్తున్న మాటలు: 'సుంకాలు!', 'ప్రతీకార సుంకాలు!', 'సుంకాల యుద్ధం!' 'సుంకాలు' అంటే, తేలిక మాటల్లో, చెప్పాలంటే, ప్రభుత్వాలకు చెల్లించవలిసిన 'పన్నులే!' ఒక దేశం తన సరుకుల్ని ఇంకో దేశానికి ఎగుమతి చేస్తే, దానికోసం తన ప్రభుత్వానికి కొంత పన్ను కట్టాలి. అది ఎగుమతి సుంకం. ఆ సరుకుల్ని దిగుమతి చేసుకున్న వేరే దేశపు వ్యాపారి కూడా తన ప్రభుత్వానికి కొంత పన్ను కట్టాలి. అది దిగుమతి సుంకం. ఆ ఎగుమతి సుంకమూ, ఈ దిగుమతి సుంకమూ-రెండూ కూడా, పెట్టుబడిదారీ విధానంలో, సరుకు ధరలో భాగాలే ! ఇప్పుడు 'సుంకాల యుద్ధం' అనేమాట ఎందుకు మొదలైందంటే, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇతర దేశాల నించీ అమెరికాకు వచ్చే సరుకుల మీద ఇప్ప టికే వున్న దిగుమతి సుంకాల్ని బాగా పెంచేశాడు-అని! దానికి అతను చెప్పే కారణాలు ఏమిటంటే, 'ఇన్నాళ్ళూ ఇతర దేశాలు అమెరికా నించీ దిగుమతి చేసు కున్న సరుకుల మీద భారీ సుంకాలు విధిస్తున్నాయి. అమెరికా మాత్రం ఇన్నాళ్ళూ విదేశాల నుంచి వచ్చే సరుకుల దిగుమతుల మీద భారీ సుంకాలు వెయ్యలేదు. దానివల్ల, అమెరికాకు చాలా ఆదాయం రాకుండా పోతున్నది. పైగా ఆ ఇతర దేశాల సరుకుల దిగుమతి వల్ల, జనాలు దిగుమతుల మీదే ఆధారపడతారు. అమెరికాలో పరిశ్ర మల అభివృద్ధి జరగదు. అమెరికా నించీ ఎగుమతులు తక్కువై, దిగుమతులు ఎక్కువైతే అమెరికాకు నష్టం కదా!' ఇవీ ట్రంపు మాటలు! ఈ రకపు వాదనల్ని, పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రం భాషలో, 'రక్షణ వాదం' అనీ, 'రక్షణ సుంకాలు' అనీ అంటారు. స్వదేశంలోనే పరిశ్రమల్ని అభివృద్ధిపరిచి, దేశ ప్రజలకి ఆ పరిశ్రమల్లోనే ఉద్యోగాలు కల్పిస్తానని, ట్రంప్ చెప్పే మాటలు మంచివిగానే కనపడతాయి.




కానీ, ఈ 'మంచి' అనేక ఇతర విషయాల్ని బట్టి వుంటుంది. నిజానికి పెట్టుబడిదారీ ఆర్థిక విధానానికి స్వతహాగా వున్న లక్షణం ఏమిటంటే, ఒక దేశంలో తయారయ్యే సరుకులు ఆ దేశ సరిహద్దులు దాటి, ప్రపంచమంతటా, ఎటువంటి నిబంధనలూ, అడ్డంకులూ లేకుండా అమ్మకాలు జరగాలి-అని! దీన్నే 'స్వేచ్ఛా వ్యాపారం' అంటారు. ఇందులో, సుంకాల సమస్య ఘర్షణగా వుండదు. ఏ ఖర్చు ఎంత అవసరం అయితే, అంతకుమించి చేరదు. కానీ, పెట్టుబడిదారీ విధానానికి పుట్టుకతో వున్న అసలు జబ్బు 'పోటీ'. ఈ పోటీలో నెగ్గడానికి రావడానికి, కొన్ని దేశాలలోని పెట్టుబడిదారులు వేసే ఒక ఎత్తుగడ ఈ 'రక్షణ సుంకాలు'. ఇప్పుడు ట్రంప్ ప్రారంభించిన ఈ సుంకాల యుద్ధం కూడా అలాంటి ఎత్తుగడే! ఇప్పుడు, పత్రికల్లోనూ, టీవీల్లోనూ చర్చలన్నీ ట్రంప్ ప్రకటించిన దిగుమతి సుంకాల పెంపుల గురించే! దిగుమతి సుంకాలు ఎక్కువైతే, ధర పెరిగి, మిగిలే లాభం తక్కువ. సుంకాలు తక్కువ అయితే, ధర తగ్గి, మిగిలే లాభం ఎక్కువ! ట్రంపు పెంచిన సుంకాలు వేరు వేరు దేశాల మీద వేరు వేరు శాతాలుగా వున్నాయి గదా? వీటివల్ల భారతదేశానికి ఎంత నష్టం, ఎంత లాభం? భారతదేశంకంటే, చైనా వంటి ఇతర దేశాల మీద ఎక్కువ సుంకాలు వెయ్యడం వల్ల, ఆ దేశాల్లో పరిశ్రమలు పెట్టిన పెట్టుబడిదారులు, ఆ పరిశ్రమ ల్ని అక్కణ్ణించీ తక్కువ సుంకాలు గల భారతదేశానికి తరలించే అవకాశాలు ఏ రంగంలో ఎక్కువ వుంటాయి?-ఇలాంటి చర్చలే జరుగుతున్నాయి.

ఈ సుంకాల యుద్ధం అంతా అసలు వేరు వేరు దేశాల పెట్టుబడిదారుల మధ్య లాభాల పెంపుల కోసం జరుగుతున్న పోటీ మాత్రమేననే సంగతిని పత్రికల్లోనూ, టీవీల్లోనూ, మేధా వులు ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతున్నారు. మార్క్సు, ఎప్పుడో, 1847లో రాసిన, 'రక్షణ సుంకాలూ, స్వేచ్ఛా వ్యాపారమూ, కార్మికవర్గమూ' అనే వ్యాసంలో ఈ విషయాన్నే గ్రహించి చెప్పాడు, ఇలా: "రక్షణాత్మక సుంకాల వ్యవస్థ ఒక దేశంలో వున్న పెట్టుబడి చేతుల్లో, ఇతర దేశాల పెట్టుబడిని ప్రతిఘటించే, ఆయుధాలను ('వెపన్స్') పెడుతుందిబీ ఇది విదేశీ పెట్టుబడికి వ్యతిరేకంగా స్వదేశ పెట్టుబడి శక్తిని పెంచుతుంది." అయితే, రక్షణ సుంకాల సమర్థకుల వాదన ఎలా వుంటుందని మార్క్సు చెబుతాడంటే, 'విదేశీయుల సరుకులు కొనడం ద్వారా, వాళ్ళ చేతుల్లో దోపిడీకి గురి అవడం కంటే, స్వదేశస్తుల ('ఫెలో-కంట్రీమెన్') చేతుల్లో దోపిడీకి గురిఅవడం మేలు ('బెటర్')'-అని కార్మికులకు చెపుతారట, ఆ సమర్థకులు! సుంకాల యుద్ధాలు వేరు వేరు దేశాల **(మిగతా 15వ పేజీలో)**

# బీహార్ కులగణన - ఆర్థికాభివృద్ధి



- నెల్లూరు నరసింహారావు

**అడగవే అమ్మా ఈ భరతదేశం ఎదుగుతుందట**
**అడగవే అమ్మా**
**చూడవే పేదల ఆకలి పోరు ఇదే నాదేశం మారినతీరు**
**రాజ్యంలో రాజకీయ జెండాలు తప్ప మరేదీ మారలే**
**అడగవే అమ్మా**

మిట్టపల్లి సురేందర్ రాసిన పాట నుంచి కొన్ని చరణాలు

చివరి అఖిల భారతస్థాయి కుల గణనను బ్రిటీష్ వలస ప్రభుత్వం 1931లో నిర్వహించింది. 1931 జనాభా లెక్కల్లో నమోదైన ఇతర వెనుకబడిన కులాల జనాభా(ఓబీసీలు) సంఖ్య వారు పొందుతున్న 27% రిజర్వేషన్‌కంటే ఎక్కువగా ఉందని సాధారణంగా అర్థం చేసుకున్నప్పటికీ, దానిపై స్పష్టమైన డేటా అందుబాటులో లేదు. స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం నిర్వహించే జనాభా లెక్కల నుంచి వివిధ కారణాల రీత్యా కులగణనను తొలగించారు. 2021లో నిర్వహించవలసిన దశాబ్ద జనగణనను నిర్వహించడంలో నరేంద్రమోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైన నేపథ్యంలో బీహార్ ప్రభుత్వం కులగణను విజయవంతంగా పూర్తిచేసింది. ఈ సర్వే నిర్వహణను నిరోధించటానికి, దాని ఫలితాలను ప్రచురించకుండా ఆపడానికి బీజేపీ చేయగలిగిందంతా చేసింది.

2011 జనాభా లెక్కలలో భాగంగా కుల డేటాను, సంబంధిత సామాజిక-ఆర్థిక అంశాలపై సమాచారాన్ని సేకరించారు. అయితే 'సోషియో, ఎకనామిక్ కాస్ట్ సెన్సస్ (SECC) పేరుతో అలా సేకరించిన సమాచారాన్ని ఇప్పటికీ విడుదల చేయలేదు. అంటే వనరులను హేతుబద్ధంగా కేటాయించటానికి, సామాజిక సమానత్వాన్ని ప్రోత్సహించడానికి అవసరమైన గణాంకాలు అందుబాటులో లేకుండానే విధాన నిర్ణయాలు జరుగుతున్నాయని అర్థం.

బీహార్‌లో కులగణన సర్వేని నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణయంపై పాట్నా హైకోర్టు 2023 మే 4న స్టే ఇచ్చింది. దీనిపై బీహార్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీకోర్టు విచారిస్తున్నప్పుడు కేంద్ర ప్రభుత్వం తన అఫిడవిట్‌లో ఇలా పేర్కొంది. రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లో మూలాలుగల 'సెన్సెస్ యాక్ట్-1948' ప్రకారం జనగణనపై అధికారం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంది. 'రాజ్యాంగం ద్వారా కానీ, మరో మార్గం ద్వారా కానీ, మరే ఇతర సంస్థకు జనగణనను లేక దానిని పోలిన మరేదైనా గణనను నిర్వహించటానికి అధికారం లేదు' అని కూడా జోడించింది. అయితే ఆ తరువాత సమర్పించిన మరో అఫిడవిట్‌లో ఈ వాక్యం 'అజాగ్రత్త వల్ల(అఫిడవిట్‌లో) చేరింది' అని పేర్కొనటం జరిగింది. 2023 మే 18న 'పాట్నా హైకోర్టు ముందున్న విషయంపై తాము జోక్యం చేసుకోలేము' అని సుప్రీంకోర్టు ప్రకటించింది. 2023 ఆగస్టు 1న కులగణన సర్వే చట్టబద్ధమేనని పాట్నా హైకోర్టు చెప్పింది. అలా లీగల్ అవాంతరాలను అధిగమించి బీహార్ కుల గణన ఫలితాలు వెలువడ్డాయి. (TDG Network, Bihar Caste Census data: A look at its timeline, potential future impacts:)

బీహార్ జనగణన డేటా మనకు దేశవ్యాప్తంగా కుల గణన అవసరం ఎంత ఉందో తెలియజేస్తుంది. 2011లో 10.41 కోట్లుగా వున్న జనాభా ప్రస్తుతం దాదాపు 13 కోట్ల వరకు ఉంటుందని భావిస్తున్నారు. ఈ సర్వే జనాభాలో మూడు పెద్ద సామాజిక వర్గాలైన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగలు, ముస్లింల వాటాను నవీకరిస్తుంది. 2011తో పోలిస్తే SC జనాభా వాటా 16% నుంచి 19.65%కి, ST జనాభా వాటా 1.3% నుంచి 1.68%కి, ముస్లిం జనాభా 16.9% నుంచి 17.7%కి పెరిగింది. గత జనాభా లెక్కలతో పోల్చినప్పుడు ST, SCల వాటాలు బాగా పెరిగినట్టు, ముస్లిం జనాభాలో ఈ పెరుగుదల చాలా తక్కువగా ఉన్నట్టు తెలుస్తుంది. ఇక బీహార్ జనాభాలో ఇతర వెనుకబడిన తరగతుల (OBC) వాటా 63.14 శాతం అని తేలింది. ఇది జాతీయ సగటు 52% కంటే గణనీయంగా ఎక్కువ. ఈ సంఖ్య ఒక ప్రధాన ప్రశ్నను లేవనెత్తుతుంది. 15.5%గా వున్న ఆధిపత్య కులాలలోని ఆర్థికంగా బలహీన వర్గాలకు 10% కోటా ఇవ్వగలిగినప్పుడు 63% OBCలను కేవలం 27% కోటాకు ఎందుకు పరిమితం చేయాలి? (Yogendra Yadav, Bihar census identified the privileged and under-privileged castes. Go national now)

ఈ సర్వేలో OBCలలోని రెండు ఉప-వర్గాల జనాభా పరిమాణాలు ఎలా ఉన్నాయో తేలింది. 'ఉన్నత' సమూహాలైన యాదవ, కుర్మి, కుష్వాహా వంటి భూస్వామ్య రైతు వర్గాల వాటా 27.12% వరకు ఉంటుంది. ఈ 'ఉన్నత' బీసీ సమూహాలలో

యాదవులు 14.3 శాతం, కుర్మీలు 2.9 శాతం, కుష్వాహ 4.2 శాతం, బనియా 2.3శాతం (బీహార్‌లో బనియాలు OBCలలో భాగం)ఉన్నారు. సేవలు, చేతి పనులు, శారీరక శ్రమచేసే వందకు పైగావున్న చిన్న కులాల సమాహారమైన 'చాలా వెనుకబడిన కులాల (EBC)' వాటా 36.01%గా నమోదైంది. ఇది EBCలపై బీహార్ రాజకీయాలు, ప్రభుత్వ విధానం దృష్టిని మరల్చటానికి దోహదపడుతుంది.

బీహార్ జనాభాలో "జనరల్" లేదా సవర్ణ కులాల వాటా కేవలం 15.52% మాత్రమే ఉంది. ఈ వర్గంలో OBCలు కాని కొంతమంది ముస్లింలు ఉన్నారు. జనాభాలో వీరి వాటాలు ఇలా ఉన్నాయి: బ్రాహ్మణులు 3.67శాతం, రాజ్‌పుత్‌లు 3.45 శాతం, భూమిహార్లు 2.89శాతం, కాయస్థ 0.6. దీని ప్రకారం సవర్ణ హిందువుల వాటా 10.61శాతంగా మాత్రమే ఉంది. వీరికి ముస్లింలలోని అగ్రకులాలను కలిపారు. ఈ కులాల వాటాలు ఇలా ఉన్నాయి: షేక్ 3.82శాతం, పఠాన్(ఖాన్) 0.75 శాతం, సయ్యద్ 0.23శాతం. 1931 జనగణనలో సవర్ణ హిందువుల వాటా 15.4శాతంగా ఉండేది. వీరి వాటా తగ్గటానికి రాష్ట్రం నుంచి వలస పోవటం, జనాభా పెరుగుదల తక్కువగా ఉండటం కారణంగా ఉన్నాయి.

కుల విభజన హిందువులకే పరిమితం కాలేదు. బీహార్‌లోని ముస్లిం అగ్రకులాలైన షేక్ (3.82%), సయ్యద్ (0.23%), మాలిక్ (0.1%), పఠాన్ (0.75%) వంటి అష్రాఫ్ వర్గాలు ముస్లిం జనాభాలో చాలా తక్కువ నిష్పత్తిలో ఉన్నాయని ఈ సర్వేలో తేలింది. బీహార్‌లోని ముస్లింలలో నాలుగింట మూడు వంతుల మంది జులాహా, ధునియా, ధోబీ, లాల్‌బేగి, సుర్జాపురి వంటి వివిధ వెనుకబడిన వర్గాలను కలిగి ఉన్న "పస్మాందాలు" ఉన్నారు. వీరి ప్రాబల్యం పస్మాండా రాజకీయాలకు ఊతం ఇచ్చే అవకాశం ఉంది.

అలాగే మతపరంగా చూసినప్పుడు, బీహార్‌లో హిందువులు 81.99 శాతం, ముస్లింలు 17.70 శాతం, క్రైస్తవులు 0.05 శాతం, సిక్కులు 0.01 శాతం, బుద్దిస్టులు 0.08 శాతం, జైనులు 0.009 శాతం, ఇతరులు 0.12 శాతం. నాస్తికులు 0.12 శాతం ఉన్నారు. (Shemin Joy, Caste survey in Bihar: OBCs, EBCs make up 63.13% of population; Gen Category 15.52%)

మరోవైపు బీహార్‌లో కుటుంబాల నెలసరి ఆదాయం అత్యంత దయనీయంగా ఉంది. 34.1 శాతం ప్రజల నెల ఆదాయం 6000 కంటే తక్కువగా ఉంది. 29.6శాతం మంది నెల ఆదాయం 6000–10,000 మధ్య ఉంది. మొత్తంగా చూసినపుడు 63.7శాతం కుటుంబాలు రోజుకు 333 రూపాయలు, అంతకంటే తక్కువ ఆదాయాన్ని పొందుతున్నాయి. బీహార్‌లో చట్టపరమైన కనీస వేతనం రోజుకు సాధారణ కూలీకి 378 రూపాయలు, వ్యవసాయ కూలీకి రోజుకి 376 రూపాయలు ఉంది. అంటే బీహార్ ప్రజలు క్రూరమైన దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు.

నయా ఉదారవాద ఆర్థిక విధానాల పర్యవసానంగా రాష్ట్రాలలో అంతర్గతంగాను, వివిధ రాష్ట్రాల మధ్యలోను వృద్ధి రేటుతోపాటు అసమానతలు కూడా తీవ్రస్థాయిలో పెరిగాయి. 2005లో నితీష్‌కుమార్ ముఖ్యమంత్రి అయిన తరువాత బీహార్ జాతీయ సగటును మించి వృద్ధి రేటును నమోదు చేసింది. అయితే తలసరి ఆదాయంలో బీహార్ అట్టడుగునే మిగిలి పోయింది. నిజానికి 1985లో ఆర్థికవేత్త ఆశిష్ బోస్ నాలుగు హిందీ మాట్లాడే రాష్ట్రాలను 'బిమారు (BIMARU) రాష్ట్రాలని పేరు పెట్టాడు. 'బిమారు' రాష్ట్రాలైన బిహార్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్‌లే కాకుండా, ఈ రాష్ట్రాల నుంచి 2000వ సంవత్సరంలో ఆవిర్భవించిన జార్కండ్, చత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్‌లు కూడా వెనుకబడిన, పేద రాష్ట్రాలుగా మిగిలిపోయాయి.

ఒక పేద మూడవ ప్రపంచదేశంగా వున్న భారతదేశం 2015లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా ఆవిర్భవించింది. 2022లో 5వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. 2029లో అమెరికా, చైనాల తరువాత మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారనుంది. అయినప్పటికీ ప్రపంచంలో భారతీయులు అతి పేదలుగా, అత్యంత అసమానులుగా ఉన్నారు. 2022లో ప్రపంచ సగటు తలసరి ఆదాయం 12,647.5 డాలర్లు ఉండగా భారతీయుల తలసరి ఆదాయం 2388.6డాలర్లుగా మాత్రమే ఉంది. తలసరి ఆదాయం విషయంలోనే కాకుండా భారతదేశంలో యావత్ వృద్ధి గమనం గాడి తప్పిందనటానికి ఎన్నో ఆధారాలు ఉన్నాయి.

నోట్ల రద్దు, జిఎస్‌టి, కరోనా లాక్‌డౌన్‌ల తరువాత జన జీవితం తీవ్ర నైరాశ్యంలోకి నెట్టబడింది. భారతదేశం ఆర్థికంగా అనేకరంగాలలో విజయం సాధించినప్పటికీ 45 శాతం ప్రజలున్న రాష్ట్రాలలో 62 శాతం దారిద్ర్యం కేంద్రీకృతమైంది. అంతేకాకుండా దారిద్ర్యరేఖకు పైన వున్నమహిళలు, అసంఘటిత రంగ కార్మికులు, వలస కార్మికులు తిరిగి దారిద్ర్యంలోకి జారుకునే ప్రమాదం ఎల్లవేళలా పొంచి ఉంది. 2023లో నీతి అయోగ్ విడుదల చేసిన బహుళ పార్శ్వ దారిద్ర్య సూచిక (ఎంపీఐ) ప్రకారం, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్‌లతోపాటు ఆ రాష్ట్రాల నుంచి ఏర్పాటైన జార?ండ్, చత్తీస్ ఘడ్, ఉత్తరా ఖండ్ రాష్ట్రాలు బహుళ పార్శ్వ పేదలున్న రాష్ట్రాలలో అగ్రభాగాన ఉన్నాయి. బహుళ పార్శ్వ దారిద్ర్య సూచిక కుటుంబ ఆదాయంలో లేమితోపాటు ఆరోగ్యం, విద్యలలో లేమిని పరిగణనలోకి తీసుకుంది.

నీతి అయోగ్ నివేదిక నిస్పృహకు గురిచేసే అనేక ధోరణులను

పేర్కొంది. వాటిలో ముఖ్యమైనవి: అధిక ఉత్పాదకత, అధిక వేతనాలుగల తయారీరంగం నుంచి తక్కువ ఉత్పాదకత, తక్కువ వేతనాలుగల వ్యవసాయ రంగంలోకి, స్వయం ఉపాధిలోకి మారటం ఒక ధోరణిగా ఉంది. ఇది ముఖ్యంగా మహిళలకు వర్తిస్తుంది. వ్యవసాయేతర రంగాలలో అసంఘటిత వ్యాపారాలు పెరగటం మరొక ధోరణి. అంటే తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవటం ఈ ధోరణి లక్షణం. 2017-18లో 68.2 శాతంగా వున్న వీటి సంఖ్య 2022-23లో 74.3 శాతానికి పెరిగాయి.

దీనికి తోడు 2017-18 నుంచి నిజ వేతనాలు పడిపోవటం ప్రారంభమైంది. 2020-21లో నిజ వేతనాలు పడిపోయాయని 2022-23లో అంతర్జాతీయ లేబర్ ఆర్గనైజేషన్(ఐఎల్ఓ) తన వేతనాల నివేదికలో ధృవీకరించింది. ఆశ్చర్యకరంగా ఐఎల్ఓ డేటాబేస్ ప్రకారం భారతదేశంలోని కార్మికులు వారంలో చాలా దేశాలలోకంటే ఎక్కువగా 47.7 గంటలు పనిచేస్తుండగా అమెరికన్ కార్మికులు 36.43గంటలు, బ్రిటీష్ కార్మికులు 35.95 గంటలు, చైనీస్ కార్మికులు 46.1 గంటలు పనిచేస్తున్నారు. (Prasanna Mohanthy, What Bihar caste census tells about India growth story)

మరోవైపు దేశంలో నిరుద్యోగిత విలయతాండవం చేస్తోంది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ది ఇండియన్ ఎకానమీ (CMIE) నిరుద్యోగితపై వెల్లడించిన డేటా భయంకరమైన దృశ్యాన్ని ఆవిష్కరిస్తోంది(Prabhat Patnaik, Jobs in India: Gone With the Neoliberal Wind) కోవిడ్ మహమ్మారికి ముందు నుండి కొన్ని సంవత్సరాలుగా నిరుద్యోగిత రేటు బాగా పెరుగుతూ వచ్చింది. మహమ్మారి సమయంలో మరింతగా పెరిగిన నిరుద్యోగిత స్థూల జాతీయోత్పత్తి (GDP) స్థాయిలో కోలుకున్నప్పటికీ పెద్దగా తగ్గలేదు. 2017-18లో 4.7%గా ఉన్న నిరుద్యోగిత రేటు 2018-19లో 6.3%కి పెరిగింది. మహమ్మారితో సంబంధం ఉన్న లాక్‌డౌన్ కాలమైన డిసెంబర్ 2020లో ఇది 9.1%. దాకా పెరిగింది. స్థూల జాతీయోత్పత్తిలో పెరుగుదల నిరుద్యోగిత రేటును ఏ మాత్రం ప్రభావితం చేయలేకపోతోంది. తాజా గణాంకాల ప్రకారం గత కొన్ని నెలలుగా నిరుద్యోగిత రేటు 8శాతం దగ్గర కొనసాగుతూవుంది.

కులగణనలో ప్రధాన అంశమైన రిజర్వేషన్ల విషయానికి వస్తే, రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలనే వివిధ కుల సంఘాలు, పౌర సమాజం చేస్తున్న డిమాండ్‌ను ఆమోదించినా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించటం వల్ల అందుబాటులోకి వచ్చే ఉద్యోగాల సంఖ్య అంతగా ఉండకపోవచ్చు. ప్రైవేటీకరణ, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టులు, నియామకాలు చేయకపోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ విధానాన్ని నిర్వీర్యం చేస్తోంది. ఇది ఉపాధి అవకాశాలను ప్రభావితం చేస్తుంది. పర్యవసానంగా భారతదేశంలో స్వాతంత్ర్యం తర్వాత అత్యధిక నిరుద్యోగిత రేటు నమోదవుతోంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ డేటా ప్రకారం, ప్రభుత్వంలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఉపాధి 3.8% వద్ద అత్యల్పంగా ఉంది. ఇది అర్జెంటీనాలో 16.9%, చైనాలో 12.3%, 28%, అమెరికాలో 13.3%, బ్రిటన్లో 21.5%, రష్యాలో 40.6%, క్యూబాలో 77% గా ఉంది.

కాబట్టి ప్రభుత్వంలో, ప్రభుత్వ రంగ సంస్థలలో మరిన్ని ఉద్యోగాలు సృష్టించాలి. దీంతో SC%లు (15%), STలు (7.5%), %OBC%లు (27%), సంవత్సరానికి రూ. 8 లక్షల కంటే తక్కువ ఆదాయం ఉన్న అగ్రవర్ణ కులాలలో(7.5%) బలహీనవర్గాలు, మాజీ సైనికులు, శారీరకంగా వికలాంగులకు ఉపాధి లభిస్తుంది. 2015లో విడుదలైన ఏడవ కేంద్ర వేతన సంఘం నివేదిక ప్రకారం 52 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయవలసి ఉంది. 2019 మార్చి 1 నాటికి ఖాళీల సంఖ్య 40.66 లక్షలకు తగ్గింది. వీటిలో 31.43 లక్షలు మాత్రమే భర్తీ చేయబడ్డాయి. అంటే మొత్తం 20.57 లక్షలు తగ్గాయి. ఈ ఖాళీలను భర్తీ చేస్తే, 3,08,550 ఎస్సీలు, 1,54,275 ఎస్టీలు-5,55,390 ఓబీసీలు ఉపాధి పొందేవారు. మొత్తంగా, 20.57 లక్షల కుటుంబాలు తమ స్థితిని మెరుగుపరుచుకునేవి. వారి పిల్లలకు మెరుగైన విద్య, జీవన నాణ్యత లభించేది. (Thomas Franco, Increasing Privatisation Killing Reservation as Unemployment Soars)

మార్టిన్ వోల్ఫ్ అమెరికా గురించి చెప్పింది భారతదేశానికి కూడా వర్తిస్తుంది. ఆయన తన "ది క్రైసిస్ ఆఫ్ డెమోక్రటిక్ క్యాపిటలిజం"(పెంగ్విన్ ప్రెస్)లో నొక్కి చెప్పినట్లుగా అసమానత ప్రతిచోటా ఉంది. సంస్థల స్థాయిలో: 1980లో, సీఈఓలకు సగటు ఉద్యోగి కంటే దాదాపు నలభై రెండు రెట్లు ఎక్కువ జీతం అందింది. 2016లో, వారికి మూడు వందల నలభై ఏడు రెట్లు ఎక్కువ జీతం ఇచ్చారు. మొత్తం సమాజ స్థాయిలో: అమెరికన్లలో అత్యంత సంపన్నులుగావున్న 1% మంది, అంటే 30లక్షల మంది సంపద, దిగువన ఉన్న 99% మంది, అంటే 29కోట్ల మంది సంపద కంటే ఎక్కువగా ఉంది. నయా ఉదారవాద వ్యవస్థ కారణంగా పెరిగిన అసమానతలు పౌర సమాజానికి తక్షణ ముప్పును కొనితెస్తాయి. ఏదిఏమైనప్పటికీ నయా ఉదారవాదంపై సూర్యుడు అస్తమించాడు. మార్కెట్ భాష దాని మాయాజాలాన్ని కోల్పోయింది. (Louis Menand, The Rise and Fall of Neoliberalism )

ప్రపంచంలో అత్యంత అసమాన దేశాలలో భారతదేశం ఒకటి. జనాభాలో అగ్రభాగానవున్న 10% మంది ఆధీనంలో 77% జాతీయ సంపద ఉంది. భారత జనాభాలో అత్యంత ధనవంతులైన 1% మంది చేతుల్లో 53% దేశ సంపద ఉంది. అయితే జనాభాలో దిగువనగల సగం **(మిగతా 16వ పేజీలో)**

# సూడో సైన్సు



- విరించి విరివింటి

Artificial intelligence సహాయంతో పెద్ద మొత్తంలో డాటాను ఉపయోగిస్తూ, జెనెటిక్ ప్రొఫైలింగ్ సహాయంతో పర్సనలైజ్డ్ ట్రీట్మెంట్ ప్లాన్‌లను డిజైన్ చేసుకుంటూ, minimally invasive technologiesతో సర్జరీలను, రికవరీలను సులభతరం చేస్తూ, స్టెమ్ థెరపీలతో పాడైపోయిన శరీర భాగాలను రిజెనెరేట్ చేస్తూ కొత్త తరహా వైద్య విధానాలతో మోడెర్న్ మెడిసిన్ ఒకవైపు దూసుకుపోతున్న సందర్భంలో ఈ రోజు మనం ఉన్నాం. (AI, జెనెటిక్ ప్రొఫైలింగ్ వంటి వాటి సహాయంతో ఒక పేషంట్‌కి ఏం మందు ఏ విధంగా పని చేస్తుందో తెలుసుకుని ఆ మందు ఆ వ్యక్తి వాడాలా వద్దా అన్నంత precision భవిష్యత్తులో రాబోతోంది). ఐనా గానీ సామాన్య ప్రజలలో గుండె జబ్బుల విషయంలో అవగాహనల కూ అభివృద్ధి చెందుతున్న వైద్య విధానాలలోని trendsకు మధ్య చాలా అంతరం ఉంది. ఈ అవగాహన లోపం వలన ఆకస్మిక మరణాన్ని కలిగించే జబ్బులుగా గుండె జబ్బులు ఈరోజుకీ ముందు వరుసలో ఉండిపోతున్నాయి. Deaths related to heart attacks తగ్గాలంటే మనముందు ఉన్న ఏకైక మార్గం ఈ జబ్బులపై అవసరమైనంత మేరకు అవగాహనను ప్రజానీకంలో పెంచడం. 'అవసరమైనంత మేరకు' అని ఎందుకు అంటున్నానంటే ఈ రోజు గుండెలో నొప్పివొస్తే ఏం చేయాలి అని ఎవరినైనా అడిగితే సోషల్ మీడియా యూట్యూబ్ వీడియోల పుణ్యమా అని ఎవరికి తోచింది వారు చెప్పడం మొదలు పెడుతున్నారు. కానీ, ఎవరూ సకాలంలో డాక్టర్ దగ్గరికి పోవడం ఏవిధంగా ప్రాణాలను కాపాడుతుందో చెప్పే నాథుడు లేకపోవడం కనిపిస్తుంది. అంటే అనవసరమైన చాలా విషయాలను ప్రజలు నేర్చుకున్నారే తప్ప అవేవీ వాళ్ళ ప్రాణాలను కాపాడవనే విషయం తెలుసుకోకపోవడం కనిపిస్తుంది. అంతేకాకుండా సామాన్య ప్రజానీకానికి ఏది సైన్సు? ఏది న్యూసెన్స్? అనేది తెలియడం కష్టతరమౌతోంది కూడా.

ఒకవైపు వైద్య సంబంధ టెక్నాలజీ, సైన్సులో మనం దూసుకుపోవడం, మరోవైపు సోషల్ మీడియా తాలూకు సొంత వైద్యాలు పెరిగి ప్రజలను అజ్ఞానపుటంచుల్లోనే కాకుండా కత్తి అంచున ప్రాణాలను నిలపడం వంటి విచిత్ర పరిస్థితుల్లో మనం ఉన్నాం. అంటే జ్ఞానం ఒకవైపు పెరుగుతుంటే అందుకు సమాంతరంగా అజ్ఞానం మరోవైపు పెరుగుతుంది. మన సమాజంలో జ్ఞానం నిటారుగా verticalగా పెరగటం, అజ్ఞానం horizontalగా పెరగటాన్ని గమనించవచ్చు. WHO వంటి సంస్థలు గుండె జబ్బుల విషయంలో అలారాలు మోగిస్తున్నా గానీ దానిపై చర్చ కానీ రావలసినంత అవేర్‌నెస్ గానీ సామాన్య ప్రజానీకంలో రాలేదు. ఒక సమస్య గురించి అతి సామాన్య మానవుడు కూడా అవసరమైన జ్ఞానాన్ని కలిగి ఉన్నప్పుడే మనం ఆ సమస్యకు సంబంధించిన అవగాహన ప్రజానీకంలో పెరిగింది అని చెప్పగలం. ఈ రోజు గుండె జబ్బులకు సంబంధించిన సింపుల్ ప్రశ్నలను ఎవరైనా సామాన్య జనాన్ని అడిగి చూడండి. అవగాహన పెంచడంలో మనం ఎంత వెనుకబడి ఉన్నామో, రోజు రోజుకీ ఎంతగా వెనుకకు నెట్టేయబడుతున్నామో తెలిసిపోతుంది.

అంతేకాకుండా 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే సూత్రం ఆధారంగా అసలు గుండె జబ్బులు రాకుండా ఏ జాగ్రత్తలు తీసుకోవాలి అనేదానిపై, అంటే preventionపై కూడా పెద్దగా చర్చలు, అవగాహన సభలు లేవు. మన జనాభాలో సిగరెట్ స్మోకింగ్ ఇరవై సంవత్సరాల క్రితం ఎలా ఉంది? ఇప్పుడెలా ఉంది అనేది బేరీజువేస్తే, అలాగే మన జనాభాలో కొవ్వు పదార్థాల వినియోగం ఇరవై సంవత్సరాల క్రితం ఎలా ఉంది ఈ రోజు ఎలా ఉంది అని బేరీజు వేస్తే ఎందుకు గుండె జబ్బులు పెరుగుతున్నాయో బేసిక్ అవగాహన వస్తుంది. ఇవి రెండే కాక అసలు సమాజంలో స్ట్రెస్ ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు ఎంతగా పెరిగిపోయింది? పని ఒత్తిడి, ఆర్థిక సంబంధమైన ఒత్తిడి, పిల్లల్లో చదువుకు సంబంధించిన ఒత్తిడి ఎందుకంతగా పెంచబడుతోంది? ఇటువంటి అంశాలన్నీ ఆబ్జెక్టివ్‌గా డేటా ఆధారంగా అనలైజ్ చేస్తే preventionలో మనం ఎందుకు వెనుకబడ్డామో ఎంత అవగాహనరాహిత్యంలో ఉండిపోతున్నామో అర్థమౌతుంది.

రెగ్యులర్ ఎక్సర్‌సైజ్ ఎంత అవసరమో డాక్టర్ దగ్గర రెగ్యులర్ చెకప్‌లు చేసుకోవడం ముఖ్యంగా మధుమేహం, హైబీపీ ఉన్న వారు, కుటుంబంలో గుండె జబ్బులు ఉన్న వారు చెకప్‌లు చేసుకోవడం చాలా అవసరం. కానీ వాటిని కూడా పట్టించుకునే స్థితిలో మనం లేం. పైగా డాక్టర్ల అవసరమే లేదనే తప్పుడు అవగాహనను ప్రజల్లో పెంచుతున్నారు. మరోవైపు ఈ జబ్బులపై విపరీతమైన భయాలను పెంచుతున్నారు. అవగాహన బదులు భయాలను పెంచడం వలన మంచి జరగకపోగా చెడే జరుగుతుంది. ఈ భయాలను ఆధారం చేసుకుని సూడో సైన్స్ మాత్రమే కాకుండా కార్పొరేట్ వైద్య వ్యవస్థలు కూడా దోపిడీ చేయడం మొదలుపెట్టాయి. దీనిపై ప్రభుత్వాల పూర్తిస్థాయి నిర్లక్ష్య వైఖరి, దీనిని కంట్రోల్ చేసే మెకనిజం మనకు ఎక్కడా కనిపించదు. ఐతే ప్రజలకు మాత్రం స్మార్ట్ ఫోన్ల రూపంలో

వస్తున్న టెక్నాలజీ, అలాగే అందుబాటులో ఉండే ఫ్యామిలీ డాక్టర్ సిస్టమ్ చాలావరకు ఉపయోగపడతాయనడంలో సందేహం లేదు. గ్లూకోజ్ లెవెల్స్ నిరంతరం పర్యవేక్షించుకోవడం, పోర్టబుల్ ఇ.సి.సి. డివైజెస్ వంటి పర్సనలైజ్డ్ హెల్త్ మానిటరింగ్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. అవసరమైన వారు దీనిని ఉపయోగించుకోవచ్చు. స్మార్ట్ ఫోన్లను ఉపయోగిస్తూ రోజూ వారి నడకను, వ్యాయామాన్ని రెగ్యులరైజ్ చేసుకోవచ్చు. ఐతే ఇటువంటి వాటి వాడకం విషయంలో ఎవరికి వారు విజ్ఞతతో సరైన నిర్ణయాలు తీసుకోవడం అవసరం. మంచి పౌష్టికాహారం, మోతాదు మించని ఆహారపు అలవాట్లు, రెగ్యులర్ వ్యాయామం, చెడు అలవాట్లు లేకపోవడం, స్ట్రెస్‌ని తగ్గించే ఫలవంతమైన జీవన విధానం, మెరుగైన మానవ సంబంధాలు ప్రతీ ఒక్కరికీ అవసరం. ఇవి ఏమాత్రం తేలికగా తీసుకోవలసిన అంశాలు కాదు. వీటిని సాధించడానికి ప్రతి మనిషీ కృషి చేయ వలసిందే. తమ వల్ల కానప్పుడు ఎక్స్‌పర్ట్‌ల ఒపీనియన్ తీసుకోవా ల్సిందే. తప్పుడు సమాచారాన్ని, సూడో సైన్సు ని ఎదుర్కోవడం లో AI ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఏదైనా ఆరోగ్య సంబంధ సమాచారం కోసం యూట్యూబ్‌లు ఇతర సోషల్ మీడియా మాధ్యమాలు ఉపయోగించే బదులు ఛాట్ జి.పి.టి. మెటావంటి AI టెక్నాలజీని ప్రజలు ఉపయోగించడం మొదలు పెట్టాలి. యూట్యూబ్‌లో ఎవరిష్టమున్నట్లు వాళ్ళు చెప్పే అంశాలనన్నిం టినీ ఛాట్ జి.పి.టి. వంటి వాటి సహాయంతో అది సరైనదేనా అని బేరీజు చేసుకోవచ్చు. సైన్స్ & టెక్నాలజీ మనకు నిజమైన సైన్స్ పరిజ్ఞానాన్ని అందిస్తాయనడంలో సందేహం లేదు. ❑

# శ్రామిక వర్గ కోణంలో..

**(8వ పేజీ తరువాయి)**

శ్రామిక ప్రజల్లో అక్కడి ప్రభుత్వాల పట్ల కొన్ని రాజకీయ భ్రమల్ని కూడా కలిగిస్తాయి. ఎలాగంటే, దిగుమతి సుంకాల్ని పెంచిన దేశాల్లో జనాలు ఇలా అనుకుంటారు : "మన ప్రభుత్వం, విదేశీ సరుకుల మీద ఎక్కువ సుంకాలు వెయ్యడమే మంచిది. దానివల్ల ఆ సరుకులకు ధరలు పెరిగి, వాటిని జనం కొనరు. క్రమంగా, దిగుమతులు తగ్గిపోతాయి. దానివల్ల, మన దేశంలోనే సరుకులు తయారై, మన పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. అంటే, మన నిరుద్యోగులకి ఎన్నో ఉద్యోగాలు వస్తాయి. కాబట్టి, మనం మన ప్రభుత్వ విధానాల్ని సమర్ధిం చాలి" అనే అర్థాలకు వస్తారు. ఇతర దేశాలకు సరుకుల్ని ఎగుమతి చేసే దేశాలలోని కార్మికులేమో, "మన దేశం నించీ అక్కడికి వెళ్ళే సరుకులమీద దిగుమతి చేసుకునే ఆ దేశాలు భారీ సుంకాలు వేస్తే, అక్కడ మన సరుకులు కొనేవాళ్ళు తగ్గిపోతారు. అలా జరిగితే, ఇక్కడి పరిశ్రమల యజమానులు, తమ సరుకుల ఎగుమతులు ఎక్కువగా జరగవు గనక ఉత్పత్తులు తగ్గిస్తారు. అప్పుడు, మనలో చాలా మందికి ఉద్యోగాలు పోతాయి.

కాబట్టి, మన ఎగుమతుల మీద అక్కడ దిగుమతి సుంకాలు ఎక్కువగా పడకుండా ప్రయత్నించే మన ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలి" అనుకుంటారు. రక్షణ సుంకాల విధానం వల్ల, ప్రపంచ దేశాలలోని కార్మికులందరూ దేశాల వారీగా విడిపోయి వేరు వేరుగా ఆలోచిస్తారు. వారిలో ఐక్యతకు ఇది పెద్ద అడ్డు. సుంకాల నిజాల్ని అర్థమే చేసుకోరు. విదేశీ వర్తకంలో రక్షణ సుంకాలకు భిన్నమైన వాదన కూడా ఒకటి వుంది. అదే, స్వేచ్ఛా వ్యాపారం! అంటే, 'వర్తకం అనేది, ఎటువంటి నిబంధనలూ లేకుండా, సుంకాల పెంపులు లేకుండా, దేశాల సరిహద్దులు దాటి స్వేచ్ఛగా జరగాలి' అన్నదే ఈ వాదన సారాంశం. శ్రామిక జనాలదృష్టితో చూస్తే, రక్షణ సుంకాల విధానాన్ని సమర్ధించాలా, స్వేచ్ఛా వ్యాపారాన్ని సమర్ధించాలా-అన్న ప్రశ్న వచ్చినప్పుడు, రెంటినీ వ్యతిరేకించాలంటాడు ఎంగెల్సు. కాకపోతే, రెంటినీ పోల్చినప్పుడు, స్వేచ్ఛా వ్యాపార విధానం అనేది, 'జాతుల మధ్యా, దేశాల మధ్యా వున్న అడ్డంకుల్ని ('బారియర్స్'ని) బద్దలు కొట్టి, ప్రపంచవ్యాప్తంగా శ్రామిక వర్గానికీ-పెట్టుబడిదారీ వర్గానికీ మధ్య వున్న వైరుధ్యాన్ని మరింతగా తీవ్రతరం ('పుషెస్ టు యాన్ ఎక్స్‌ట్రీమ్ పాయింట్') చేస్తుందనీ, ఆ రకంగా అది సామాజిక విప్లవాన్ని ఒక రకంగా త్వరితం చేసే అవకాశం వుంటుందనీ మార్క్సు అంటాడు. అంటే, వేరే మాటల్లో చెప్పాలం టే, అన్ని దేశాల పెట్టుబడులూ, అన్ని దేశాల కార్మికులనూ దోస్తు న్నాయి అనే వర్గ చైతన్యం తీసుకురావడానికి అవకాశం వుం టుంది-అని! అసలు గ్రహించవలిసిన విషయం ఏమిటంటే, స్వదేశీ వర్తకమైనా, విదేశీ వర్తకమైనా, వర్తకుడికి వచ్చేది సరుకు ధరలో నించి 'కమిషను'! ఆ కమిషను, ఆ వర్తకం ఏ సరుకుతో జరుగుతుందో ఆ సరుకులో వుండే కార్మికుల 'అదనపు విలువ' లో భాగమే తప్ప ఇంకెక్కడినించో రాదు. అంటే, శ్రమదోపిడీ నించి అన్నమాట! స్వదేశీ సరుకుల ద్వారా సంపాదించే కమిష ను, స్వదేశీ కార్మికుల అదనపు విలువ అయితే, విదేశీ సరుకుల ద్వారా సంపాదించే కమిషను, విదేశీ కార్మికుల అదనపు విలువ. 'వర్తకం' అనేది-స్వదేశీ వర్తకమైనా, విదేశీ వర్తకమైనా మొత్తం అన్ని దేశాల వర్తకాలను కలిపి చూస్తే, 'ప్రపంచ వర్తక లాభాలన్నీ', ప్రపంచ కార్మికుల అదనపు విలువలలో భాగమే. అందుకే, 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి!' అనే నినాదం పుట్టింది! ఏ సమస్యని అయినా, పెట్టుబడి దారీ కోణంలో కాదు, శ్రామికవర్గ కోణంలో చూస్తేనే, అసలు నిజం కనపడుతుంది! కానీ, మన మేధావులు ఇంకా మేల్కొవడం లేదు! ❑


**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో..)**

# పూలే దంపతుల ఆదర్శ విద్యా విధానం



- సంగిరెడ్డి హనుమంతరెడ్డి

జ్యోతిబాపూలే తండ్రి గోవిందరావు జ్యోతిబాను మహారాష్ట్రలో ని పూణే పాఠశాలలో చేర్చడానికి వెళ్లారు. అక్కడి బ్రాహ్మణ గుమాస్తా జ్యోతిబాకు ప్రవేశం ఇవ్వలేదు. శూద్రులకు చదువు నిషేధమన్నాడు. జ్యోతిబా కాలంలో బ్రాహ్మణులు తప్ప ఇతర కులాల వారు చదువు సంధ్యలను ఆశించే కాలం కాదు. 19వ శతాబ్దం నుండి బ్రాహ్మణ అధ్యాపకులు బ్రాహ్మణేతరుల చదువు ను కుతంత్ర పద్ధతులతో నిరుత్సాహపరిచేవారు. వారిని చదువు మాన్పించేవారు. అధిక సంఖ్యాక కింది కులాల వారు చదువుకుంటే బ్రాహ్మణుల ఉద్యోగావకాశాలు తగ్గుతాయని వారి ఉద్దేశం. ధాక్జి దాదాజి ప్రభు అనే సంప్రదాయవాద నాయకునికి బాంబే నేటివ్ ఎడ్యుకేషన్ సొసైటీలో పలు కుబ డి ఉండేది. ఆయన కింది కులాల పిల్లలను బడుల నుండి తొలగించాడు. చదువులు మని షిని నాస్తికులుగా మారుస్తాయి. తిరగబడేటట్లు చేస్తాయి. అని ప్రచారం చేసేవారు.హిందూ పురాణాల ప్రకారం శూద్రులు చదువుకోవడం పాపం. బ్రాహ్మణులు తమ పాఠశాలల్లో సొంత కులస్తులకే సంస్కృతంలో చదువు చెప్పేవారు. దేవతల కథలు, పుక్కిటి పురాణాల రాత ప్రతులే పుస్తకాలు. వాటిని రాజుల ప్రోత్సాహంతో పురుష బ్రాహ్మణులు రాసేవారు. బ్రాహ్మణులకే ఈ పుస్తకాలను చదివే అర్హత. ఇతరులు చదివితే తీవ్రంగా శిక్షించేవారు. ఉపాధ్యాయుల ఇళ్లలో, గుళ్లలో బడులు నడిపేవారు. భూస్వాములు తమ పిల్లల కోసం ప్రత్యేకంగా ఉపా ధ్యాయులను నియమించుకునేవారు. కొందరు పేద పిల్లలను అక్కడ చదువుకోడానికి అనుమతించేవారు. ముస్లింలకు మరాఠీ, ఆంగ్ల భాషల్లో ఆసక్తి ఉండేది కాదు. తక్కువ సంఖ్యలోనైనా వారికి ఉర్దూ పాఠశాలలు ఉండేవి. దళితుల, వెనుకబడిన కులాల వారి పిల్లలకు ప్రత్యేక పాఠశాలలు లేవు. హిందువుల బడులకు ఈ పిల్లలను రానివ్వరు. అరుదుగా రానిచ్చినా ఈ పిల్లలను వేరుగా కూర్చోబెట్టేవారు. పలు సందర్భాల్లో ఒక తరగతిలో ఒక పిల్లవాడే ఉండేవాడు. పైతరగతి విద్యార్థులు కింది తరగతి పిల్లలకు చదువు చెప్పేవారు. ఈ నేపథ్యంలో శూద్రులు, అతిశూద్రుల విముక్తికి విద్య ఆయుధమని జ్యోతిబా గుర్తించారు. నిచ్చెన మెట్ల కులవ్యవస్థ, అమాయకత్వ, పేదరికాల నిర్మూలన, సమానత్వ సాధనకు విద్యా వ్యాప్తి ద్వారా కృషిచేశారు. శ్రీమతి సావిత్రిబాయికి చదువు చెప్పారు. ఉన్నత చదువులు చెప్పించారు. చదువుల తల్లిగా మార్చారు. సావిత్రి బాయి భారతంలో 17 ఏళ్ల వయసులో ఉపాధ్యాయిని అయిన తొలి స్త్రీ. చిన్న వయసులో ప్రధాన ఉపాధ్యాయురాలయ్యారు.



బాలికలకు, స్త్రీలకు పాఠశాల ప్రారంభించిన తొలి భారతీయుడు జ్యోతిరావు. జ్యోతిబా విజయాల వెనుక సావిత్రిబాయి అవిరళ కృషి ఉంది. ఈ పాఠశాలలో, బ్రాహ్మణ బడులవలె వేద పురాణాలు గాక, పాశ్చాత్య పాఠ్యాంశాలు, గణితం, విజ్ఞాన భౌగోళిక సాంఘిక మానవ వికాస శాస్త్రాలు, చరిత్ర, కళలు, వ్యాకరణం, చిత్రలేఖనం బోధించేవారు. విద్యా హక్కు చట్టం, ఉపకార వేతనాలు, మధ్యాహ్న భోజనం తమ నూతన పథకాలుగా నేటి ప్రభుత్వాలు ప్రకటించుకున్నాయి. కానీ 170 ఏళ్ల క్రితమే పూలే దంపతులు విద్యా హక్కు గురించి ప్రచారం చేశారు. దాని అమలు కు ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చారు. బడి మానే పిల్లలను తగ్గించడానికి విద్యార్థులకు భోజన వసతి, గృహ వసతి కల్పించారు. విద్యార్థి వేతనాలు ఇచ్చారు. పోషకాహార లోపాలను అరికట్టడానికి పిల్లలకు సమతు లాహారం అందించారు. ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపట్టారు. బడుల్లో గ్రంథాలయాలను స్థాపించారు. వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ముక్తా సాల్వే అన్న దళిత బాలిక దళిత సాహిత్యం, దళిత స్త్రీవాదం మొదలగు అంశాలపై వ్యాసాలు రాసింది. విద్యా ప్రాముఖ్యత గురించి తల్లిదండ్రులను చైతన్యపరచడానికి, క్రమం తప్పక పిల్లలను బడికి పంపేటట్లు ప్రోత్సహించడానికి తరచుగా తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశాలు జరిపేవారు. సావిత్రి బాయి ఉద్దేశంలో విద్య అంటే అక్షరాలు నేర్పడమే కాదు. పిల్లల మానసిక వికాసంపై దృష్టి కేంద్రీకరించడం. ఆ మేరకు విద్యా బోధనలో జాగ్రత్త వహించే వారు. పగలంతా పనిచేస్తే గాని ఆకలి తీరని వారి కోసం పూలే దంపతులు రాత్రి బడులు ప్రారంభించారు. ఆ బళ్లకు ఎక్కువగా దళితులు, వెనుకబడిన తరగతుల వారు, వారి పిల్లలు, వ్యవసాయదారులు, కార్మికులు హాజర య్యేవారు. 1882లో విద్యా కమిషన్ అధ్యక్షులు సర్ విలియం హంటర్‌కు జ్యోతిబా వినతిపత్రం అందజేశారు. అందులోని అంశాలు- ప్రాథమిక విద్యను తప్పనిసరిచేయాలి. విద్యకు బాలిక లను ప్రోత్సహించాలి. విద్య భారతీయుల అవసరాల ఆధారిత అంశాలతో ఉపయోగంగా ఉండాలి. అనాథ పిల్లలకు విద్య అందించాలి. భారత వ్యవసాయ ప్రాధాన్యతను దృష్టిలో

ఉంచుకొని వ్యవసాయాన్ని బోధనాంశాల్లో చేర్చాలి. తక్కువ స్థాయివారి పిల్లల విద్యను అడ్డుకుంటున్న 'వడబోత సిద్ధాంతాన్ని' జ్యోతిరావు తీవ్రంగా వ్యతిరేకించారు. (బ్రిటిష్ ఇండియా విద్య, న్యాయ శాఖ మంత్రి లార్డ్ మెకాలే 1835 ఫిబ్రవరిలో వడబోత విద్యా సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారు. దీని ప్రకారం తమకు అనుకూలురైన అతి కొద్ది మంది ఉన్నత కులాల వారికి ప్రభుత్వం చదువు చెబుతుంది. వీళ్లు తక్కువ కులాల వారికి విద్య అందిస్తారు.) బడుగుల పిల్లలు బడి మానడానికి వారి సామాజిక పరిస్థితులు, పేదరికం కారణ మని జ్యోతిబా వివరించారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి విద్యలో వృత్తి నైపుణ్యతలు బోధించాలి. ఉపాధ్యాయులు సుశిక్షితులయి ఉండాలి. కింది తరగతుల పిల్లలకు సామాజిక విద్య నేర్పడానికి ఉపాధ్యాయులు కింది తరగతి వారై ఉండాలి. ఉపాధ్యాయులకు వ్యవసాయం, ఆరోగ్యం, పరిశుభ్రతల గురించి తెలియాలి. గ్రామీణ ఉపాధ్యాయులకు జీతాలతోపాటు విద్యార్థుల ఉత్తీర్ణత, సామర్థ్యాలను బట్టి ప్రత్యేక భత్యం ఇవ్వాలి. వ్యవసాయ దారుల పిల్లలకు ఉన్నత విద్యలో రాయితీలివ్వాలి. పేదలు, వెనుకబడ్డ తరగతుల విద్యార్థులకు ఉచిత గృహ వసతి కల్పించాలి. విద్య ప్రభుత్వ అధీనంలో ఉండాలి. ఈ సలహాలు, సూచనలను జ్యోతిబా తాను స్థాపించిన పాఠశాలల్లో అమలు చేశారు. విద్యార్థులకు పద్య గద్యాలలో ఉత్తరాలు రాయడం నేర్పారు. విలువల జీవితం గడపడానికి నీతి, నియమ నిబద్ధతల సామాజిక విద్య నేర్పారు. ఆంగ్లభాష ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. వృత్తి నైపుణ్యతలను పెంచి అసహాయులను మేధో పరంగా ఉన్నతీకరించడంలో ఆంగ్లం కీలకపాత్ర పోషించిందని జ్యోతిబా అభిప్రాయం. ఆంగ్లేయ ప్రభుత్వంలో ఉద్యోగాలు సంపాదించడంలో ఆంగ్ల విద్య సహాయ పడుతుందని నమ్మకం. అంటరాని వారికి పాఠశాలలు నడపడానికి పూలే యూరోపి యన్ల ఆర్థికసాయం పొందారు. క్రైస్తవ విద్యాసంస్థలు దళితులకు విద్యా సౌకర్యాలు అందించాయి. పూలే ఆంగ్లేయుల విద్యాసేవ లను మెచ్చుకున్నారు. ఆయనను అపార్థం చేసుకున్న బ్రాహ్మణు లు జోతిబా క్రైస్తవం పుచ్చుకున్నారని దుష్ప్రచారం చేశారు. 18వ శతాబ్దంలో, భారతదేశ ఎగుడు దిగుళ్ల విద్యారంగ చరిత్రతో అనుబంధమున్న రాజా రామ్మోహన్‌రాయ్, డేవిడ్ హేర్, విలియం కారేల పక్కన మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రి బాయి పూలే నిలుస్తారు. బాలికల, అంటరానివారి విద్య, దళిత జనోద్ధరణ, మహిళా విముక్తి, సామాజిక విప్లవం మొదల గు రంగాల్లో పనిచేసిన మహాదేవ్ గోవిందరానడే, విష్ణుశాస్త్రి చిప్లుకర్, గోపాల్ గణేశ్ అగార్కర్, ధోండే కేశవ్ కర్వే, పండిత రమాబాయి, మహాత్మాగాంధీలకంటే ముందు పుట్టినవారు జ్యోతిరావు, సావిత్రిబాయి. దళిత ఉద్ధరణ, దళిత బాలికల, మహిళల విద్య, మహిళా విముక్తి, సామాజిక విప్లవం పూలే దంపతుల ప్రత్యేకతలు. దళితుల కోసం పూలే దంపతులు సర్వస్వం త్యాగం చేశారు. జీవితాలనే అర్పించారు. ❑

## బీహార్ కులగణన - ఆర్థికాభివృద్ధి

**(11వ పేజీ తరువాయి)**

మంది ప్రజలు జాతీయ సంపదలో కేవలం 4.1% కోసం పోటీ పడుతున్నారు. ప్రపంచ అసమానత నివేదిక 2022 ప్రకారం, అగ్రస్థానంలోవున్న 10%, 1% జనాభా మొత్తం జాతీయ ఆదాయంలో వరుసగా 57%, 22% వాటాను కలిగి ఉన్నారు. దిగువనగల 50% పేదల వాటా 13%కి తగ్గింది. మరోవైపు దేశంలోని మొత్తం వస్తువులు, సేవల పన్ను (GST)లో దాదాపు 64% జనాభాలో దిగువ 50% మంది నుండి వస్తుండగా, శిఖరాగ్రం పైనవున్న10% నుంచి వస్తున్నది 4% మాత్రమే. చాలా మంది సాధారణ భారతీయులు తమకు అవసరమైన ఆరోగ్య సంరక్షణను పొందలేకపోతున్నారు. వీరిలో 6కోట్లమందికి పైగా (ప్రతి సెకనుకు దాదాపు ఇద్దరు వ్యక్తులు) ప్రతి సంవత్సరం ఆరోగ్య సంరక్షణ ఖర్చుల కారణంగా పేదరికంలోకి నెట్టబడుతున్నారు. భారతదేశ జనాభాలో దాదాపు 74% మంది ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందలేకపోతున్నారు. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ 2023 ప్రకారం భారతదేశం యొక్క 2023 GHI స్కోరు 28.7. ఇది GHI ఆకలి స్కేల్ ప్రకారం ఆకలి తీవ్రస్థాయిలో ఉన్నట్టుగా పరిగణించబడుతుంది. గ్లోబల్ లింగ అంతర నివేదిక ప్రకారం లింగ అసమానతలో 2023లో భారతదేశం 146 దేశాలలో 127వ స్థానంలో ఉంది. భారత్‌లో ని అసమానతలకు, కుల వ్యవస్థకు అవినాభావ సంబంధం ఉంది. 'వరల్డ్ ఇనీక్వాలిటి ల్యాబ్' ఇటీవల విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం దేశంలోని సంపన్నులలో 90% అగ్రకులాలకు చెందిన వారే ఉన్నారు. సంపన్న భారతీయులలో షెడ్యూల్డ్ తెగల కు (STs) చెందిన వారు ఒక్కరు లేరు. భారతదేశంలోని బిలి యనీర్ల సంపదలో 88.4 శాతం ఉన్నత కులాల(UCs) చేతుల్లో కేంద్రీ కృతమై ఉందని ఈ నివేదిక వెల్లడిస్తుంది. ఈ అసమానత బిలియనీర్ల సంపదకు మించి విస్తరించింది 2018–19 సంవ త్సరానికి ఆల్-ఇండియా డెట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సర్వే (AIDIS) ప్రకారం ఉన్నత కులాలు జాతీయ సంపదలో దాదా పు 55 శాతం కలిగి ఉన్నాయి. సంపద యాజమాన్యంలో ఈ స్పష్టమైన వ్యత్యాసం భారతదేశ కుల వ్యవస్థలో పాతుకుపోయిన లోతైన ఆర్థిక అసమానతలను నొక్కి చెబుతుంది. వ్యవస్థాపక తకి, సంపద సృష్టికి అవసరమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, సోష ల్ నెట్‌వర్క్‌లలో భాగం కావటం, క్రెడిట్‌ను పొందడంలో కులం ప్రభావం చూపుతూనే ఉంది.(Gaurav Dwivedi, World Inequality Report: India Has 85% Billionaires From Upper Castes, None From Scheduled Tribes) ❑

# హిందూ మతోన్మాదానికి అంబేద్కర్ ఓ సవాల్



- నాదెండ్ల శ్రీనివాస్

స్వాతంత్ర్య భారతదేశం అంబేద్కర్ 134వ జయంతి జరుపు కోవటానికి సిద్ధమవుతున్న సందర్భంలో ఒక పక్క పార్లమెంట్ సాక్షిగా జరిగిన ఘోర అవమానం. మరోపక్క ఆయన ఎన్నడూ లేనంత ఎత్తుకు ఎదిగినట్లు కనిపిస్తున్నది. అనేక ముఖ్య ఘట్టాల్లో, ఉద్యమాల్లో నవభారత నిర్మాణం, ప్రజాస్వామ్యం, సామాజిక రుగ్మతలు లేని దేశం కోసం అంబేద్కర్ కృషి చేశారు. ఆయన జీవితానుభవంలో గుర్తించిన సామాజిక సమస్యలు, ఉద్యమాలు, అధ్యయనం, ఆలోచనలను ప్రయోగాత్మకంగా పరిశీలించాలి. భారత సమాజం గురించి ఆయన లోతుగా పరి శీలన చేసి లేవనెత్తిన అనేక ప్రశ్నలు నేటికీ సజీవంగా నిలిచి ఉండటం, ఆయన కృషి ని, ప్రాధాన్యతని నేటికీ గుర్తు చేస్తున్నాయి. 1871 ఏప్రిల్ 14వ తేదీన మధ్య భారతదేశంలో మౌ అనే ప్రాంతంలో, మత భావాలను విశ్వసించే, పేద మెహర్ కుటుంబంలో భీమ్ రావ్ అంబేద్కర్ జన్మించారు. పాఠశాల విద్యాభ్యాసం సతారాలోను, కళాశాల విద్యాభ్యాసం ముంబైలోను పూర్తిచేసిన అంబేద్కర్ 1913-17లో కొద్దికాలంపాటు బరోడా మహారాజు దగ్గర సేవలందించారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ కొలంబియా విశ్వ విద్యాలయంలో, గ్రేస్ ఇన్ బాక్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్య నభ్యసించిన ఈ నవ యువకుడు ఆనాటి సమకాలీన రాజకీయ నాయకుల్లో చాలా మందికి లేనటువంటి, అమోఘమైన పాండిత్యాన్ని సంపాదించారు. సామాజిక అడ్డంకు లు ముఖ్యంగా పక్షపాత వైఖరి, సామాజిక అణచివేతలు, కుల పీడనలు వంటివి ఎదుర్కొని ఈ ఘనత సాధించారు.




1920లలో తొలినాళ్లకే అంబేద్కర్ ఎం.ఎ, పీహెచ్‌డీ అర్థ శాస్త్రంలో ఎమ్మెస్సీ, డి.ఎస్.సి, బారిస్టర్ ఎట్ లా పూర్తి చేశారు. తనకి 30 ఏళ్లు వచ్చేసరికి ప్రముఖ విద్యావేత్తలు, అధ్యయన కారులు తమ జీవితకాలంలో సాధించలేనన్ని నిజ జీవిత అనుభ వాలను అంబేద్కర్ గడించారు. నాలుగు దశాబ్దాల తన ప్రజా జీవితంలో అనేక వివాదాస్పద అంశాలలోనూ, అధిగమించటా నికి వీలు లేనటువంటి సామాజిక అంధకారంలో నుంచి వెలుతు రులా ఉద్భవించారు. అలెగ్జాండర్ గోల్డెన్‌వైసర్ 1916 మే నెల లో సామాజిక శాస్త్రాలపై సెమినార్ జరిపినప్పుడు, మొట్ట మొదటిసారిగా అంబేద్కర్ భారతదేశంలో కులాల తీరు తెన్నులు, పుట్టుక, అభివృద్ధి అనే అంశంపై చాలా అద్భుతమైన పత్రాన్ని అందించారు. పారదర్శకత, నిజాయితీ, పట్టుదల వంటి అపూర్వ గుణాలు కలిగిన ఉదారవాది డా.అంబేద్కర్. తాత్వికంగా మొదట ఆదర్శవాదం వైపు మొగ్గినప్పటికీ, అంతిమంగా బుద్ధుని సిద్ధాంతంవైపు ఆకర్షితుడయ్యారు. మార్క్సిజం పుస్తకాలను చాలా లోతుగా అధ్యయనం చేశారు. 1950లో ఆయన న్యాయశాఖ మంత్రిగా ఉండి హిందూ కోడ్ బిల్లు తెచ్చినప్పుడు, అదే జవహర్ లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా అంబేద్కర్‌ను దెబ్బతీశారు. అంబేద్కర్ జీవించినంత కాలం, ఆయన ప్రత్యర్థులు, విమర్శకులు మరీ ముఖ్యంగా కాంగ్రెస్ నాయకులు, ఆయనను ఆ యుగంలోని వ్యూహాత్మక లక్ష్యాన్ని గుర్తించ లేని వ్యక్తిగా పదేపదే అభివర్ణించేవారు. ఆ ప్రచారం బాగా ప్రాచుర్యం పొంది, ఆఖరికి మీడియా ఆయనను ఒక రెండో తరగతి దేశనాయకుడిగా, షెడ్యూల్డ్ కులాలకే పరిమితమైన నాయకుడిగా చిత్రీకరించింది. వస్తుగతంగా చూస్తే ఆయనంత ఉన్నత వ్యక్తి, సాహసోపేతమైన దేశ నాయకులు చాలా తక్కువ మంది ఉన్నారన్నది సుస్పష్టం.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నడిచిన స్వాతంత్ర్య పోరాటంలో దీనికి తగినంత ప్రాధాన్యత ఇవ్వబడలేదు. దేశ రాజకీయ దృక్పథంలో ఎప్పుడూ నికరంగా కేంద్రస్థానం వహిస్తూ, తీవ్రవాద శైలితో, సామాజిక అంశాల్లో ఎటువంటి సర్దుబాటు ధోరణి ప్రదర్శించ కుండా ఎన్నో ఉద్యమాలకు నాయకత్వం వహించారు అంబేద్కర్. సమాజంలోని అసమానతలు, మతాల్లో ఇమిడి ఉన్న అణచివేత ధోరణులు, సాంప్రదాయ వారసత్వాలు, మెజారిటీ సమాజం రుద్దిన విలువలను గమనించారు. అంబేద్కర్ రాజ్యాంగ సభలో, రాజ్యాంగ ముసాయిదా రూపకల్పన కమిటీకి అధ్యక్షత వహించి, ప్రధాని నెహ్రూ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్‌లో కొంత కాలం ఉన్నప్పటికీ, భారత రాజకీయాల్లో కాంగ్రెసేతర, కాంగ్రెస్ వ్యతిరేక భావధారకు ఆయన్నే మనం ఆద్యుడిగా పరిగణించాలి. కానీ వాటికి భిన్నంగా హిందూ మితవాదం బాగా పైచేయి సాధించి, మెజారిటీ మతమౌఢ్యం, సామాజిక అభివృద్ధి **(మిగతా 28వ పేజీలో)**

# మతం - ఒక సాంస్కృతిక ఆయుధంగా ఎలా మారింది?

- పురుషోత్తం

**కుటుంబం, వివాహం, కులం, రాజకీయంలా మతం కూడా మానవ సమాజ ఉపరితల అంశమే. దుర్క్ హైం, మలినోవ్స్కీ, బ్రౌన్ తదితర ఆధునిక పండితులు మతాన్ని సామాజిక నియంత్రణ సాధనంగా పరిగణిస్తుంటే, వెబర్ మాత్రం ప్రొటెస్టెంట్ మత నియమాలు పెట్టుబడిదారీ విధానం ఆవిర్భావానికి దోహదం చేశాయని భావించాడు. ఆగస్ట్ కామ్టే మాత్రం ఈ అవగాహనలకు విరుద్ధంగా మతాన్ని శాస్త్రీయ ఆలోచనకు తావు ఇవ్వని అభిభౌతిక అంశంగా పరిగణించాడు. మత విశ్వాసులు మాత్రం ఇహలోక విషయాలను పక్కనపెట్టి పరలోక సౌఖ్యాల ప్రాప్తి కోసం ఆందోళన పడుతున్నారు. అయితే, ఈ నిర్వచనాలు మతం, దాని చారిత్రక గతి తర్కాన్ని ఏ మేరకు వివరించగలుగుతున్నాయనే ప్రశ్న మాత్రం అపరిష్కృతంగానే మిగిలిపోయింది. సమీప గతం వరకు సకల కార్యకలాపాలను మతం అనే ప్రయాణంతో అంచనా వేయడం కొనసాగింది. అయితే ఈ మధ్య కాలంలో మతానికి ఉండే సామాజికి ప్రాముఖ్యతను ప్రశ్నించసాగారు. వ్యవహారం ఈ రకంగా తిరగబడడానికి కారణం ఏంటి ? మతం కేవలం ఆచారస్థాయికి కుదించుకుపోయిందా ?**



‘ఆహారం, నిద్ర, భయం, మైథునాలు అనేవి మానవాళికి జంతుజాలానికి సమాన ఫాయిదాలో ఉండేవే, మతం ఒక్కటే ఈ రెండింటి మధ్య తేడాను స్పష్టం చేస్తుంది. మత భావనలు లేని మనిషి జంతువుతో సమానం’ అని వెయ్యి సంవత్సరాల క్రితం నాటి ‘హితోపదేశం’ వివరిస్తుంది. జంతు సహజాతాలు సంపూర్ణమైన విజ్ఞానంగా మారిన తీరు గురించి పాశుపత శైవులు అభివర్ణిస్తారు. వేదాలు, ఉపనిషత్తులు, ధర్మ సూత్రాలు వంటి బ్రాహ్మణ సంప్రదాయాలు, బౌద్ధం, జైనం వంటి శ్రమణ సంప్రదాయాలు మతం సామాజికంగా నిర్వహించే పాత్ర గురించి సమగ్రమైన అవగాహన అందిస్తాయి. ‘మతం అనేది ఈ విశ్వ ఆవిర్భావాన్ని, నియంత్రణను వివరించే సంవిధానం’ అని పైగ్రంథాలు వివరిస్తాయి. 70 వేల సంవత్సరాల క్రితం నాటి జ్ఞాన విప్లవం మూలంగా మానవులు సామాజిక కార్యకలాపాలు చేపట్టారని పరిశోధనలు సూచిస్తున్నాయి. అప్పటి మార్పులు జీవ పరిణామక్రమాన్ని అనుసరించి వివరించిన పరిస్థితులు లేవు. కామ, క్రోధ, లోభాలు వంటివి జీవ పరిణామ కార్యకలాపాలు. సామాజిక కార్యకలాపాలు దృక్పథాల నుంచి అవతరిస్తాయి. మతం అనేది ఈ తొలిదశలో ఏర్పడింది.

సమాజం అనేది ఊహాజనిత వాస్తవాల మీద ఆధారపడి ఉంటుందని ఆధునిక చరిత్రకారుడు యువల్ నోవా హరారీ అభివర్ణిస్తాడు. జాతి, డబ్బు, దేవ దేవుళ్లను మానవ సమూహాలు సమిష్టిగా నిజం అని భావిస్తాయి. ఆదాము-అవ్వ, మనువు-శతరూప వంటి కథనాలను మానవులు పరస్పర విశ్వాసాల పంపిణీ ఆధారంగా రూపొందించుకుంటారు. చైతన్యం ద్వారా ఈ విశ్వ సృష్టికి సంబంధించిన తాత్విక వ్యవస్థలను మతపరమైన భావధార అభివృద్ధి చేసింది. తర్వాత కాలంలో వీటిని పురాణాలుగా చెలామణిలోకి తీసుకువచ్చారు. యజ్ఞాలు, పూజలు వంటి ఆచారాలను అభివృద్ధి చేసి సమాజంలోకి చొప్పించారు. ప్రపంచాన్ని నియంత్రించడానికి విలువల వ్యవస్థ ఆవిర్భవించిం ది. నియమాలు, ఆచారాలు, నైతిక విలువలు వంటివి ఆ వ్యవస్థలో భాగంగా ఏర్పడ్డాయి. అంటే మతానికి ఐదు పార్శ్వాలు ఉన్నాయని మనం చెప్పుకోవచ్చు. తత్వం, ఆచారం, విలువల వ్యవస్థ ప్రతీకలు, మత నిర్మాణం. ఈ ఐదు పార్శ్వాలు భాష్యం చెప్పడానికి నియంత్రణకు సాధనాలుగా

మారాయి. మానవ చైతన్యానికి ముడి పెట్టేందుకు దోహదపడ్డాయి.

**మత చైతన్యం..**

మానవులు అందరిలో అన్నమయకోశం, ప్రాణమయ కోశం, మనోమయకోశం, విజ్ఞానమయ కోశం, అనంతమయ కోశం అనే ఐదు తిత్తులు ఉంటాయని తైత్తరేయ ఉపనిషత్తు వివరిస్తుంది. జంతువులలో కూడా మొదటి మూడు తిత్తులు ఉంటాయి. నాల్గవ తిత్తి కలిగి ఉన్న కొద్ది మంది మానవులు క్రమశిక్షణతో ఒబ్బిడిగా ఉంటారు. ఐదవ తిత్తి పరిపూర్ణ చైతన్యంలో, ఆత్మలో, సంలీనం కావడానికి అవసరమైన స్వీయాన్వేషణకు దోహదపడుతుంది. మతానికి ఈ ఐదు కోశాలే ఆలంబనగా ఉంటాయి. మానవులలో తొలుత ఇతర జీవ కోటిపట్ల, పూర్వీకుల పట్ల, ఈ విశ్వం పట్ల బాధ్యతతో ఎలా మెలగాలో తెలివిడి ఏర్పడింది. ఆధిపత్య భావన అభివృద్ధి చెందిన కొద్దీ ఈ బాధ్యతలు అడుగంటి పోయాయి. తదనుగుణంగా మతంలోనూ మార్పులు చోటు చేసుకున్నాయి. భారతీయ చరిత్ర మత పరిణామక్రమ స్వభావాన్ని నిర్ధారిస్తుంది. క్రీ.పూ వెయ్యి సంవత్సరాల కాలం సంభవించిన వ్యవసాయిక విప్లవం ప్రాంతీయ రాజ్యాలను, వర్ణవ్యవస్థను నెలకొల్పింది. అయితే వీటిని తృణీకరించడం ద్వారా ప్రతిఘటన కూడా తలెత్తింది. క్రీ.పూ.500 సంవత్సరాల క్రితం మొదలైన పట్టణీకరణ వాణిజ్య విస్తరణ, సామ్రాజ్య విస్తరణలకు దారి తీసింది. దీంతో విదేశీ దురాక్రమణలు, సాంస్కృతిక సంలీనాలు మొదలయ్యాయి. క్రీ.శ 4వ శతాబ్దం గుప్తుల కాలంలో తిరిగి ఆధిపత్య ధోరణులను నెలకొల్పేదానికి, భూస్వామ్య విధానానికి అంకురార్పణ జరిగింది. గుప్తుల అనంతర కాలంలో వివిధ కులాలు ఆవిర్భ వించాయి. క్రీ.శ 100వ సంవత్సరం నాటికి భూస్వామ్య విధానం విస్తరించి మొరటుగా తయారవడం ప్రారంభమయ్యిం ది. అప్పట్లో మతం సమాజాన్ని ప్రజాస్వామిక రించడానికి పెను గులాడింది. 20వ శతాబ్దం తొలినాళ్లలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందడం మొదలయ్యింది. 1990 నాటికి ఆర్థిక మార్పులకు దారితీసింది. చరిత్ర మూల మలుపులు అన్నింటా మతం అనేది ఆధిపత్యం స్థిరపడడానికి, ఆధిపత్య ధోరణులను ప్రతిఘటించేందుకు సైద్ధాంతిక భూమికను సిద్ధం చేసింది.

**మతంలో భారీ మార్పులు**

మానవాళి వ్యవసాయంలో స్థిరపడిన కాలంలో తొలిసారిగా మతంలో ప్రధానమైన మార్పు సంభవించిందని పరిశోధకులు గుర్తించారు. వేలాది సంవత్సరాలుగా సంచార జీవులుగా మెలిగిన మానవాళి బహుదేవతారాధన ఆశ్రయించింది. సృష్టికి మూలమైన అతీతశక్తి ఏదో ఉందని విశ్వసించింది. యక్షుల నిరుక్త నిఘంటువు దేవతలు అంటే దయతో కోరినది ఇచ్చు వారిగా అభివర్ణించింది వైదిక సంప్రదాయం దేవతలను పృథ్వి (కోర్కెలకకు భూమిక), అంతరిక్ష(కోర్కెల యవనిక) ద్యులోక (కోర్కెలను జయించే స్థితప్రజ్ఞత) వంటి మూడు గణాలుగా వర్గీకరించింది. ప్రతి గణాన్ని తిరిగి 11 ఉపగణాలుగా విభజించి ప్రతి ఉపగణానికి 33 మంది దేవతలను ప్రతినిధులుగా నిలిపింది. సంచార మతం అతీతశక్తులను దైవంగా కొలిచి ఆరాధించింది. మానవాళి వ్యవసాయంలో స్థిరపడ్డాక మతం అనేది అతీత శక్తులకు బదులు సంపూర్ణ జ్ఞానాన్ని (బ్రహ్మను దీనికి ప్రతినిధిగా ప్రతిష్ఠించి) ఆలంబనగా చేసుకుంది సామాజిక ఆధిపత్యం. దానికి ప్రతిఘటన రెండూ కూడా మతపరమైన కార్యకలాపాల్లో భాగంగా మారాయి. వైదిక మతం ఆధిపత్యానికి, శ్రమణ మతం ప్రతిఘటనకు ప్రతీకలుగా నిలిచాయి.

పారిశ్రామిక విప్లవం మతంలో మూడవ అతిపెద్ద మార్పుకు దోహదం చేసింది. ప్రొటెస్టెంట్ మతం లాభార్జనే ధ్యేయంగా సాగే పెట్టుబడిదారీ విధాన ఆవిర్భావానికి తోడ్పడింది. పెట్టుబడిదారీ విధానం తొలిదశలో ప్రజాస్వామిక విలువలను పాటించిన కాలం గడిచేకొద్దీ ఈ విలువలను తుంగలో తొక్కింది. ఆధునిక మతం ఛాందసత్వానికి, అస్థిత్వ ఆధారిత వైషమ్యాలకు ఆలవాలంగా మారింది. మతం తన ఆదిమ స్వభావాన్ని, ఆచారలను కోల్పోయింది.

**ఆధిపత్యం- ప్రతిఘటన**

వ్యవసాయిక విప్లవకాలంలో బహుదేవతారాధనకు పునఃభాష్యం కల్పించడంతో సామాజిక ఆధిపత్యాన్ని నెలకొల్పారు. బ్రాహ్మణ, సూత్ర గ్రంథాలు త్రిమూర్తుల ప్రతిష్ఠాపనతో ఈ ఆధిపత్యం నెలకొల్పాయి. ఈ మార్పులు వర్ణవ్యవస్థ, జనపదాల(ప్రాంతీయ రాజ్యాలు) ఆవిర్భావానికి దారి తీశాయి. సంచార తెగ పెద్ద క్షేత్ర పాలకుడిగా మారాడు. వివక్షాపూరిత వ్యవస్థ ప్రజలలో భేదాన్ని వ్యాప్తి చేసింది. ఈ కష్టాల కడగండ్ల నుంచి పరిష్కారం కోసం తాత్విక ఆలోచనల మీద ఆధారపడటం పెరిగింది. అయితే, ఈ ఆధిపత్యాన్ని నీగ్రిటో, ఆస్ట్రలాయిడ్, మంగోలాయిడ్, ద్రవిడ తెగలు ప్రతిఘటించాయి. ఈ తెగలను మతైక–సాంస్కృతిక సంప్రదాయాలలో ఎలా మిళితం అయ్యాయనే దానికి వైదిక మతంలోని రుద్రుడు శివుడిగా అవతరించడమే సాక్ష్యం.

వర్ణవివక్షకు వ్యతిరేకంగా సర్వసంగ పరిత్యాగం ముందుకు వచ్చింది. ఈ సర్వసంగ పరిత్యాగం కౌచ్చిక, బౌద్ధిక, హంస, పరమహంస వంటి నాలుగు స్థాయిలుగా వర్గీకరించబడింది. ఈ సర్వసంగ పరిత్యాగులు ఉపనిషత్తులను ప్రతిఘటనా సాహిత్యంగా గుదిగుచ్చారు. అతీత శక్తులు ఆరాధనకు బదులుగా

'అహం బ్రహ్మాసి'ని ఆరాధనగా ముందుకు తీసుకువచ్చారు. శంకరాచార్యులు 'బ్రహ్మ'ను సృష్టికర్తగా వర్ణించారు. అయితే ఉపనిషత్తులు నిర్వికార, నిరామయ చైతన్యాన్ని 'ఆత్మ'గా పరిగ ణించాయి. వర్ణాధిపత్యం బలపడడానికి కొన్ని శతాబ్దాలు పట్టింది. సూత్రకాలంలో వర్ణాధిపత్యం స్థిరపడింది. వైదిక సంప్ర దాయాలలో గణనీయమైన మార్పులు వచ్చాయి. కేనుడు పంచమ యజ్ఞాలు, శ్రౌత యజ్ఞాల మధ్య ఉన్నటువంటి తేడాల ను వివరించాడు. వర్ణాశ్రమ వ్యవస్థ, వర్ణ వ్యవస్థ సమర్థకులు, వ్యతిరేకుల మధ్య రాజీ కుదర్చడానికి ప్రయత్నించింది. కొంత మంది ఇందుకు అంగీకరించారు. కానీ శ్రమణులు తిరస్కరిం చారు. తొలి సర్వసంగ పరిత్యాగులు 'యతులు' అని హరివాద చక్రవర్తి వివరిస్తాడు. రుగ్వేదంలో పేర్కొన్నట్లు ఈ 'యతుల'మీద ఇంద్రుడు చేసిన దాడి ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే దాడి అని స్పష్టం చేశాడు.

**శ్రమణ సంప్రదాయాలు..**

శ్రమణ సంప్రదాయాలు ఒక వెలుగు వెలిగే నాటికి జనపదా లు అంతరించిపోయి సామ్రాజ్యాలు ఏర్పడ్డాయి. యుద్ధాలు, వాణిజ్యం విస్తరించాయి. ఈ మార్పులకు అనుగుణంగా శ్రమణులు సప్రదాయ చట్రంలో తగిన మార్పులు చేర్పులు తీసుకువచ్చారు. అంతిమ సత్యాన్ని అందుకోవడానికి శ్రమణులు ఆచరించే మార్గం బ్రహ్మణ సంప్రదాయాలతో మౌళికంగా విభేదిస్తుంది. ఇహ-పరలోకాల్లో పరమ సత్యం అంటూ ఏదీ ఉండదని, మార్పు నిరంతరాయమైనదని బుద్ధుడు బోధించాడు. బయటకు కనిపించేవన్నీ వ్యక్తిత్వ లక్షణాల సమాహారమని, ఆత్మ అనేది ఆలోచనలు, భావోద్వేగాల ప్రవాహానికి ఆలవాలమని బౌద్ధం వివరిస్తుంది. ఈ విశ్వంలో ప్రతిదీ పరస్పరాధారితం, పరమ ప్రమాణం అంటూ ఏదీ ఉండదని బౌద్ధంలోని ప్రతిత్య సముత్పాదం స్పష్టం చేస్తుంది. బుద్ధుడు ఆత్మ ఉనికిని నిరాకరించాడు. అజ్ఞానం నుండి, ముదసలితనం నుండి బయట పడేందుకు పన్నెండు సూత్రాలను ప్రతిపాదించాడు. నిర్వాణం అనేది ముక్తికి పరమపద సోపానం అని వివరించాడు.

అలాగే జైనం కూడా అసలైన చైతన్యం అనేక రూపాల్లో ఉంటుందని, జ్ఞానం అనేది స్థల, కాలాల మీద ఆధారపడి ఉంటుందని(అనేకత్వవాదం) ప్రతిపాదించింది. ప్రతి పదార్థానికి స్వరూపధర్మం ఉంటుందని అంటే మార్పుకుగురవుతూ ఉంటాయని, ఆగంతుక ధర్మం, జైనం వివరిస్తుంది. మానవుడి ఉనికిని సజీవం, అజీవం అని రెండుగా వర్గీకరించింది. మనిషి ఉనికి సంపూర్ణంగా సమగ్రత పొందడమే 'కైవల్యం' అని జైనం చెబుతుంది.

**మత పరిణామక్రమంపై విదేశీ ప్రభావం..**

క్రీ.పూ. 200 నుంచి క్రీ.శ. 200వ సంవత్సరాల మధ్య పట్టణీకరణ పెరుగుదల, వాణిజ్య విస్తరణ, విదేశీ దురాక్రమణ, విదేశీ సామ్రాజ్యాల ఆవిర్భావాలతో భారత భూభాగంలో మూడవ అతిపెద్ద మూల మలుపు సంభవించింది. విదేశీ పరిపాలకులైన ఇండో- గ్రీక్ రాజు మీనాంధ్ర, కుషాణ రారాజు కనిష్కుడు వంటి వారు బౌద్ధాన్ని ఆదరించి, అవలంబించారు. ఈ సామ్రాజ్యాల పతనానంతరం విదేశీయులు ఇక్కడి వర్ణవ్యవస్థలో ఇమడడం సమస్యాత్మకంగా మారింది. శ్రమణ సంప్రదాయాలు ఇందుకు మెరుగ్గా తోడ్పడ్డాయి. ఈ కాలంలోనే బౌద్ధంలో హీనయాన, మహాయానాలు అనే విభజన వచ్చింది. ఈ లోకంలోని సకల చరాచర జీవరాశులు నిర్వాణం పొంచేందుకు స్వార్థరహితంగా కృషి చెయ్యడమే మహాయానంగా ముందుకు వచ్చింది. వ్యక్తి నిర్వాణానికే పరిమితమైన బుద్ధుని తొలినాటి బోధనలు హీనయానంగా మిగిలిపోయాయి. మహా యానంలో విదేశీయులు అనేక సాంస్కృతిక అంశాలను జోడించారు. బౌద్ధంలా జైనం కూడా శ్వేతంబర, దిగంబర అనే రెండు సంప్రదాయాలుగా విడిపోయింది. అయితే జైనం ప్రవచించిన పూర్తి అహింసా మార్గం మూలంగా క్రమేపీ దాని ప్రభావం తగ్గిపోయింది.

**గుప్తుల శకం - మత రూపాంతరం**

గుప్తుల సామ్రాజ్య కాలంలో మత పరిణామ క్రమం భారీ మార్పులకు లోనై గుప్తుల అనంతర కాలంలో కూడా కొనసాగింది. ఈ కాలంలో పురాణాలు కీలకమైన గ్రంథాలుగా చెలామణిలోకి వచ్చాయి. శూద్రుల పట్ల అత్యంత కఠినమైన నిబంధనలను ఈ కాలంలోనే 'స్మృతు'లలో చేర్చారని అస్పృశ్యత పెచ్చరిల్లిందని పరిశోధకులు విశ్వసించారు.

బ్రహ్మణ మతంలో కూడా శైవ, వైష్ణవ, శాక్తేయ పేరిట మూడు తెగలు ఆవిర్భవించాయి. ఐదవ శతాబ్దం నుండి తొమ్మిదవ శతాబ్దం వరకు ఇవి అభివృద్ధి చెందుతూ వచ్చాయి. ప్రాచీన కాలపు శివ, విష్ణు రూప గుర్తులకు పునఃభాష్యం చేయడంతో మతం నుండి విడగొట్టుకొని శాక్తేయ మతం ఆవిర్భవించింది. ఈ కాలంలోనే అవతరాల సిద్ధాంతం ప్రాచుర్యంలోకి వచ్చింది. మహాయాన బౌద్ధం నుండి ప్రేరణపొంది బ్రాహ్మణ మతంలో భక్తి సంప్రదాయం పొదుపుకుంది. విష్ణు అవతారాన్ని వ్యవస్థీకృతం చేశారు. శైవ మతం కూడా అవతారాల సిద్ధాంతాన్నే ఆలంబనగా చేసుకుంది. ఐహిక దుఃఖాల నుండి భక్తులకు విముక్తి కల్పించడానికే భగవంతుడు విష్ణు అవతారం ఎత్తాడని, శివుని అవతారం ఎత్తాడని వైష్ణవ, శైవమతాలు బలమైన నమ్మికను ఎగదోశాయి. ముఖ్యంగా సమాజంలో అట్టడుగు వర్గాలలో ఈ నమ్మిక బలంగా పాతుకుపోయింది.

వివిధ కులాచారాలు అన్నీ ఈ భక్తి సంప్రదాయ చట్రంలోకి ఒదిగిపోయాయి. కొన్ని పురాణాలు శివుడుని దేవదేవుడిగా స్తుతించి స్థిరపరిచినా వైష్ణవ, శైవ సంప్రదాయాలు రెండింటికీ రాజభోగం లభించింది. సామాజికంగా కుల వివక్షను అత్యంత దుర్మార్గంగా అమలు చేస్తూనే దేవుడి ముందు అందరూ సమానులే అని, ఆ దేవుడిని నిత్యం కొలవడం ద్వారా మోక్షం పొందవచ్చని భక్తి సిద్ధాంతం జనాన్ని నమ్మించగలిగింది.

ఈ కాలంలోనే భారత సామాజిక-సాంస్కృతిక జీవన విధానంలో గణనీయమైన మార్పులకు దారితీసిన సామాజిక ఆర్థిక మార్పులకు పునాది పడింది. పరిపాలనాధికారాలు వికేంద్రీకరించబడ్డాయి. శాతవాహనుల కాలంలో ఈ వికేంద్రీకరణ మొదలైంది. ఈ కాలంలోనే పూజారులకు, ఆలయాలకు దేవుని మాన్యం కింద భూములు, పల్లెలు రాసివ్వడం ప్రారంభమయ్యింది. మౌర్యులు, గుప్తుల కాలంలో సుశిక్షిత భారీసైన్యం ఉండేది. శాతవాహనుల కాలానికి వచ్చే సరికి భూస్వామ్య ప్రభువుల బలగాల మీద ఆధారపడటం పెరిగింది. 7, 8 శతాబ్దాలలో సైనిక అధ్యక్షులకు, క్షేత్రస్థాయి పరిపాలకులకు భూములు ఇనాం హక్కులు ఇవ్వడంతో భూస్వామ్య సమాజం అవతరణ వేగవంతం అయ్యింది. భూస్వామ్య వర్గం కొత్తగా ఉనికిలోకి వచ్చింది. గుప్తుల కాలంలో దూరప్రాంత వాణిజ్యం తగ్గుముఖం పట్టింది. పర్యవసానంగా మూడు-నాలుగు శతాబ్దాలలో పట్టణీకరణ తగ్గుముఖం పట్టింది. అస్పృశ్యత గతంలోకంటే మరింత పెరిగింది. గుప్తుల అనంత కాలంలో భారత భూభాగంలో అనేక చిన్న చిన్న రాజ్యాలు అవతరించాయి. గౌడ, మౌఖారి, పుష్యభూతి, గుర్జర్, ప్రతీహార, పాళ, పల్లవ, పాండ్య, రాష్ట్రకూట, చౌహాన్, గద్వాల్ సామ్రాజ్యాలు ఇలా అవతరించినవే.

రాజకీయాధికారంలో వస్తున్న ఈ మార్పుల నడుమనే భూస్వామ్య విధానం రెండు అంచెలలో వేగంగా విస్తరించింది. ఇనాం భూముల మీద న్యాయపరమైన, పరిపాలనాపరమైన అన్ని హక్కులు దఖలు పడడంతో స్థానిక ప్రజానీకం మీద పాలకులే రాజ్యాంగయంత్రంగా మారారు. దీంతో భూయాజమాన్యం ఆస్తుల ఆక్రమణ, నిర్బంధ చాకిరీలకు పాల్పడుతూ, రైతుల నుండి ఇష్టారాజ్యంగా కౌలు వసూళ్లు చెయ్యడం పరిపాటిగా మారింది.

ఆధిపత్యమత భావధారలో భాగంగా వైదిక కాలం నుండి రాజుని సాక్షాత్తు దేవుడిగా భావించే సంప్రదాయం చెలామణిలో ఉంది. భూస్వామ్య విధానం బలపడడం ద్వారా రాజు భూమి మీద వెలసిన దేవుడి ప్రతినిధిగా ఒక వెలుగు వెలిగాడు. 6వ శతాబ్దంలో మొదలయిన తాంత్రిక విద్య 8వ శతాబ్దం నాటికి బాగా విస్తరించింది. మద్యం, మగువ, శృంగారం, స్మశాన నివాసం లాంటి ఆచారాలు ఈ తాంత్రిక విద్యలో భాగంగా మారాయి. బౌద్ధంలో వజ్రయాన, శైవంలో కాపాలిక/కాలముఖ సంప్రదాయాల పేరిట ఈ ఆచారాలు పాటించేవారు. ఇవన్నీ ఆధిపత్యాన్ని ప్రతిఘటించే నిరసన రూపాలుగా అనేకమంది పండితులు అభివర్ణించారు.

**తాత్విక చింతనాభివృద్ధి..**

ఇదే కాలంలో బ్రహ్మణ, శ్రమణ మతాల మధ్య జరిగిన చర్చోపచర్చలలో భాగంగా సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక, పూర్వ మీమాంస, వేదాంత అనే ఆరు తాత్విక ధోరణులు క్రమంగా రూపుదిద్దుకున్నాయి. ఆదిశంకరాచార్యులు వేదాంతానికి అద్వైత సిద్ధాంతాన్ని జోడించారు. తదనంతర శతాబ్దాలలో వైష్ణవ తాత్విక చింతనకు అనేక పాయలు తోడయ్యాయి. మధ్వాచార్యులు(12వ శతాబ్దం) ద్వైతవాదం, నింబార్కాచార్యులు (7వ శతాబ్దం) ద్వైతాద్వైతం, వల్లభాచార్యుల (15వ శతాబ్దం) శుద్ధాద్వైతం, రామానుజాచార్యుల(11వ శతాబ్దం) విశిష్టాద్వైతాలు వైష్ణవ సిద్ధాంతంలో ఉపసంప్రదాయాలుగా వెలుగులోకి వచ్చాయి. గుప్తుల కాలంలో ఈ తాత్విక చింతనలు వాటి ఆదర్శాల మీద బలమైన ప్రభావం చూపించాయి. ఇదే కాలంలో శివతత్వం కూడా వేదాంత ధోరణులను ఆలంబనగా చేసుకుని అభివృద్ధి చెందింది.

ఇదే కాలంలో బౌద్ధం కూడా అభివృద్ధి చెందింది. 4వ శతాబ్దంలో ఆర్య అసంగ్ ప్రభోదించిన విజ్ఞానవాదాన్ని (చైతన్యవాదం) వసుబంధు మరింత ముందుకు కొనిపోయాడు. నాగార్జునుడి శూన్యవాదంతో బౌద్ధమత తాత్విక ప్రయాణం ఆరంభమైంది. 9వ శతాబ్దంలో మొదలైన సహజయాన వజ్రాయనం ఆధిపత్య భావజాలాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. కానీ నైతిక విలువలు నిర్లక్ష్యం చేయడం మూలంగా ప్రజా బాహుళ్యంలో గౌరవం కోల్పోయింది. మారిన పరిస్థితులను ఆకలింపు చేసుకోలేకపోవడం మూలంగా 9-10 శతాబ్దాలలో బౌద్ధంలో ప్రతిష్టంభన నెలకొంది. పర్యవసానంగా బౌద్ధులు, శైవుల మధ్యన మతఘర్షణలు చెలరేగాయి. అనేక హింసాత్మక ఘటనలు చరిత్రలో నమోదయ్యాయి. పాళరాజుల కాలంలో ఈ ఉద్రిక్తతలు మరింత ప్రస్ఫుటమయ్యాయి. బౌద్ధ దేవతా మూర్తులైన అపరాజిత, సాంబర్‌లతోపాటు స్వయానా బుద్ధ విగ్రహాలను మలిచిన తీరు ఇందుకు తార్కాణం. ఈ నేపథ్యంలో బౌద్ధం ప్రభావం క్రమేపీ పలుచబడింది.

**హిందూమతం-నూతన సంప్రదాయాల ఆవిర్భావం**

బౌద్ధం, శైవ మతాల మధ్య చెలరేగిన ఘర్షణలను సమసిపోయేలా చెయ్యడానికి 10వ శతాబ్దంలో నాద సంప్రదాయం ఆవిర్భవించింది. బౌద్ధం తరువాత భారతదేశ చరిత్రలో మొదలైన రెండవ అతి పెద్ద మత ఉద్యమం నాద

సంప్రదాయం అని ప్రముఖ చరిత్రకారుడు హజారీ ప్రసాద్ ద్వివేది అభిప్రాయపడ్డారు. బౌద్ధ, శైవ మతాల మధ్యన ఐక్యత సాధించే క్రమంలో హిందూమతం ఆవిర్భవించింది. 13వ శతాబ్దానికి ముందు 'హిందూ' అనే పదం మత ఉనికికి సంబంధించింది కాదని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త డేవిడ్ లోరెన్‌జెన్ స్పష్టం చేశాడు.

విద్యాపతి రచించిన 'కీర్తి లత', 'పురుష పరీక్ష' గ్రంథాలలో తొలిసారిగా 'హిందూ' అనే పదాన్ని మతానికి ప్రతీకగా వాడారని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త హేతుకర్ ఝా ఉదహరించారు. చాంద్ర వరదాయి రచించిన 'పృథ్వీరాజ్ రాసో' గ్రంథంలో కూడా 'హిందూ' పదాన్ని మతానికి ప్రతీకగా వాడారు. పురుష పరీక్షలో హిందూ మత శాశ్వత నిర్మాణం కోసం మతాన్ని కులాచారం, సాధారణ ధర్మాలుగా విభజించారు. వివిధ కులాచారాలను మత సంప్రదాయాలుగా వర్గీకరించారు. నైతిక విలువలను నాలుగు పురుషార్థాలుగా విభజించి వాటిని సాధారణ ధర్మంగానే పేర్కొన్నారు. కులా చారాలు, సాధారణ ధర్మాలు అన్నీ కలిసి నిజమైన మతంగా (హిందూ మతం) వెలుగొందుతుందని విద్యాపతి భావించాడు. శైవ, వైష్ణవ, శాక్త, బౌద్ధ, జైన సంప్రదాయాలన్నింటినీ ఉమ్మడి 'హిందూ ధర్మం'గా పేర్కొన్నారు. అంటే వివిధ మత సంప్రదాయాల సమాహారంగా హిందూ మతం ఉనికిలోకి వచ్చింది. వివిధ మత గ్రంథాలే హిందూ మత గ్రంథాలుగా పరిగణించారు. ఈ క్రమంలోనే బుద్ధుడిని విష్ణువు పునర్జన్మావతారంగా అభివర్ణించారు.

## సనాతన ధర్మ మూలాలు-ఆధునిక హిందూమతం

ప్రస్తుత కాలంలో హిందూ మతాన్ని సనాతన ధర్మంగా ప్రచారం చేస్తున్నారు. కానీ, చరిత్రలో సనాతన ధర్మం పేరిట ఎలాంటి మత ప్రసక్తి లేదు. థియోసాఫికల్ సొసైటీ వ్యవస్థాపకురాలు అనిబిసెంట్ తొలిసారిగా సనాతన ధర్మాన్ని హిందూ మతానికి పర్యాయపదంగా తన రచనల్లో వాడారు. అప్పటి నుంచి సనాతన ధర్మం అంటూ ఒకటి ఉందని హిందువులలో భ్రమలు కల్పించే ప్రయత్నాలు కొనసాగుతూ వస్తున్నాయి. బ్రిటిష్ వలస పాలనా కాలంలో చేపట్టిన జనాభా గణనలో హిందూ సమాజంలో బౌద్ధులు, జైనులు, సిక్కులను వేర్వేరు మతాలుగా గుర్తించింది. (సిక్కు మతాన్ని వైష్ణవ మతంలో ఉప తెగగా భావిస్తుంటారు.)

14-15 శతాబ్దాలలో ఉత్తర భారత భూభాగంలో శ్రీ(రామావత్) సంప్రదాయం లేక రామానంద సంప్రదాయం మత ఘర్షణల నివారణకు నడుం కట్టింది. ఆ కాలంలో వైష్ణవ మతంలోని అద్వైత, ద్వైత, ద్వైతాద్వైత, శుద్ధాద్వైత, విశిష్టాద్వైత సంప్రదాయాలతోపాటు వైష్ణావతారాన్ని కొలిచే సగుణ, నిర్గుణ సంప్రదాయాలు దేనికదే తన సంప్రదాయాధిపత్యాన్ని రుజువు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో రామానందుడు విష్ణువు, శివుడు, రాముడు, కృష్ణుడు అందరూ ఆ బ్రహ్మ సృష్టే కాబట్టి వీరిలో ఒకరు ఎక్కువ ఒకరు తక్కువా కాదు, అందరూ సమానులే అనే వాదాన్ని ముందుకు తీసుకువచ్చాడు. "జాత్ పాత్ పూఛే నహీ కోయీ, హరికో భజాయెనో హరికో హెూయ్"(కులం, మతం గురించి ఎవరూ అడగరు, హరిని కొలిచే ప్రతి ఒక్కరూ హరికే చెందుతారు) అంటూ మత వైషమ్యాలను తగ్గించే దానికి కృషి చేశాడు. అంతేకాదు భూస్వామ్య క్షీణ విలువలయిన కుల వివక్ష, అస్పృశ్యతలకు వ్యతిరేకంగా బలంగా ప్రచారం చేశాడు. ఉత్తరాదిన రామానందుడి బోధనలు బహుళ ప్రజాదరణ పొందాయి.

రామానుజాచార్యులు ప్రారంభించిన విశిష్టా ద్వైత వైష్ణవ భక్తి సంప్రదాయం నుంచి రామానందుడి సంప్రదాయం ఆవిర్భవించింది. దక్షిణ భారత భూభాగంలో వేల ఏళ్ల క్రితం సాగిన ఆళ్వార్ యోగి ఉద్యమంలో శూద్రులు, మహిళలను కూడా పన్నెండు మంది మహాయోగులలో అంతర్భాగం చేసుకుంది. కుల వివక్షను తిరస్కరించింది. రామానందుడి గురువు ఈ రకమైన కుల వివక్షకు గురికావడంతో రామానందుడు శ్రీ సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. ప్రతిఘటనోద్యమాన్ని కొనసాగించారు.

## ఇస్లాం-సుల్తానుల పరిపాలనా కాలం

13వ శతాబ్దంలో ఢిల్లీ సుల్తానుల పరిపాలన మొదలు కావడంతో భారతీయ సాంస్కృతిక రంగం ఇస్లామిక్ ప్రపంచలో కాలు మోపింది. 16వ శతాబ్దంలో మొఘలులు అధికారం దక్కించుకునే వరకు భారత భూభాగంలో గులాం, ఖిల్జీ, తులుక్, సయ్యద్‌ల పాలన కొనసాగింది. సుల్తానుల పరిపాలనా కాలంలో రాజ్యమతంగా ఇస్లాం కొనసాగింది. ప్రజల మీద ఇస్లాం మతావలంబన కోసం నిర్బంధం కూడా అక్కడక్కడా కొనసాగింది. కొంత మంది హిందువులు నిర్బంధంగా ఇస్లాం మతాన్ని స్వీకరించారు. కానీ, శూద్రులు మాత్రం కుల వివక్ష పీడనను వదిలించుకోవడానికి ఇస్లాం మతాన్ని ఆశ్రయించారు. 7వ శతాబ్దం నాటికే సింధ్ ప్రాంతంలోనూ, 9వ శతాబ్దం నాటికి ఉత్తర భారత ప్రాంతంలోనూ ఇస్లాం భావజాలం వ్యాప్తి చెందింది. ఇస్లాం వ్యాప్తికి సూఫీ సాధువులు ఎంతగానో తోడ్పడ్డారు. షరియత్(ఇస్లాం చట్టం)కు బదులు తారీఖత్ (ఆధ్యాత్మిక మార్గం)ను సూఫీ సాధువులు ఆలంబనగా చేసుకున్నారు. సూఫీ సాధువులు చిస్తీ, సుహ్రవర్ది, ఖద్రియా, నక్షాబందీ, రసూల్ షాహి, మదారియా వంటి సంప్రదాయాలు అనుసరిస్తూ సహనం, ప్రేమ, శాంతి, భాతృత్వం వంటి ఉదార

విలువలను ప్రచారం చేశారు. బౌద్ధం క్షీణిస్తున్న క్రమంలో ఆ మతావలంబకులు ఎక్కువ మంది ఇస్లాం మతం స్వీకరించారు. సుల్తానుల పరిపాలనలో ఉలేమాలు కీలకపాత్ర పోషించారు. సికిందర్ లోడీ పరిపాలనా కాలంలో శైవ, వైష్ణవ మతస్థుల మధ్య నెలకొన్న ఘర్షణల పూర్వ రంగంలో వైష్ణవులలో అఖాడాల పేరిట బలగాలు ఆవిర్భవించాయి.

## మొఘులుల పరిపాలన-మత విధానాలు

16వ శతాబ్దంలో మొఘులుల పరిపాలన మొదలు కావడంతో ఇస్లాం పాలకుల దృక్పథంలో మార్పులు వచ్చాయి. మొఘులులు హిందువుల భావోద్వేగాలను గౌరవిస్తూ, వారి అభిమానాన్ని చురగొనడానికి అనేక మత సంస్కరణలు తీసుకువచ్చారు. సంకుచిత మనస్తత్వం ఉన్నటువంటి ఉలేమాలు ఈ ఉదార విలువల సంస్కరణల పట్ల విముఖత వ్యక్తం చేశారు. దీంతో పాటు కొన్ని సందర్భాలలో తిరుగుబాటు చేశారు. అక్బర్ చక్రవర్తి రామానంద్ తెగ వారికి 'నానక్ పంత్' వారికి భూములు కేటాయించడంతోపాటు ఆర్థిక సాయం కూడా అందించాడు. రామభక్తిని పెంపొందించడానికి, రామ్ లీలా ఉత్సవాలకు అనేక విధాలా ప్రోత్సాహకాలు కల్పించాడు. సీతారాముల బొమ్మలతో నాణేలు ముద్రించి పంపిణీ చేశాడు. స్వామి నరహరిదాస్, గోస్వామి తులసిదాస్‌లకు ఎంతగానో తోడ్పాటు అందించాడు. అక్బర్ తర్వాత మొఘల్ పరిపాలకులు, ఔరంగజేబు సహా, తొలుత ఈ ఉదారవాద విధానాలను కొనసాగించారు. అయితే, ఔరంగజేబు సింహాసనం అధిష్ఠించిన 11 ఏళ్ల తర్వాత సంప్రదాయ ఉలేమాల ఒత్తిడికి లొంగిపోయాడు. తన సోదరుడు దారా షికోకు అనుకూలంగానూ, లేదా తన సంకుచిత విధానాలను వ్యతిరేకించిన దేవాలయాలు ఉలేమాల ప్రోద్బలంతో ధ్వంసం చేశాడు. తన విధానాలకు మద్దతుగా నిలిచిన దేవాలయాలకు తోడ్పాటు ఇచ్చాడు.

## పారిశ్రామిక విప్లవం - వలస పాలకులు భాష్యాలు

పారిశ్రామిక విప్లవానంతరం భారతదేశ మత యవనిక మార్పులకు లోనయింది. ఆగస్ట్ కోమ్టే ప్రభావంతో పారిశ్రామిక విప్లవం తొలినాళ్లలో మతాన్ని మూఢ విశ్వాసంగా పరిగణించారు. మానవ చరిత్రలో సామాజికాభివృద్ధిని కోమ్టే మతైక, తాత్విక, సానుకూల అనే మూడు దశలుగా అభివర్ణించాడు. మానవాళి ఈ సృష్టిని ఎలాంటి శాస్త్రీయ ప్రాతిపదిక లేని అతీతశక్తుల సృష్టిగా భావించింది. తదనంతరం తాత్విక చింతన ద్వారా విశ్వాసాల నిగ్గు తేల్చుకుంది. అంతిమంగా శాస్త్రీయంగా పరీక్షకు నిలబెట్టింది. విశ్వాసాలను శాస్త్రీయంగా పరీక్షకు నిలబెట్టడమే సరైన దృక్పథం అని కోమ్టే వాదించాడు. 'మతం– మానవత్వం'(రెలిజియన్ అండ్ హ్యూమానిటీ అనే పుస్తకంలో మతపరమైన ఆలోచనలను మూఢ విశ్వాసాలుగా పరిగణిస్తూనే వీటికి నైతిక ఉపయోగం ఉందని' కోమ్టే రాసుకువచ్చాడు. అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మాణంతో ఈ దృక్పథం అతికినట్టు సరిపోయింది. సమాజం కండ బలం మీద కంటే వాణిజ్య ఆధారిత వ్యవస్థ ద్వారా మానవాళికి స్వేచ్ఛను కల్పిస్తుంది. అని పెట్టుబడిదారీ వ్యవస్థ సిద్ధాంతీకరిస్తుంది. కోమ్టే వాదనలు ప్రజాస్వామ్యం పేరిట వస్తు వినిమయవాద విస్తృత వ్యాప్తికి, లాభాపేక్ష కేంద్రక విలువలకు రాచబాటలు వేసింది. బ్రిటిష్ వలస పాలకులు భారతదేశంలో క్రమేపీ పెట్టుబడిదారీ విధానాన్ని ప్రవేశపెట్టారు. అయితే, దేశానికి స్వాతంత్ర్యం లభించే వరకు ఈ వ్యాప్తి పరిమితంగా ఉండింది. అదే సందర్భంలో ప్రజాజీవితాన్ని భూస్వామ్య సంబంధాలు ప్రభావితం చేస్తుండేవి. స్వాతంత్ర్యానంతర కాలంలో కొన్ని దశాబ్దాల పాటు ఈ సంకర విధానాలు కొనసాగుతూ వచ్చాయి. భారతీయ సమాజంలో తొలిదశలో అత్యంత అనాగరికమైన సతీసహగమనం, బాల్య వివాహాలు, వితంతువుల పునర్వివాహంపై నిషేధం, కుల వివక్ష, అస్పృశ్యత వంటి మూఢాచారాలతో కునారిల్లుతూ ఉండేదని చరిత్ర అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ చరిత్ర అధ్యయనం కూడా రెండు విధాలుగా కొనసాగింది. జర్మన్ చరిత్ర అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ చరిత్ర అధ్యయనం కూడా రెండు విధాలుగా కొనసాగింది. జర్మన్ చరిత్ర అధ్యయనవేత్త మాక్స్ ముల్లర్ ప్రాచ్యవాదాన్ని అనుసరిస్తే జేమ్స్‌మిల్, పాస్టర్ ఛార్లెస్ గ్రాంట్‌లు ఆధునిక వినిమయవాదాన్ని అనుసరించారు.

ప్రాచ్యవాదం భారతదేశాన్ని ఆధ్యాత్మిక చింతనకు, తత్వవేత్తలకు నెలవయిన భూమిగా చిత్రీకరించింది. తప్పితే భౌతిక పరిస్థితులకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఇక ఆధునిక వినిమయవాదమేమో దేశంలోని కులవివక్ష, అస్పృశ్యత, సతీ సహగమనం వంటి దురాచారాలన్నింటికీ హిందూ మతమే మూలకారణమని ఆరోపించింది. పాస్టర్ ఛార్లెస్ గ్రాంట్ భాష్యాలన్నీ దేశంలో క్రైస్తవ మత వ్యాప్తికి ఉద్దేశించినవిగా కనబడతాయి. క్రీ.శ 1వ శతాబ్దం మధ్య కాలంలోనే క్రైస్తవం భారతదేశంలో కాలుపెట్టింది. కానీ, 1800 సంవత్సరాల తర్వాత బ్రిటిష్ వలస పాలన మొదలయిన తరువాత కానీ ఆ మత నడవడిక వెలుగులోకి రాలేదు.

భారతదేశంలో చోటు చేసుకున్న రెండు మత సంస్కరణ ఉద్యమాలు ఆర్య సమాజం, బ్రహ్మ సమాజం పట్ల ఈ చరిత్ర కారుల అంచనాలలో వలసవాద పక్షపాత ధోరణులు ప్రస్ఫుటమవుతాయి. హిందూ కులీన వర్గాలు బ్రిటిష్ ప్రాపకం కోసం, హిందూ మతం మీద ఉన్న దురభిప్రాయాన్ని కొంత మేరకయినా తగ్గించే ప్రయత్నంలో భాగంగా ఈ రెండు మత సంస్కరణోద్యమాలు చేపట్టారనే వాదన కూడా ఉంది.

రామ్‌విలాస్ శర్మ రచించిన 'శాన్ శాంతవన్‌కి రాజ్య క్రాంతి' అనే పుస్తకంలో 1857 తిరుగుబాటుకు సన్నాహకంగా స్వామి దయానంద సరస్వతి చేపట్టిన కార్యకలాపాల గురించి వివరంగా పేర్కొన్నారు. స్వామి దయానంద సరస్వతి తన గురువు స్వామి చిర్రానంద ఆయన గురువు స్వామి పూర్ణానంద మరో ఇద్దరు మౌల్వీలతో కలిసి పశ్చిమ ఉత్తరప్రదేశ్ ప్రాంతమంతా పర్యటించి 1857 తిరుగుబాటుకు(బహదూర్ షా జఫర్ అనే ముస్లిం పాలకుడు ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహించాడు.) తగిన సన్నాహాలు చేశారని దయానంద సరస్వతి గోసంరక్షణ ఉద్యమాన్ని చేపట్టాడు. మత, సామాజిక సంస్కరణలను కోరుతూ 1857లో ఆర్యసమాజ ఉద్యమం ప్రారంభించాడు. బ్రిటిష్ పరిపాలనలో హిందూ కులీనులకు భాగం కల్పించే ఉద్దేశ్యంతో ముస్లిం వ్యతిరేక ప్రచారం కూడా శృతిమించి చేపట్టాడు. వేదాలు మాత్రమే ఆధ్యాత్మిక గ్రంథాలుగా అభివర్ణిస్తు ఇస్లాం, క్రైస్తవం, బౌద్ధం, జైనం, శైవం, వైష్ణవం, శాక్తేయమతాలన్నింటినీ దయానంద సరస్వతి తీవ్రంగా విమర్శించాడు. 1857 తిరుగుబాటుకు ముందు హిందూ-ముస్లిం కులీనులు ఇరువురూ దేశం నుంచి బ్రిటిష్ వారిని పారద్రోలగలం అనే విశ్వాసంతో ఉన్నారు. అయితే ఆ తిరుగుబాటు విఫలం కావడంతో ఈ ఐక్యత కూడా బదాబదలయిపోయింది. హిందూ కులీనులు బ్రిటష్ వారి సేవలో తరించి పోతుంటే ముస్లింలు తమ అధికారాన్ని కోల్పోయారు. దాదాపు అర్థ శతాబ్దం పాటు ఆంగ్లేయుల మీద ఉన్న ద్వేషంతో ఇంగ్లీష్ విద్యకు దూరంగా ఉన్నారు. బ్రిటిష్ పాలకులు తెలివిగా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని హిందూ-ముస్లింల మధ్య విద్వేషాలను రగిలిస్తు విభజించి, పాలించే తమ విధానానికి పదును పెట్టారు.

దయానంద సరస్వతి కంటే చాలా దశాబ్దాలకు ముందుగానీ రాజా రామ్మోహన్‌రాయ్ సంఘ సంస్కరణోద్యమానికి శ్రీకారం చుట్టారు. బహు దేవతారాధన, విగ్రహారాధనలను రాయ్ తీవ్రంగా వ్యతిరేకించాడు. ఏకేశ్వరవాదాన్ని ప్రచారం చేశాడు. 1815లో ఆత్మీయ సభ పేరిట ప్రారంభించిన సంస్థను 1828లో బ్రహ్మ సమాజంగా మార్చాడు. సతీ సహగమనం, బాల్య వివాహాలు, పరదా వంటి అనాచారాలకు వ్యతిరేకంగా ప్రచారం చేశాడు. 1872లో ప్రత్యేక వివాహ చట్ట రూప కల్పనకు దోహదం చేశాడు.

## ప్రత్యామ్నాయ థృక్పథాలు-ఆధునిక పరిణామాలు

రాజా రామ్మోహన్‌రాయ్, స్వామి దయానంద సరస్వతులకు భిన్నమైన థృక్పథాన్ని స్వామి రామకృష్ణ పరమహంస ముందుకు తెచ్చాడు. నిజమైన ఆధ్యాత్మిక వాది తరతమ భేదాలను అధిగమించినప్పుడే పరమహంసస్థాయికి చేరుకుంటారని బోధించాడు. 'యధోమత, తథోపథ' (ఎన్ని దృక్పథాలో అన్ని మార్గాలు) అని ప్రకటించాడు. ఇస్లాం, క్రైస్తవ మతాలను కూడా ఆచరించి మతాల మధ్యన భేదభావాలు లేవని స్పష్టం చేశాడు. అయితే, హిందూ కులీనులకు ఇలాంటి సాధికార మతాచారాల పట్ల ఎలాంటి ఆసక్తి లేకపోవడంతో పరమహంస బోధనలు, ఆయన అనుయాయులు నిర్లక్ష్యానికి గురయ్యారు. చికాగోలో జరిగిన సర్వమత సమ్మేళనానికి ఆహ్వానం లేకున్నా హాజరయి తన ప్రసంగం ద్వారా హిందూమత ప్రత్యేకత గురించి వివరిస్తూ స్వామి వివేకానంద సర్వధర్మ సమభావనను ప్రభోదించాడు. ఈ పరిణామాలన్నీ మతం పేరిట హిందూ-ముస్లిం కులీనులు రేపుతున్న ఘర్షణల వెనుక ఉన్న మోసకారితనాన్ని బట్టబయలు చేస్తున్నాయి. నిజానికి ఈ కులీనులకు మతం పట్ల అసలయిన అనురక్తి, ఆసక్తులు లేనే లేవు.

20వ శతాబ్దం చివరి నాటికి పెట్టుబడిదారీ విధానం ప్రజాస్వామిక విలువలకు తిలోదకాలు ఇచ్చేసింది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అస్థిత్వాల ఆధారంగా మత ఛాందసత్వాన్ని రెచ్చగొడతూ ఉంది. మతాచారాలు వాటి మౌళిక భావనల నుండి దూరం జరిగాయి. అవినీతిపరులైన మత గురువులకు ఎక్కడలేని గౌరవం, రక్షణలు లభిస్తున్నాయి. అంతర్జాతీయంగా చెలరేగుతున్న మత ఘర్షణలు వాస్తవానికి రాజకీయం స్వార్థ ప్రయోజనాల కోసం సాగుతున్నవే తప్పవాటిలో అసలయిన మత అంశాలు లేనే లేవు.

## ముగింపు

మతం అనేది చైతన్యానికి సంబంధించిన కార్యకలాపాలను అనుసరించేది అయితే సైన్సు భౌతిక ప్రపంచమర్మాలను అన్వేషిస్తుంది. సైన్సు అనేది ఏది, ఏమిటి, ఎందుకు అనేవి వివరిస్తుంది. కానీ మతం మాత్రం ఏమి ఆచరించాలో నిర్దేశిస్తుంది. చారిత్రకంగా చూస్తే మానవాళిని మతం రెండు విధాలుగా ప్రభావితం చేసింది. సాహిత్యం, సంగీతం, నృత్యం, గణితం, రసాయనశాస్త్రం, ఖగోళ శాస్త్రం తదితర శాస్త్రాలను అభివృద్ధి పరిచేందుకు తగిన సైద్ధాంతిక దిశా నిర్దేశం చెయ్యడంతోపాటు సంక్షేమ కార్యకలాపాల ద్వారా సమాజంలో సమతుల్యత సాధించేందుకు దోహదం చేసింది. ప్రాచీనకాలపు ఆశ్రయాలు, నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాలు, రామాయణ-మహాభారత గ్రంథాలు ఇవన్నీ అందులో భాగమే

మానవ జీవితం ఐహిక, ఆముష్మిక ఆలోచనల మధ్య ఊగిసలాడుతూ ఉంటుంది. మానవుని చైతన్యపూర్వక కార్యకలాపాలను నియంత్రించేందుకు ప్రత్యామ్నాయ వ్యవస్థ లేదు. మతం లేని పక్షంలో మానవులు ఈ భూగోళం మీద అత్యంత వినాశకర ప్రాణికోటిగా తయారై ఉండేది. నైతిక విలువలు

**(మిగతా 42వ పేజీలో)**

# ఎవరు దేశభక్తుడు? ఎవరు దేశద్రోహి?



\- ప్రకాశ్‌రాజ్

**ఇటీవల ఒక సినిమా షూటింగ్ కోసం ఢిల్లీకి వెళ్లాను. రాత్రంతా షూటింగ్. పగలు విశ్రాంతి. బయటకు వెళ్దామంటే ఎర్రటి ఎండ. టీవీ పెడితే పార్లమెంట్‌లో వక్ఫ్ చట్టంపై చర్చ జరుగుతోంది. దాన్ని చూస్తుంటే నాకెందుకో ఉమర్ ఖలీద్ గుర్తుకొచ్చాడు. ఏసీ రూముల్లో నివసించే నేనే ఎండను తట్టుకోలేకపోతున్నానే, ఐదేళ్లపాటు తీహార్ జైలులో ఈ ఎండను ఉమర్ ఎలా తట్టుకున్నాడా ? అనిపించింది. నా ఆలోచనలు - ఖలీద్ తల్లిదండ్రుల వైపు మళ్లాయి.**

ఒకసారి వాళ్లని కలిసి ధైర్యం చెబితే బావుంటుంది కదా అనుకున్నాను. మా ఇద్దరికీ పరిచయం ఉన్న వారికి ఫోన్ చేశాను. ఉమర్ తల్లిదండ్రులతో వారు మాట్లాడి, నేను వాళ్లను కలిసేందుకు వస్తున్నానని చెప్పారు. మార్గమధ్యంలో వాళ్లు కలిశారు. ఉమర్‌ను వారందరూ వారానికొకరు తీహార్ జైల్లో కలుస్తూ ఉంటారు. "మీ పనులు మీకుంటాయి. ఇంత హడావుడి జీవితంలో ప్రతి వారం ఉమర్‌ను కలవటానికి సమయం ఎలా కేటాయించగలుగుతున్నారు?" అని అడిగాను. "జైలు జీవితం ఎవరినైనా మార్చేయొచ్చు, అంత క్రూరంగా ఉంటుంది. అమీర్ అని మాకు తెలిసిన ఓ యువకుడున్నాడు. అతణ్ణి కూడా తప్పుడు అభియోగాలతో జైలుకు పంపారు. మొదటి మూడు నెలలు అమీర్ కుటుంబసభ్యులు ప్రతి వారం వచ్చి తనను కలిసేవారు. కానీ వాళ్లది రెక్కడితే కాని డొక్కాడని పరిస్థితి. దాంతో జైలుకు రావటం తగ్గించారు. వారు రాకపోవటంతో అమీర్‌లో ఆత్మవిశ్వాసం తగ్గింది. సునాయాసంగా బెయిల్ వచ్చేసే ఆ కేసులో – అమీర్ పదేళ్ల జైలులోనే గడిపాడు. జైలు అతణ్ణి ఎలా మార్చిందో మా కళ్లతో చూశాం. ఉమర్‌కు అలాంటి స్థితి రాకూడదని నిర్ణయించుకున్నాం. 'నీకు అండగా మేము న్నాం' అని చెప్పటానికి ప్రతి వారం మాలో ఒకరు వెళ్లి కలిసి వస్తూ ఉంటాం" అని ఉమర్ స్నేహితుడొకరు చెప్పారు. బెయిల్ రాకుండా, విచారణ లేకుండా జైళ్లల్లో మగ్గిపోతున్నవారు కొన్ని కోట్ల మంది ఉన్నారు. వారి వేదన కేవలం వారి కుటుంబాలకు, స్నేహితులకు మాత్రమే తెలుస్తుంది.

ఉమర్ స్నేహితుల దృష్టిలో అతనొక దేశభక్తుడు. దేశంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నవాడు. అలాంటి వ్యక్తిని ప్రభుత్వం జైలులో ఉంచి మానసికంగా ఇబ్బంది పెడుతోంది కాబట్టి వారు అతనికి అండగా నిలవాలను కున్నారు ఉమర్ స్నేహితులు. వారిని చూస్తుంటే గర్వంగా అనిపించింది. మేము వెళ్లే సమయానికి ఉమర్ తండ్రి వక్ఫ్ బోర్డు సమావేశానికి వెళ్లారు. తల్లి ప్రేమతో మమ్మల్ని ఆహ్వానించింది. పైకి నవ్వుతూ మాకు ఆతిథ్యమిచ్చినా, ఆమె కన్నుల్లో ఎంతో బాధ గూడుకట్టుకు ఉంది. ఆమెను ఎలా ఓదార్చాలో నాకు తెలియలేదు. ఏవో సందర్భం లేని మాటలు మాట్లాడుతున్నాం. మధ్యలో ఎక్కడో ఉమర్ కేసు ప్రస్తావన వచ్చింది. "నా కుమారుడు త్వరలో విడుదలవుతాడు, కచ్చితంగా బయటకు వస్తాడు. మాకు న్యాయవ్యవస్థపై ఇంకా విశ్వాసం ఉంది" అంది. మేము ఆమెను ఓదార్చటానికి వచ్చినట్లు అనిపించలేదు. ఆమె మమ్మల్ని ఓదారుస్తున్నట్లు అనిపించింది. నా కళ్లు చెమర్చాయి. కొడుకును అన్యాయంగా జైలులో పెట్టినవారికి శాపనార్థాలు పెట్టాల్సిందిపోయి, న్యాయవ్యవస్థపై నమ్మకంతో మాట్లాడుతోందంటే ఆమె ఆత్మవిశ్వాసాన్ని ఎలా వర్ణించాలి? ఇంతలో ఉమర్ తండ్రి వచ్చాడు. లోపలికి వెళ్లి మా అందరికీ చాయ్ కలిపి తీసుకువచ్చాడు. "మీ కుమారుడు ఒంటరి కాదు, మేమందరం ఉన్నాం," అన్నాను. ఆయన కళ్లలో ఒక వైపు విశ్వాసం, మరోవైపు ఆవేదన కనిపిస్తున్నాయి. "ఉమర్ తప్పు చేసి జైలుకు వెళ్లలేదు. ప్రజల కోసం పోరాడుతూ జైలుకు వెళ్లాడు. అయినా మనందరం తనతోనే ఉన్నాంగా," అన్నారా యన. ఆ తండ్రి ఆత్మవిశ్వాసానికి మనస్సులోనే సెల్యూట్ చేశాను. మాటలు సాగుతున్నాయి. "ఉమర్‌కు బెయిల్ వచ్చి విడుదలయితే, ప్రకాశ్ సార్ దగ్గరకు దక్షిణ భారతదేశానికి పంపేద్దాం. అక్కడైతే క్షేమంగా ఉంటాడు బాబా!" అని ఉమర్ స్నేహితుడొకరు అన్నారు. ఉమర్ తండ్రి అతని కళ్లలోకి సూటిగా చూసి "పోరాటం జరుగుతున్నది ఇక్కడ, ఢిల్లీలో. ఆ ప్రాంతాన్ని వదలి ఎక్కడికి వెళ్లాలి? ఎందుకు వెళ్లాలి?" అన్నారు. ఆయన మాటలకు నాకు షాక్ కొట్టినట్లయింది. వారి దృష్టిలో పోరాటమనేది జీవితానికి పర్యాయపదం. ఒక వ్యక్తికి ఉన్న సహజమైన హక్కులతో, రాజ్యాంగం చట్టబద్ధంగా ప్రసాదించిన గౌరవంతో ఈ సమాజంలో జీవించాలంటే పోరాడాల్సిందే. జీవచ్ఛవాలుగా ఉండలేం కదా! వర్తమానంలో ఉమర్‌ను ఎన్ని రకాలుగానైనా అనుకోవచ్చు. చరిత్ర మాత్రం భవిష్యత్తులో

**(మిగతా 32వ పేజీలో)**

# వ్యంగ్యం వద్దు.. కవిత్వం వద్దు, కావలసింది ప్రభుత్వ భజనే..



- మాడభూషి శ్రీధర్

మనకు ఏ నాణ్యమైన విద్యా వద్దు, విమర్శ అసలే వద్దు. కవితం వద్దు, వ్యంగ్యం వద్దు. మనకు కావలసింది భజన, సన్మానాలు-సత్కారాలు, ఎందుకూ పనికి రాని శాలువలు. వేల రూపాయల పూలహారాలు. ఇవన్నీ తిరోగమనానికి నిదర్శనంగా భావించాలి. కొన్ని రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ లో ముగ్గురు పాత్రికేయులను కారాగారానికి పంపింది. ఒకవేళ కోర్టు దిక్కు లేకపోతే, ఆ పాత్రికేయులకు ఏ దిక్కూ ఉండేది కాదు. హైదరాబాద్ న్యాయస్థానం బెయిల్ ఇచ్చిన తర్వాత వారు విడుదలయ్యారు. వారిని అరెస్ట్ చేయడానికి కారణం తీవ్రమైన పదజాలాన్ని ఉపయోగించడమట. అది కాస్త సీఎం రేవంత్ రెడ్డికి నచ్చలేదు. కాంగ్రెస్ పార్టీ పెద్దలకు కూడా నచ్చలేదు. దీంతో కోపానికి గురై జైల్లో వేశారు. ఆ పాత్రికేయుల ఫోన్లు, కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నారు. వారి తిట్టు ఘాటుగా అధికార పార్టీ నసాళానికి తగిలింది. ఒక్క సంఘటనే కాని బోలెడు కేసులు.

తెలంగాణలో ఇలా ఉండగా మహారాష్ట్రలో మరో ఘటన చోటు చేసుకుంది. ముంబైలో ఉపముఖ్యమంత్రి ఏకనాథ్ షిండేపై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారనే కారణంగా కమెడియన్ కునాల్ కామ్రాపై అనేక క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. కామ్రా తన స్టాండ్ అప్ కామెడీ ప్రదర్శనలో షిండేపై వ్యంగ్యం గా 'దేశద్రోహి' అని వ్యాఖ్యానించాడని ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యాఖ్యలు అభ్యంతరకరమైనవని ప్రభుత్వ మద్దతుదారులు ఆరోపించారు. మరింత ముందుకు వెళ్లి మహారాష్ట్ర శాసన మండలిలో 2025 మార్చి 27న కామ్రాపై ప్రివిలేజ్ నోటీసు జారీ చేయించారు.

ఇక గుజరాత్ రాష్ట్రంలో కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్ గడిపై 2025 ఫిబ్రవరి 10న ఎఫ్ఐఆర్ నమోదైంది. జామ్ నగర్‌లో జరిగిన సామూహిక వివాహ కార్యక్రమానికి హాజరైన ప్రతాప్ గరీ 'ఏ ఖూన్ కే ప్యాసే బాత్ సునో'(రక్త దాహార్తుల్లారా మాట వినండి) శీర్షికతో ఓ కవిత రాసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. అయితే ఇది విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉందం టూ జనవరి మూడో తేదీన జామ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులకు మద్దతుగా గుజరాత్ హైకోర్టు కూడా ఈ కవితను "అపకీర్తికరమైనదిగా" ప్రకటించింది. దీనిపై ఇమ్రాన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును తిరస్కరించింది.

ప్రతి దానికీ సుప్రీంకోర్టు తన సమయాన్ని వెచ్చించి, ఒకవేళ సమయం లేకపోయినా సరే కష్టపడి స్పష్టతతో కూడిన సమాధానం ఇవ్వాలి. అప్పటి వరకు ఎవరికి అర్థం కాదు. "ఈ కవిత ఏ సమాజానికి, ఏ మతానికి, ఏ రకమైన సముదాయానికి టార్గెట్ చేసి రాశారని అనుకోవడం ఎందుకు?" అని సుప్రీం కోర్టు స్పష్టతనిచ్చింది. ఆయన ఎలాంటి తప్పు చేయలేదని ధర్మాసనం అభిప్రాయపడింది. సామాజిక మాధ్యమాల్లో పెట్టిన ఆ కవితతో ఆయన శాంతి సందేశాన్ని అందించారని తెలిపింది. గుజరాత్ పోలీసులు మాత్రం దీనిని "ప్రజలను రెచ్చగొట్టే విధంగా ఉంది, దేశ ఐక్యతకు భంగం కలిగించేలా ఉంది" అని ఆరోపించారు. తనపై వచ్చిన ఆరోపణలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఎంపీ కోర్టులో పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత పరిస్థితుల ప్రకారం అధికారంలో ఉన్న ప్రభుత్వానికి భజన చేస్తే గవర్నర్, సీజేఐ, ఎంపీ అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి. ఈ కవిత విషయం మీద సుప్రీంకోర్టు ఇంకా ఏం చెప్పిందంటే "వ్యక్తిగతంగా లేదా ఒక వర్గానికి బృందానికి, జట్టు వారికి తమ అభిప్రాయాలను వ్యక్తపరచే స్వేచ్ఛ ఆరోగ్యకరమైన నాగరిక సమాజానికి అనివార్యం. భావవ్యక్తీకరణ లేకుండా మన సంస్కృతి అభివృద్ధి చెందలేదు" అని తీర్పులో స్పష్టం చేసింది.

ఇంకా చెపుతూ "పోలీసు వ్యవస్థ, ప్రభుత్వం తమ అధికారం మీద అసురక్షితంగా ఉండి, విమర్శను హానికరంగా భావిస్తూ వ్యక్తిగత స్వేచ్ఛను అణిచివేయడం తగదు." అని సూచించింది. ఇంత స్పష్టంగా న్యాయస్థానం చెప్పినా మళ్లీ ఎన్నో కేసులు పెడతారు..! ప్రభుత్వం 'సడక్ ఛాప్'(రోడ్డుపై లభించే చీప్ కవిత) అంటూ ఈ కవితను వ్యతిరేకించింది. సుప్రీంకోర్టు మాత్రం అభిప్రాయస్వేచ్ఛకు అనుకూలంగా తీర్పునిచ్చింది. "75 ఏళ్ల ప్రజాస్వామ్యంలో కేవలం ఒక కవితా వచనం లేదా వ్యంగ్యంగా చెప్పిన కామెడీ సమాజంలో విద్వేషాన్ని రెచ్చగొడు తోందని అనుకోవడం సరికాదు. అలా అనుకోవడం సమాజాన్ని మూగబోయేలా చేస్తుంది, అభివృద్ధికి ఆటంకంగా మారుతుంది." "ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛా భావన అత్యంత ప్రాధాన్యమైనది. కవి, రచయిత, కళాకారుడు లేదా నాటక రచయిత ఎవరైనా తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా చెప్పే హక్కు

కలిగి ఉండాలి. కేవలం మెజారిటీకి నచ్చనందుకు ఎవరినీ మాట్లాడకుండా చేయలేరు. ఒక సమాజం కేవలం మెజారిటీ అభిప్రాయాన్ని మాత్రమే అనుసరించి, ఇతర భావజాలాలను అణిచివేస్తే, అది ప్రజాస్వామ్యం కాదు" అని వ్యాఖ్యానించింది. స్వేచ్ఛాయుత భావవ్యక్తీకరణను అణిచివేయడం ప్రజాస్వామ్యానికి ముప్పు. భావవ్యక్తీకరణ హక్కు మన సంస్కృతిలో నిక్షిప్తమై ఉంది. కవిత్వం, నాటకం, స్టాండ్-అప్ కామెడీ, వ్యంగ్యం వీటిని అణిచివేయాలనే ప్రభుత్వ యత్నాలు సదాచారం కాదు. ఇప్పటికన్నా నిరంకుశ ప్రభుత్వాల ఆలోచనలో మార్పు వస్తుందంటారా? ❑

## హిందూ మతోన్మాదానికి అంబేద్కర్ ఓ సవాల్

**(16వ పేజీ తరువాయి)**

నిరోధకత్వాలు సాగిస్తున్న రాజకీయ, సిద్ధాంత ఎదురుదాడి ప్రస్తుత దేశ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. అంబేద్కర్ వారసత్వాన్ని సొంతం చేసుకోవడానికి హిందూత్వవాదులు చరిత్ర సారాన్ని వక్రీకరించి మరీ ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కుల వ్యవస్థపైనా, చాతుర్వర్ణ, సనాతన ధర్మాలపైనా ప్రతి ఒక్కరూ పోరాడాలి. అంటరానితనాన్ని మార్పు లేకుండా యధాతథంగా నిలిపి ఉంచే సామాజిక దొంతరలపైనా హిందూ ధర్మశాస్త్రాల ఆధిపత్యం వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలపై నేడు ఉద్యమించాలి. ప్లాటో రిపబ్లిక్ ఏ కారణం వల్ల వైఫల్యాన్ని ఎదుర్కొందో, సరిగ్గా అదే కారణం మూలంగానే చాతుర్వర్ణ వ్యవస్థ తప్పని సామాజిక తిరుగుబాటుదారుడైన, ఈ పీడిత వర్గ మేధావి హెచ్చరించారు. ఈ దుర్మార్గ వ్యవస్థ మూలం గా హిందువుల్లో దిగువ వర్గాలు ప్రత్యక్షంగా కార్యాచరణలోకి దిగకుండా పూర్తిగా నిస్సహాయులు గా చేయబడ్డారని అంబేద్కర్ వేలెత్తి చూపి ఇంతకంటే నీచమైన సామాజిక వ్యవస్థ మరొకటి రాబోదని హెచ్చరించారు. ఈ వ్యవస్థ ప్రజలను పరస్పర సహాయ కార్యకలాపాలు చేయనివ్వ కుండా కుంటుపరిచి, వారిని నిస్సహాయులుగా, చచ్చుబడిన వారిలా చేస్తుందని తెలిపారు. ఆయన సామాజిక, ఆర్థిక, ప్రజా స్వామ్యం కోసం ఉద్యమిస్తూనే ఈ వ్యవస్థ రాజకీయ రంగంలో కలగజేసే ప్రభావాలపై దృష్టి సారించి అవిరళమైన కృషి చేశారు. ధర్మశాస్త్రాలపై ఉన్న విశ్వాసాన్ని సర్వనాశనం చేయడం, వాటి పునాదిగా గల కులపరమైన నిరంకుశత్వాన్ని నాశనం చేయడమే దీనికి వాస్తవ పరిష్కారమని అంబేద్కర్ భావించారు. ఇటువంటి విషయాల్లో గాంధీ అర్ధ శతాబ్దానికి ముందే 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ హిందూ మతానికి ఓ సవాల్' అని ప్రకటించాడంటే అందులో ఆశ్చర్యమేమీలేదు. నిజంగానే ఆయన ఈనాటికీ ఒక సవాల్‌గానే నిలిచి ఉన్నారు. అందువల్లనే హిందూత్వ వాదులు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కూటమికి చెందిన కొన్ని శక్తులు నేడు ఆయనను నిర్లక్ష్యం చేయలేని స్థితిలో ఉన్నాయి. సామాజిక పురోగతిని నిరోధించటానికి పూనుకున్న వారిని వ్యతిరేకిస్తూ, సామాజిక ఛాందసవాదం, అవకాశవాద రాజకీయాలపై యుద్ధాలు సాగిస్తూ 1940 దశకం చివరిలో, 1950 దశకం తొలిలో హిందూ కోడ్ బిల్లును ప్రవేశపెట్టే ప్రయత్నాలకు నాయకత్వం వహించారు. కానీ ఛాందసవాద శక్తులు ఆయన ప్రయత్నానికి వెన్నుపోటు పొడిచాయి. వారసత్వం, వంశపారం పర్యపాలననూ, ఏక పార్టీ వ్యవస్థను ఆయన ద్వేషించారు. ఒకే పార్టీ ప్రజామోదమైన ప్రభుత్వాన్ని నడపటం అంటే, నిరంకుశత్వం తెరవెనుక నుండి పాలన సాగించే ఒక రూపంగా ప్రజాస్వామ్యం తయారవ్వడాన్ని అనుమ తించడమే అనేది అంబేద్కర్ ప్రముఖ సూత్రీకరణల్లో ఒకటి. నిరంకుశత్వం ఎన్నికయినదయినప్పటికీ, అది నిరంకుశత్వం కాకమానదు. నిరంకుశత్వం కూలదోయబడే అవకాశం ఉండటం, దాన్ని తోక ముడిచేటట్లు చేయగల అవకాశం ఉండటం, దాని ప్రత్యర్థి పార్టీ దాని స్థానంలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉండటమే నిరంకుశత్వానికి వ్యతిరేకంగా నిజమైన గ్యారంటీ అని అంబేద్కర్ హెచ్చరించారు. ఏకపార్టీ పాలన ప్రాతిపదికన గానీ, లేదా నిద్రపోయే హక్కులని నిద్రపోనీ అనే సామాజికతత్వ ప్రాతిపదికతో ఉండే రాజకీయ సుస్థిరత గానీ అంబేద్కర్‌కు గిట్టని విషయాలు. అంబేద్కర్ దూరదృష్టితో వెలిబుచ్చిన రాజకీయ భావాల్లో రెండు నేటి కాలానికి కూడా వర్తిస్తాయి. వాటిలో మొదటిది రాజకీయ స్వేచ్ఛలను ఒక గొప్ప వ్యక్తి పాదాల కింద ఉండనివ్వకండని, రెండోది రాజకీయాలలో భక్తి లేదా వీరారాధన ఉంటే అది అధోపతనానికి దారి అని చెప్పారు. అందుకే రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సామాజిక ప్రజాస్వామ్యంగా తీర్చిదిద్ది, వైరుధ్యాలను పరిష్కరించాలని లేకపోతే అవి ప్రజాస్వామ్య పునాదుల్ని నాశనం చేస్తాయని అంబేద్కర్ ఆనాడే హెచ్చరించారు. కాబట్టి నేడు ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సంక్షోభాలను అధిగమించేందుకు పోరాడటమే ఆయనకు నేడు మనమిచ్చే నిజమైన నివాళి. ❑

**(ఏప్రిల్ 14 డాక్టర్ అంబేద్కర్ జయంతి)**

**డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అత్యంత ప్రతిభావంతుడు. ఆయన దాదాపు 64 సబ్జెక్టులలో మాస్టర్స్ డిగ్రీలు సాధించారు. పైగా ఆయన 9 భాషలలో (ఇంగ్లిష్, ఫ్రెంచ్, జర్మన్, మరాఠీ, పర్షియన్, గుజరాతీ, హిందీ, పాళీ, సంస్కృతం) అనర్గళంగా మాట్లాడగలిగేవారు. సుమారు 21 సంవత్సరాలపాటు ప్రపంచమంతా తిరిగి అంబేద్కర్ విద్యాభ్యాసం చేశారు.**

# విష వలయంలో ఆంధ్రప్రదేశ్

## ప్రజల కోసం శాస్త్రవేత్తల ప్రకటన

**ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే ఫార్మా పరిశ్రమల కాలుష్యం, ప్రమాదాలతో విలవిలలాడుతోంది. గత నెలలో బలభద్రపురంలో వెల్లడైన క్యాన్సర్ విజృంభణ దీనికి ఒక భయంకరమైన ఉదాహరణ. అక్కడే క్యాన్సర్ కారక రసాయనాలు వాడే పరిశ్రమకు అనుమతివ్వడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ఇప్పుడు, మరింత ఆందోళనకరంగా, నియంత్రణ సాధ్యం కాని ప్రమాదకర రసాయనాల వాడుకకు మరోచోట కొత్త ప్రతిపాదన తెరపైకి వచ్చింది. మే 14న జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణ కేవలం ఒక తూతూమంత్రంలా కనిపిస్తోంది. శాస్త్రీయ దృక్పథం లేని అభివృద్ధి కోసం ఆరాటం, ప్రజల అవసరాలను విస్మరించి లాభాల కోసం పనిచేసే కంపెనీల ప్రోత్సాహం కారణంగా ఆంధ్రప్రదేశ్ శాపగ్రస్తమవుతోంది.**

ప్రపంచం తిరస్కరించిన హానికర రసాయనాలను తాత్కాలిక లాభాల కోసం వాడటం మన భవిష్యత్తును శాశ్వత నష్టాల్లోకి నెట్టనుంది. ఇదే తరహా రసాయనాలతో ఐరోపా దేశాలపై పడిన ఆర్థిక భారం అంచనా ప్రకారం 2 లక్షల కోట్ల డాలర్లు. ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజలను, పర్యావరణాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం, దాని సంస్థలు మరియు నిపుణుల కమిటీలు ఈ హానిని నివారించడంలో పూర్తిగా విఫలమవుతున్నాయి. శాస్త్రీయ విశ్లేషణ, ప్రజారోగ్య రక్షణ మరియు పర్యావరణ పరిరక్షణను విస్మరించి వ్యాపార ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. విచక్షణ లేకుండా హానికర పరిశ్రమలకు పర్యావరణ అనుమతులు ఇస్తున్నారు. ఉత్పత్తి పెంచుకోవడానికి ప్రజలకు హాని కలిగించే చర్యలకు వెనుకాడటం లేదు. కాస్టిక్ సోడా తయారీలో వెలువడే క్లోరీను ఉపఉత్పత్తి. క్లోరీన్ వాడుక సామర్థ్యం కాస్టిక్ సోడా ఉత్పత్తికి ప్రతిబంధకం. క్లోరీన్ వాడుక పెంచడానికి చేసే ప్రయత్నాలలో అడ్డదారులు తొక్కడానికి వెనుకాడని కంపెనీలు ప్రజలకూ, పర్యావరణానికీ ఎంతటి హాని చేయడానికీ వెరువక ప్రపంచం తిరస్కరించిన PFOA రసాయనాలను వాడే ఉత్పత్తులు ప్రారంభిస్తున్నారు. ఒకరు PFOA అనే శాశ్వత రసాయనాన్ని వాడతామని చెప్పగా, మరొకరు ఆ విషయాన్ని దాచి పెట్టి మే 14వ తేదీన ప్రజాభిప్రాయ సేకరణకు ప్రయత్నం చేస్తున్నారు. ముందుగా ఇక్కడ వాడతామంటున్న పెర్ ఫ్లోరో ఆక్టోనయేట్ అనే PFOA రసాయనం ప్రపంచానికి ఇప్పటికే చేసిన కీడు గురించి లభించే వివరాలు తెలుసుకోవడం అత్యవసరం.

### ప్రపంచవ్యాప్తంగా రసాయన కాలుష్యం

భూమి ఎదుర్కొంటున్న తొమ్మిది కీలక పర్యావరణ సమస్యల్లో రసాయన కాలుష్యం ఒకటి. మనం ఇప్పటికే ప్రమాదకర స్థాయిని దాటేశాము. శాశ్వత రసాయనాల కాలుష్యం హద్దులు దాటిందని 2022 నాటి పరిశోధన (కజిన్స్ తదితరులు) స్పష్టం చేస్తోంది. ఇది ప్రపంచానికి పెను సమస్య. శాశ్వత రసాయనాలు మానవ నాగరికత అంతరించినా భూమిపై మిగిలి ఉండే రసాయనాలు. వాటి ప్రత్యేక భౌతిక రసాయన గుణాల వల్ల వాటి వినియోగం విస్తృతమైంది. ఉత్పత్తి చేసే కంపెనీలు వాటి ప్రమాదాలను గుర్తించినప్పటికీ దాచిపెట్టాయి. విల్బర్ టెన్నాంట్ ఉదంతం మరియు రాబర్ట్ బిలోట్ న్యాయ పోరాటం PFOA కాలుష్యం యొక్క భయంకరమైన వాస్తవాలను ప్రపంచానికి చాటిచెప్పాయి. PFOA వినియోగంపై పరిమితులు విధించబడినప్పటికీ, భారతదేశం వంటి దేశాలలో దీని వినియోగం కొనసాగడం ఆందోళన కలిగిస్తోంది. బిలోట్ కోర్టు ద్వారా పొందిన సమాచారాన్ని EPA తో పంచుకున్నాడు. దీని ఫలితంగా 2006లో కంపెనీలు PFOA వాడకాన్ని దశలవారీగా తగ్గించడానికి మరియు 2015 నాటికి పూర్తిగా మానుకోవడానికి అంగీకరించాయి. కాలుష్య బాధితులు వేసిన క్లాస్ యాక్షన్ సూట్ ద్వారా 1961-2006 మధ్య డ్యూపాంట్ మరియు 3 కంపెనీల అంతర్గత అధ్యయనాల సమాచారం బయటపడింది. 2020లో ప్రొఫెసర్ వుడ్ రఫ్ మరియు ఇతరులు జరిపిన అధ్యయనంలో కంపెనీలకు 1970 నాటికే PFOA వల్ల కలిగే ఆరోగ్య నష్టాలు తెలుసని తేలింది. కానీ వారు దానిని దాచిపెట్టారు. 2000 సంవత్సరానికి ముందే శాశ్వత రసాయనాలు ప్రపంచవ్యాప్తంగా వ్యాపించాయని పరిశోధనలు చెబుతున్నాయి. 1990 దశకం చివరలో డ్యూపాంట్ ఫ్యాక్టరీ ఉద్యోగుల ఆరోగ్యంపై అధ్యయనానికి రక్త నమూనాలు సేకరించింది. ఆరోగ్యాన్ని పోల్చడానికి PFOA

లేని రక్త నమూనాల కోసం వెతుకులాట మొదలు బెట్టారు. మారుమూల పారిశ్రామిక ప్రపంచానికి దూరంగా బతుకుతున్న ప్రజలలో కూడా ఈ రసాయనాలు లేని రక్తం దొరకలేదు.

చివరికి ఈ రసాయనాల ఉత్పత్తి ప్రారంభం కాక ముందు, కొరియా యుద్ధానికి సైనికులను ఎంపికచేసే ప్రక్రియలో సేకరిం చిన రక్త నమూనాలను పోలికకు తీసుకున్నారు. అంటే 2000కు పూర్వమే ఈ రసాయనాలు ప్రపంచమంతా వ్యాపించాయి. ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడ వర్షం కురిసినా వాటిలో ఈ రసాయనాలు ఉంటున్నాయి. న్యాయ పోరాటంలో భాగంగా ఏర్పాటు చేసిన C8 సైన్స్ పానెల్ PFOA వల్ల ఆరు రకాల వ్యాధులు వస్తాయని నిర్ధారించింది: అధిక కొలెస్ట్రాల్, అల్సరేటివ్ కోలిటిస్, థైరాయిడ్ వ్యాధి, వృషణాల కాన్సర్, మూత్రపిండాల కాన్సర్ మరియు గర్భధారణ ప్రేరిత రక్తపోటు. 2019లో స్టాక్ హెూమ్ కన్వెన్షన్ ద్వారా 180 దేశాలు శాశ్వత రసాయనాల వాడకాన్ని మానుకోవడానికి ఒప్పందం చేసుకున్నాయి. భారతదేశం ఈ ఒప్పందంలో భాగం కాకపోవడం వలన కంపెనీలు %PFOA% వాడే ఉత్పత్తులతో పర్యావరణ అనుమతులు పొందుతున్నాయి. ఈ విస్తరణ ప్రజల పాలిట శాపం కానుంది. %PFO% లతో జరిగిన విధ్వంసం యొక్క భయానకమైన వాస్తవాలను మనం చూశాము.

**ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు పొంచి ఉన్న ప్రమాదం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. గ్రాసిం, బలభద్రపురం తమ కాస్టిక్ సోడా ప్రాజెక్టు విస్తరణలో క్లోరీను వినియోగం పెంచేందుకు రకరకాల క్లోరీను రసాయనాల ఉత్పత్తులు ప్రతిపాదించి ఫిబ్రవరి 2024లో పర్యావరణ అనుమతి పొందింది. ప్రజాభిప్రాయ సేకరణ (ఫిబ్రవరి 2023) సందర్భంలో మానవ హక్కుల వేదిక కార్యదర్శి పాల్గొని, రాత పూర్వకంగానూ అభ్యంతరాలను తెలిపారు. ప్రజల కోసం శాస్త్రవేత్తలు ప్రతిపాదనలోని అంతర్జాతీయ ఒప్పంద (మాంట్రియల్ 1987, కిగాలి సవరణ 2016) ఉల్లంఘనలను ఓజోను విభాగానికి వివరంగా తెలియ పరుస్తూ లేఖ రాశారు.**

ఓజోను పొరకు హాని కలిగించే కార్బన్ టెట్రాక్లోరైడ్ రోజుకి 70 టన్నులు ఉత్పత్తి చేసి ఇన్సినరేటర్ లో తగల బెడతారట. తగలబెట్టే క్రమంలో అత్యంత ప్రమాదకర డయాక్సిన్లు, ఫ్యూరాన్లు ఉత్పత్తయి గాలిలో కలుస్తాయి. అవి కాన్సర్ కారకాలు. అవి గాలిలో వేయి కోట్లలో ఒక భాగమున్నా ప్రమాదకరం. అలాగే R22 రసాయనాన్ని ఉత్పత్తి చేసేప్పుడు R23 కూడా విధిగా ఉత్పత్తవుతుంది. దానిని 2030 నాటికి పూర్తిగా తొలగించడానికి ప్రపంచం అంగీకరించింది. పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో R23 ఉత్పత్తిని దాచి పెట్టారు. ఇవేవీ పరిగణనలోకి తీసుకోకుండా, ప్రజల అభ్యంతరాలను పరిశీలించ కుండానే పర్యావరణ అనుమతి యిచ్చారు. ప్రజాభిప్రాయ సేకరణ 28 ఫిబ్రవరి 2023 న జరగగా, గ్రాసిం పర్యావరణ అనుమతికి ప్రతిపాదనని 20 డిసెంబరు 2023 నాడు సమర్పించింది. జనవరి 16, 2024 నాటి నిపుణుల కమిటీ సమావేశంలో పర్యావరణ అనుమతికి సిఫారసు చేశారు. ఆ సమావేశపు నిమిషాలలో నిపుణులు PFOA వాడుక గురించి చర్చించిన దాఖలాలు లేవు. వాటి నుండి రక్షణపై ఎలాటి షరతులూ లేవు. PTFE తయారీలో వాడే PFOA రసాయన చర్యలలో పాల్గొనదు. వాడిన మొత్తం వ్యర్థంగా బయటకు వస్తుంది. దానిని నియంత్రించడం, నిర్మూలించడం సాధ్యం కాదు అందుకే వాడకాన్ని నిషేధించాయి సంపన్న దేశాలు. అంతర్జాతీయ ఒప్పందం కూడా వాడుక మానడం గురించే. ప్రస్తుతం d¾+ప్లాంటు విస్తరణ జరుగుతున్నది. మరో ప్రమాదం టిజివిఎస్ఆర్ఎపిఎల్, గొందిపర్ల ఆవిష్కరిస్తున్నది. వీరు కూడా క్లోరీను వినియోగం పెంచుకోవడానికి క్లోరీను రసాయనాల తయారీ ప్రతిపాదనకు ToR పొందారు. ప్రజాభిప్రాయ సేకరణ తేదీ ప్రకటించారు. వీరు రోజుకి 40 టన్నుల PTFE తయారు చేస్తారట, అలాగే రోజుకి మొత్తం 25 టన్నుల కార్బన్ టెట్రాక్లోరైడ్ ఉత్పత్తి చేయనున్నారు. వీరి పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో PFOA, R23 సమాచారం ఇవ్వలేదు. హాని సమాచారాన్ని దాచే కంపెనీ ఎంత బాధ్యతతో వ్యవహరిస్తుందో గుర్తించడం కష్టం కాదు. ప్రజల పట్ల, పర్యావరణం పట్ల కాలుష్య నియంత్రణ మండలి ఎలా వ్యవహరిస్తుందో తెలియని విషయం కాదు. దానికి సమర్థతా లేదు చిత్తశుద్ధి లేదు. PFOAలపై ప్రమాణం లేదు. నీటిలో, గాలిలో ఎంత మోతాదులో వుందో పరిశీలించగల వ్యవస్థ లేదు. నైపుణ్యం లేదు. ప్రజలనెవరు కాపాడతారు. అక్కడ నీటిలో ప్రస్తుతం ఎంత PFOA వుందో ప్రాథమిక సమాచారం సేకరించ లేదు. పరిసర ప్రజల, ప్రత్యేకించి ఆ కంపెనీలో పని చేసే కార్మికుల, ఉద్యోగుల రక్త నమూనాలలో PFOA ఎంత వుందో పరిశీలించాలి. కనీస సామర్థ్యాలు లేకుండా శాశ్వత రసాయనాల వాడుక రాష్ట్ర ప్రజలకు మరణ శాసనం. ఐఐటి మద్రాసు చెన్నైలో 14 నీటి నమూనాలు, అందులో 3 భూగర్భ జలాలవి, తీసుకుని పరిశీలించారు.

శాశ్వత రసాయనాలు లేని నీటి నమూనా లేదు. ఒక బడిలోని బోర్ వెల్ నుండి సేకరించిన నీరు అత్యధికంగా 77.61

**(మిగతా 33వ పేజీలో)**

# "ముసల్మాన్ల మొహల్లా"

(హిందీ కవిత)

- నిఖిల్ సచాన్



నా స్నేహితుడొకడు పదే పదే అంటుండేవాడు
'ఈ మత సామరస్యం సంగతి
మాట్లాడ్డానికి బాగుంటుంది గాని
ఒక్కసారి ఎప్పుడైనా నువ్వు
ముసల్మాన్ల మొహల్లాలోకి
ఒంటరిగా వెళ్లావా' అని.
'ఒక్కసారి వెళ్లి చూడు
భయంతో వణికిపోతావు' అనేవాడు.

అతను ముసల్మానులంటే చాలా భయపడేవాడు
కాని షారుఖ్ ఖాన్ అన్నా
షారుఖ్ బుగ్గల్లో వెలిగే సొట్ట అన్నా
ప్రతి దీపావళికీ విడుదలయ్యే షారుఖ్ సినిమా అన్నా
పడి చచ్చేవాడు
దిలీప్ కుమార్ అసలు పేరు యూసుఫ్ అని తెలియదు గాని
దిలీప్ కుమార్ సినిమాలు కూడా తప్పకుండా చూసేవాడు
మా వాడికి షారుఖ్ అన్నా దిలీప్ అన్నా భయం లేదు
ముసల్మానులంటే మాత్రం భయపడేవాడు.

క్రిస్మస్ నాడు అమిర్ ఖాన్ సినిమా
విడుదలవుతుందని ఎదురుచూసేవాడు
బ్లాక్‌లోనైనా టికెట్ దొరికించుకుని
ఈలలు వేస్తూ సినిమా చూసేవాడు
ఆమిర్ అంటే ఎప్పుడూ భయపడలేదు
ముసల్మానులంటే మాత్రం భయపడేవాడు
నాతోపాటే ఇంజనీరయ్యాడు
సైన్సంటే ఎంత మోజంటే
అబ్దుల్ కలామ్‌లాగ ఒకానొక రోజు
తానూ పెద్ద విజ్ఞానవేత్తనవుతాననేవాడు
దేశం పేరు నిలబడతాననేవాడు
కలామ్ అంటే ఎప్పుడూ భయపడలేదు
ముసల్మానులంటే మాత్రం భయపడేవాడు

మా వాడికి క్రికెటంటే కూడా చాలా ఇష్టం
మొహమ్మద్ అజరుద్దీన్ మణికట్టు కనికట్టూ
జహీర్‌ఖాన్, ఇర్ఫన్ పఠాన్‌ల చేతుల్లో ఎగిరే బంతులూ
మూడిటికి మూడూ ఇంద్రజాలాలనేవాడు
వాళ్లు ఆటకు దిగారంటే మనకు ఓటమే లేదనేవాడు
వాళ్లను చూసి ఎప్పుడూ భయపడలేదు
మరి ముసల్మానులంటే మాత్రం భయపడేవాడు

మావాడు నర్గీస్, మధుబాలల సౌందర్యానికి వీరాభిమాని
వాళ్ల నలుపు తెలుపుల సినిమాలన్నీ చూసేవాడు
వహీదా రహమాన్ చిరునవ్వుకూ
పర్వీన్ బాబీ కళ్లలో కాంక్షకూ ప్రాణాలిచ్చేవాడు
వాళ్లను చూసి ఎన్నడూ భయపడలేదు
ముసల్మానులంటే మాత్రం భయపడేవాడు

నిరాశలో మునిగినప్పుడల్లా
మహమ్మద్ రఫీ పాటలు వినేవాడు
రఫీ సాబ్ గళంలోనే భగవంతుని నివాసం అనేవాడు
చెవుల మీద చేతులు పెట్టుకుని రఫీ అని పవిత్రంగా అనేవాడు
అసలు సాహబ్ అని కలపకుండా రఫీ పేరు ఉచ్చరించేవాడే కాదు
సాహిర్ రాసిన పాటలు వింటుంటే
ఆనందంతో కంటతడి పెట్టేవాడు
వాళ్లను చూసి ఎన్నడూ భయపడలేదు
ముసల్మానులంటే మాత్రం భయపడేవాడు

ప్రతి జనవరి 26న
అల్లామా ఇక్బాల్ రాసిన
సారే జహాఁసే అచ్ఛా పాడుతుండేవాడు
ఈ పాట పాడుతున్నప్పుడు
దానికి బిస్మిల్లా షహనాయీ
జాకిర్ హుసేన్ తబ్లా
జతగూడితే ఇంక చెప్పేదేముంది అనేవాడు
వాళ్లను చూసి ఎన్నడూ భయపడేవాడు కాదు
ముసల్మానులంటే మాత్రం భయపడేవాడు

ఒక అమ్మాయితో ప్రేమలో పడినప్పుడు
గాలిబ్ గజల్లే వినిపించేవాడు
ఫైజ్ గీతాలు పంపుతుండేవాడు
ఉచితంగా సంగ్రహించిన ఉర్దూ పదాలతో

ప్రేమలో పడిపోయిన అతని ప్రేయసి
ఇవాళ అతని సహచరి
ఆ కవుల గురించి అతనికెప్పుడూ భయం లేదు
ముసల్మానులంటే మాత్రం అమ్మయ్యో భయం

పెద్ద అబద్ధాలకోరు నా స్నేహితుడు
మహా అమాయకుడు కూడ
తెలియకుండానే ప్రతి ముసల్మాన్ నూ
ఎంతగానో ప్రేమించాడు
మరి ఎందుకనేవాడో తెలియదు
ముసల్మానులంటే భయం అనేవాడు
సంతోషంగా, ప్రేమమయంగా
ముసల్మానుల దేశంలోనే ఉండేవాడు
ఏ ముసల్మాన్ల మొహల్లాకు వెళ్లాడో
తెలియదు గాని
ఒంటరిగా వెళ్లడానికి అమ్మో భయం అనేవాడు

బహుశా అతనికి
భగవంతుడు సృష్టించిన ముసల్మాన్లంటే భయం లేదు
బహుశా అతను
రాజకీయాలు సృష్టించిన,
పత్రికలు సృష్టించిన,
ఎన్నికలు సృష్టించిన
కాల్పనిక ముసల్మాన్లంటే భయపడతాడేమో
వాళ్లు కల్పన వల్ల చాలా భయం గొల్పుతారు
కాని వాస్తవంలో వాళ్లు
పండుగపూట సేమియాల కంటే మధురమైనవాళ్లు

**(తెలుగు అనువాదం: ఎన్.వేణుగోపాల్)**

# ఎవరు దేశభక్తుడు? ఎవరు దేశద్రోహి?

**(24వ పేజీ తరువాయి)**

ఉమర్‌ను, అతని తల్లితండ్రులను దేశభక్తులుగా గుర్తిస్తుందనే నమ్మకం నాకుంది. ఇక్కడ మనం ఇంకొన్ని విషయాలు కూడా మాట్లాడుకోవాలి. అసలు దేశద్రోహం అంటే ఏమిటనే విషయం తెలియకపోతే ఎవరు దేశభక్తుడో ఎవరు దేశద్రోహో ఎలా తెలుస్తుంది? ఈ నిర్వచనాలు తెలుసుకోవటానికి ఎప్పటి చరిత్రనో తవ్వాల్సిన అవసరం లేదు. వందేళ్ల నాటి చరిత్రను గమనిస్తే చాలు. మన దేశాన్ని అహింస అనే సూత్రం ద్వారా ఏకతాటిపై ఉంచిన మహాత్ముడు మత సామరస్యమనే సిద్ధాంతాన్ని గాఢంగా నమ్మాడు. "దేశం అంటే భూభాగం కాదు. దానిలో నివసించే ప్రజలు. వారందరికీ తమకు నచ్చిన మతాన్ని అనుసరించే హక్కు ఉంది. జాతి, మతం, భాషలు వేరు కావచ్చు. కానీ అందరూ సోదరులే" అని ప్రచారం చేశాడు. ఈ భావజాలాన్ని వ్యతిరేకించిన గాడ్సే అనే మతతత్వ ఉన్మాది మహాత్ముడిని హత్యచేశాడు. ఈ మధ్యకాలంలో బీజేపీ అధికారం లోకి వచ్చిన తర్వాత–గాంధీజీని దేశద్రోహిగా, గాడ్సేను దేశభక్తుడిగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం బీజేపీ చేతిలో అధికారం ఉంది. తమ విధానాలను అడ్డుకున్న వారు దేశద్రోహులవుతున్నారు. తమ మతమౌఢ్యాన్ని సమ్మతించేవారు అనతికాలంలోనే దేశభక్తులవుతున్నారు! ఉమర్ కూడా అంతే! అతను ఒకప్పుడు చురుకైన యువకుడు. భారత రాజ్యాంగ ఆత్మను అర్థం చేసుకున్నవాడు. దానిని నాశనం చేస్తున్న వారికి వ్యతిరేకంగా రోడ్డెక్కి పోరాడినవాడు. మత ద్వేషాన్ని, మతమౌఢ్యాన్ని వ్యాప్తి చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలనుకున్న వారికి వ్యతిరేకంగా పోరాడినవాడు. "మతం వ్యక్తిగత అంశం. దానికి రాజకీయాల్లో స్థానం లేదు" అని ప్రతిపాదించిన గాంధీకి నిజమైన మానస పుత్రుడు. "సర్వాధికా రానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ పోరాటం మన నుంచి ప్రారంభం కాలేదు, మనతో ఆగిపోదు" అని గర్జించిన భగత్‌సింగ్ వారసుడు.

మన దేశానికి సౌభ్రాతృత్వం అంతరాత్మ. దీన్ని నాశనం చేయటానికి ఉద్దేశించినదే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ). దీనికి వ్యతిరేకంగా ఉమర్ పోరాడాడు. దీనిని వ్యతిరేకించే వారికి, సమర్థించే వారికి మధ్య జరిగిన పోరాటం హింసాత్మక రూపం దాల్చింది. ఈ పోరాటంలో ఎక్కువగా ప్రాణాలు కోల్పోయింది ముస్లింలే! ఈ హింసాత్మక ఘర్షణలను ప్రేరేపించే విధంగా ప్రసంగాలు చేసిన పాలక పార్టీ సభ్యులు స్వేచ్ఛగానే తిరుగుతున్నారు. రాజకీయాలు చేస్తున్నారు. కానీ ఉమర్‌ను మాత్రం ఉగ్రవాద నిరోధక చట్టం (యూఏపీఏ) కింద ప్రభుత్వం అరెస్ట్ చేసింది. కింది కోర్టులన్నీ ఉమర్‌కు బెయిల్ ఇవ్వటానికి నిరాకరించాయి. సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉంది. ఆరోపణలపై విచారణ చేయకుండా, నిర్ధారణ చేయకుం డా, ఒక వ్యక్తిని ఐదేళ్లు జైలులో ఉంచటం చట్టవిరుద్ధమని సహజన్యాయ సూత్రాలు చెబుతున్నాయి. కానీ ఉమర్‌కు తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకొనే అవకాశమే లేకపోతోంది.

"ఇరవై నిమిషాలు సమయం ఇవ్వమనండి. ఉమర్ ఏ అపరాధమూ చేయలేదని నిరూపిస్తా" అంటాడు ఆయన తరఫు న్యాయవాది. కానీ ఆ ఇరవై నిమిషాల సమయం సుప్రీంకోర్టుకు లభించటం లేదు. చచ్చిన చేపలే ప్రవాహానికి కొట్టుకుపోతాయి. బతికిన చేపే ప్రవాహానికి ఎదురీదుతుంది. ఒడ్డుకు చేరుతుంది. నా దృష్టిలో ఉమర్ ప్రస్తుతం ప్రవాహానికి ఎదురీదుతున్న చేప. ఎప్పటికైనా తప్పకుండా విజయం సాధిస్తాడు.

# హిందుత్వ హిందూ మతంల మధ్య తేడాపై అరుణ్ శౌరీ ఏమన్నారు ?




- కొండూరి వీరయ్య

**మాజీ సంపాదకులు, మాజీ కేంద్ర మంత్రి రచించిన కొత్త పుస్తకం ది న్యూ ఐకాన్ : సావర్కర్ అండ్ ఫాక్ట్స్ స్వాతంత్రోద్య మంలో సావర్కర్ పాత్ర, ఫ్రాన్స్ ఆయన అరెస్టు నేపథ్యం, ఆయన గురించిన కల్పిత వీరగాథలలో వాస్తవాల మోతాదు వంటి విషయాలను తడుముతుంది. ఈ గ్రంథంలో రచయిత సమాధానాలు వెదకటానికి ఎంచుకున్న కొన్ని ప్రశ్నలు ఇలా ఉన్నాయి.**

ఫ్రెంచ్ సముద్ర జలాల్లో మెరిసిల్స్ వద్ద ఓడ నుండి తప్పించు కోవడానికి ప్రయత్నం చేశారా ? సావర్కర్ చెప్పుకుంటున్నట్టు లండన్‌లో సావర్కర్, గాంధీలు స్నేహితులుగా కలిసి ఉన్నారా ? అండమాన్‌లో జైలు అధికారుల కారణంగానే సావర్కర్ ముస్లిం వ్యతిరేకి అయ్యారా ? బ్రిటిష్ ప్రభుత్వానికి ఆయన క్షమాభిక్ష కోరుతూ పెట్టుకున్న దరఖాస్తును ఎలా అర్థం చేసుకోవాలి ? తనను విడుదల చేస్తే బ్రిటిష్ వారికి ఉపయోగపడతానని హామీ ఇచ్చారా ? తన విడుదల కోసం బ్రిటిష్ పాలకులు కూడా కోరని షరతులన్నీ సావర్కర్ తన క్షమాభిక్ష దరఖాస్తులో చెప్పి మరీ ఒప్పుకున్నారా ? క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో బ్రిటిష్ వారికి హృదయ పూర్వక సహాయ సహకారాలు అందిస్తామని ఒప్పుకున్నారా ? నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు మార్గదర్శి సావర్కారేనా ? హిందూ మతం గురించి, మత విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, పవిత్ర గోవులు, పవిత్ర గ్రంథాలు గురించి సావర్కర్ అభిప్రాయం ఏమిటి? భారతీయులు హిందుత్వలో మునిగిపోయారా? సావర్కర్ నిర్మించదల్చుకున్న రాజ్యం ఎటువంటిది ? ఆర్ఎస్ఎస్‌కు అతి పెద్ద అసౌకర్యంగా ఉన్న గాంధీజీ స్మృతులు చెరిపేయటానికే సావర్కర్‌ను ప్రస్తుత పాలకులు ప్రజల మనోఫలకంపై పునఃప్రతిష్ఠించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయా ? అన్నవి పెంగ్విన్ ప్రచురించిన ఈ గ్రంథం ద్వారా అరుణ్‌శౌరీ సమాధానాలు చెప్పదలచుకున్న కొన్ని ప్రశ్నలు. వీటికి సమాధానం వెతకడానికి అరుణ్‌శౌరీ సావర్కర్ రచనలు, ఉపన్యాసాలు, వ్యాసాలు, వివిధ సందర్భాల్లో వెలువరించిన ప్రకటనలను అధ్యయనం చేసి వడపోసి 550 పేజీల గ్రంథాన్ని మన ముందు ఉంచారు.

ఒక ఉమ్మడి శత్రువుని చూపించడానికి మించి మరేదీ ఒక దేశ ప్రజలను ఐక్యం చేయటానికి ఉపయోగపడదన్న




ఎసెన్షియల్స్ ఆఫ్ హిందుత్వ గ్రంథంలో సావర్కర్ రాసిన విషయాలను వర్తమానానికి అన్వయించి చూసుకుంటే దేశంలో కమ్యూనిస్టుల నుండి భీమా కోరేగావ్ నిందితుల వరకూ, ప్రశ్నించే అర్బికల నుండి ప్రతిపక్షాల వరకూ అందరూ దేశ ద్రోహులే అని బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు చేస్తున్న విపరీత విద్వేష ప్రచారానికి ముందుగుండు సామగ్రి ఎక్కడ తయారవుతుందో అర్థమవుతుంది. విద్వేషమే జాతి ఐక్యతకు పునాది అన్న సావర్కర్ మాటలు ఎంత మంది భావితరాల మతోన్మాద సైన్యానికి సాటి భారతీయుల పట్ల గుడ్డి వ్యతిరేకతను నూరి పోసిందో అర్థం చేసుకోవడం ఈ గ్రంథ అధ్యయనం ద్వారా సాధ్యమవుతుంది. పుస్తకాన్ని ముగిస్తూ అరుణ్ శౌరి రాసిన తుది పలుకులు మతోన్మాద మత్తులో జోగుతున్న దేశాన్ని చెర్నకోల తో కొట్టి మరీ లేపుతాయి. అవే ఈ క్రింది వాక్యాలు :

"హిందూ మతం ప్రధానంగా ఆత్మ శుద్ధి కేంద్రితం. దీనికి భిన్నమైనది హిందుత్వ. హిందూత్వ అనేది రాజ్య కాంక్ష. రాజ్యాన్ని స్వాధీనపర్చుకుని, దానిపై ఆధిపత్యం చెలాయిస్తూ తన లక్ష్యాలకు అనుగుణంగా రాజ్యాన్ని తిమ్మిని బమ్మిని చేసే ప్రాజెక్ట్. ఆత్మ పరిశుద్ధతకు సత్యానికి కట్టుబడి ఉండటం,

అణుకువ, నమ్రత, సేవా భావన, నైతిక ప్రవర్తన అనివార్యం. దీనికి భిన్నమైనది హిందూత్వ. రాజ్యాన్ని ఆక్రమించుకోవాలని పోరు పెడుతుంది. సమాజాన్ని అన్ని రకాలుగా గుప్పిట్లో పెట్టుకోవాలని కోరుతుంది. అలా గుప్పిట్లో పెట్టుకోవడానికి ఇతరుల్ని రెచ్చగొట్టడానికే కానీ, అసత్యాలు అర్ధ సత్యాలు ప్రచారం చేయటానికి కానీ, హింసాత్మక చర్యలకు కానీ, మోసానికి, అవినీతికి కానీ వెనకాడదు. ఇంకో మాటలో చెప్పాలంటే తన లక్ష్యసాధన కోసం ఏమి చెయ్యటానికి అయినా సిద్ధ పడేది హిందూత్వ. అంటే నాయకత్వం ఏది కరెక్ట్ అనుకుంటే అదంతా చేయటానికి అనుయాయులు సిద్ధపడటం హిందుత్వ లక్షణం.

హిందూమతంలో అన్ని ఉపచారాలు– క్రతువులు, ఆచార వ్యవహారాలు, ధ్యానం, ప్రార్థనలు ఆత్మ పరిశుద్ధికి మార్గాలు. కానీ వీటన్నింటికీ వక్రభాష్యాలు చెప్పి రాజ్యాధికారాన్ని సాధించటం కోసమే రాజ్యంపై పెత్తనం. చేయటం కోసమే ఈ క్రతువులు, ఆచారాలు, భక్తి ప్రపత్తులు అన్నిటినీ ఉపయోగించుకుంటుంది. రాజ్యాధికారం కోసం సమాజాన్ని ముక్కలు ముక్కలు చెయ్యటానికి కూడా వెనకాడదు. తీర్థయాత్రలు అన్న పదానికి ఉన్న సాంప్రదాయక అవగాహనకు భిన్నంగా ధార్మిక పర్యాటక రంగం వంటి వింత వింత విధానాల కు తెరతీస్తుంది. ప్రసన్న వదనం, ప్రశాంత చిత్తంతో దేవుడికి తనను తాను అర్పించుకోవడం అన్న భావనస్థానంలో భూనాభోంతరాలు పిక్కటిల్లేలా ప్రచారం చేయటమే భక్తి అని నమ్మిస్తుంది. విభిన్న మార్గాల్లో భగవంతుని చేరుకోవడం అన్న హిందూ మత వాస్తవికత స్థానంలో నాయకుడి అడుగుజాడల్లో నడవడం ద్వారానే పుణ్యం పురుషార్థం అని నమ్ముతుంది.

ఏ రోజైతే మతం రాజ్యాధికార కాంక్షను నెరవేర్చుకోవడానికి సాధనంగా వాడబడుతుందో అటువంటి మతాన్ని అధికార దాహం మింగేస్తుంది. ఏసు క్రీస్తు ప్రారంభించిన క్రైస్తవానికి, సూఫీ తెగకు చెందిన ఇస్లాం మతానికి ఏ గతి పట్టిందో చూడండి. అందుకే.. నా విన్నపం ఏమంటే.. హిందూత్వ నుండి హిందూ మతాన్ని కాపాడుకుందాం." అంటూ అర్థమైన విజ్ఞప్తి తో తన రచనను ముగిస్తారు అరుణ్‌శౌరి. ❑

**(ది వైర్ సౌజన్యంతో..)**

# విష వలయంలో ఆంధ్రప్రదేశ్

**(28వ పేజీ తరువాయి)**

నానో్గ్రాముల PFOA లీటరుకీ చూపింది. అది అమెరికాలో త్రాగు నీటి ప్రమాణం కంటే 93 వేల రెట్లు ఎక్కువ. ఫలితాలను ద హిందూ దినపత్రిక వెల్లడించగానే NGT తనే కేసు నమోదు చేసి విచారిస్తున్నది. గంగా, పెరియాల్, నోయల్, కువోం నదులలో ఈ రసాయనాలను గుర్తించారు. పరిశీలిస్తే కృష్ణా గోదావరులలోనూ వుంటాయి. కంపెనీ పక్కనే కృష్ణా నది వుంది. డ్యూపాంట్ ప్లాంటుతో ఇది సామ్యం. అక్కడ నది. దాని పరీవాహక ప్రాంత వాసులు అనారోగ్యం పాలయ్యారు. కొందరు కోర్టుకి వెళ్లి పరిహారం పొందారు. ఇక్కడ బాధితుల గోడెవరు పట్టించుకుంటారు. PFOలతో జరిగిన విధ్వంసం యొక్క భయానకమైన వాస్తవాలను మనం చూశాము. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్కు పొంచి ఉన్న ప్రమాదం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. గ్రాసిం మరియు టిజివి ఎస్ఆర్ఎఏసిఎల్ వంటి కంపెనీలు కేవలం లాభాల కోసం ప్రజల ఆరోగ్యం మరియు పర్యావరణంతో చెలగాటమాడుతున్నాయి. కాలుష్య నియంత్రణ మండలి తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తిగా విఫలమైంది. కనీస సామర్థ్యాలు లేకుండా శాశ్వత రసాయనాల వాడుక రాష్ట్ర ప్రజలకు ఒక మరణ శాసనం లాంటిది. కృష్ణా నది ఒడ్డున ఉన్న ఈ పరిశ్రమ భవిష్యత్తులో ఒహియో నది తరహా విషాదానికి దారితీయవచ్చు. హైదరాబాదు, అమరావతి ప్రజలు అదేనీరు తాగుతారు. లక్షకోట్లలో 4 భాగాలు PFOA వున్న నీరు తాగడానికి పనికి రాదు. ప్రస్తుత నీటి శుద్ధి వ్యవస్థలు PFOAలను తొలగించలేవు.

బాధితుల గోడు వినేదెవరు? ఆంధ్రప్రదేశ్ ప్రజలారా మేల్కొండి! మన ఆరోగ్యం, మన పర్యావరణం మరియు మన భవిష్యత్తు కోసం గట్టిగా నిలబడాల్సిన సమయం ఇది. శాస్త్రీయ దృక్పథంతో కూడిన అభివృద్ధిని మనం డిమాండ్ చేయాలి, లాభాపేక్షతో కూడిన విషపూరితమైన పరిశ్రమలను కాదు.

**ప్రజల కోసం శాస్త్రవేత్తలు**

**డా. కలపాల బాబూరావు, డా.వెంకటరెడ్డి**
**డా. వి.శ్రీహరి, డా. డి.రాంబాబు, డా.అహమద్ ఖాన్**
**డా. ఎం.బాపూజీ, డా. సి.వి.ఎస్ మూర్తి**
**డా. కె.కోటేశ్వరరావు, డా. ఎ.వి.రావు**
**డా. సిహెచ్ వెంకటేశ్వర్లు, డా. అడపా శ్రీనివాస రావు**
**డా. పి.దివాకర్, డా. బి.వి.రెడ్డి, డా. పి.జి.రావు**
**డా. ఎం.మోహనరావు, డా. బి.విశ్వనాథం**
**ప్రొ. కె.వెంకటేశ్వరరావు, డా. బి.ఎస్.ఆచార్య**
**ప్రొ. బి.ఎన్.రెడ్డి, ప్రొ. కె.సత్యప్రసాద్**
**ప్రొ. కె విజయ కుమార్, డా. ఇ.అ.స.శర్మ**
**గౌతమ్‌శాయి, ఆర్.సుబ్బారావు**
**డా. వై.కృష్ణమూర్తి, డా. టి.శ్రీనివాసరావు**
**కె.కోటేశ్వరరావు, ఎస్.పి.మోహనరావు** ❑

# భారత ప్రస్థానం: జాలువారిన జ్ఞాపకాలు



- రామచంద్ర గుహ

గోపాల్‌కృష్ణ గాంధీ జీవన యాత్ర అష్ట పదులలోకి ప్రవేశించనున్నది. 22 ఏప్రిల్ 2020న ట్విట్టర్‌పై (అప్పటికింకా అది Xగా మారలేదు) ఒక థ్రెడ్ (ట్వీట్‌ల పరంపర)ను పోస్ట్ చేశాను. 'మన మధ్య నడయాడుతున్న ఒక విశిష్ట భారతీయుని 75వ జన్మదినోత్సవ సందర్భమిది: ఆ ప్రముఖుడు ప్రజా సేవకుడు, దౌత్యవేత్త, రచయిత, విద్వజ్జుడు గోపాల్‌కృష్ణ గాంధీ'. మాతృదేశానికి ఆయన అందించిన సేవలు, ఆకర్షణీయమైన వ్యక్తిత్వం, సౌహార్దపూర్వకమైన నడవడి గురించి ప్రస్తుతిస్తూ చివరకు ఆయనకు నేను వ్యక్తిగతంగా ఎలా రుణపడి ఉన్నదీ పేర్కొన్నాను. ఆధునిక భారతదేశ చరిత్ర, మహాత్మాగాంధీ గురించి మరెవ్వరికంటే కూడా ఎక్కువగా ఆయన నాకు బోధించారు'. ఐదు సంవత్సరాలు గడిచిపోయాయి. మరి మూడు రోజుల్లో గోపాల్ 80వ వసంతంలోకి వెళ్లనున్నారు. ఇప్పుడు ఆయన, తన సొంత జీవన ప్రస్థానంతో సమాంతరంగా సాగిన మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య పురోగతి, తిరోగతిపై ఒక జ్ఞానదాయక గ్రంథాన్ని కానుకగా అందించడం ద్వారా నన్ను(ఇంకా ఎంతో మంది భారతీయులను) మరెంతగానో రుణగ్రస్తుడిని చేసుకున్నారు. తన విస్తృత అధ్యయనం, భారత్ గురించిన ప్రగాఢమైన అవగాహనతో చారిత్రక ఘటనల వృత్తాంతాలతో మేళవించిన వ్యక్తిగత జ్ఞాపకాల విలక్షణ చరిత్ర అది. ఆయన వచనం అద్భుతమైనది. మన ఆలోచనాశీలతను సునిశితం చేసేది, రచయిత స్ఫూర్తిదాయక జీవిత గమనాన్ని, మన రిపబ్లిక్ సమున్నత, సంక్షోభ భరిత ప్రస్థానాన్ని, మునుపెన్నడూ చూడని చాలా అరుదైన ఛాయచిత్రాలతో సహా అక్షరీకరించిన గ్రంథమది. హిందీ, ఇంగ్లీష్, బెంగాలీ, తమిళ చలనచిత్రాల గురించిన ప్రేమపూర్వకమైన ప్రస్తావనలు ఎన్నో ఉన్నాయి. సాహిత్యం, వైదుష్యం, ప్రజాసేవతోపాటు సినిమాలు సైతం ఆయన జీవితాన్ని ప్రభావదాయకంగా తీర్చిదిద్దాయన్నది స్పష్టం.

గోపాల్ తాజా గ్రంథం 'Undying Light : A Personal History of Independent India' స్వతంత్ర భారత తొలి సంవత్సరాలను, ప్రత్యేకించి మహాత్ముని చివరి నిరాహార దీక్షలు, ఆయన బలిదానం, నెహ్రూ–పటేల్ మధ్య విభేదాలు, దేశ హితానికై వారి సమన్వయ కృషి గురించి విశదమైన కథనాలతో ప్రారంభమవుతుంది. ఆ తరువాత కాలక్రమానుసారంగా ప్రతి సంవత్సరం గురించి క్లుప్త, ఉల్లాసకరమైన కథనాలతో కొనసాగి, చివరి దశాబ్దంన్నర కాలం గురించి ఒక ఏకీకృత అధ్యాయంతో ముగుస్తుంది.

స్వాతంత్ర్య ఆగమనం, దేశ విభజన తరుణంలో జన్మించిన గోపాల్‌కృష్ణ గాంధీ మన రిపబ్లిక్‌తోపాటు ఎదుగుతూ వచ్చారు. దేశభక్తి ప్రపూరితులైన తల్లిదండ్రులు దేవదాస్ (మహాత్ముని కుమారుడు), లక్ష్మి (రాజాజీ కుమార్తె) ఆయన మేధో పరిణామాన్ని ప్రభావితం చేశారు. తన తోబుట్టువులు తార, రాజ్‌మోహన్, రామచంద్ర గురించి కూడా గోపాల్ అవ్యాజ ప్రేమాదరాలతో రాశారు. ఇంకా వివాదాస్పద ప్రధాన మంత్రులు, లోక విఖ్యాతులు కాని ఉపాధ్యాయులు, సంఘ సేవకులు, ఎంతోమంది ఆసక్తిదాయక ప్రభావశీల వ్యక్తుల గురించిన విశేషాలు కూడా మనకు గోపాల్ గ్రంథం ద్వారా తెలుస్తాయి. గోపాల్ తన మాతామహుడు చక్రవర్తుల రాజ గోపాలాచారి(రాజాజీ) గురించి సహజంగానే ప్రముఖ ప్రాధాన్యంతో రాశారు. స్వతంత్ర భారతదేశంలో అత్యున్నత పదవిని అధిష్టించిన రాజాజీ, తన రాజకీయ జీవితోన్నతికి బాటలు వేసిన భారత జాతీయ కాంగ్రెస్‌ను విడనాడి 'స్వతంత్ర పార్టీ' అనే ప్రతిపక్షాన్ని వ్యవస్థాపించారు. 'తన జీవితంపై ఏకైక అతి పెద్ద ప్రభావం' తన మాతామహుడేనని గోపాల్ వివరించారు. గోపాల్ పదే పదే ప్రస్తావించిన రెండో వ్యక్తి సాటిలేని సంగీత విదుషీమణి ఎమ్ఎస్ సుబ్బులక్ష్మి. కుటుంబ స్నేహితురాలు అయిన సుబ్బులక్ష్మి సంగీతం, సమున్నత వ్యక్తిత్వం గోపాల్ జీవితంపై ఒక అజరామరమైన ప్రభావం. ఆయనను బాగా ప్రభావితం చేసిన మూడో వ్యక్తి జయప్రకాశ్ నారాయణ్. ఆయన పరిపూర్ణ చిత్తశుద్ధి, ప్రశాంత వక్తృత్వం, ముఖ వర్చస్సు, అన్నిటినీ మించి ఆయన ఆంగ్ల భాషా గరిమ తనను బాగా ప్రభావితం చేశాయని గోపాల్ రాశారు. భారత్–చైనా సంఘర్షణ కాలంలో తన అభిమాని ఆహ్వానంపై జయప్రకాశ్ ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్ కళాశాలలో ఒక ఉపన్యాసం వెలువరించారు. 'స్వాతంత్ర్యోద్యమ కాలంలో జాతీయవాదం అంటే వలసపాలన నుంచి విముక్తికై పోరాడడం, కోల్పోయిన ఆత్మగౌరవాన్ని పునఃసాధించుకోవడం, స్వావలంబన అహింసాత్మకంగా శాసనోల్లంఘన చేయడంగా వర్ధిల్లిందని చెప్పారు. స్వాతంత్ర్య సాధన అనంతరం అసహనం, యుద్ధోన్మాదం, ఇరుగు పొరుగు దేశాలను బెదిరించడం, శ్రుతి మించిన దేశభక్తిని జాతీయ వాదంగా అర్థం చేసుకుంటున్నారని

జయప్రకాశ్ ఆవేదన వ్యక్తం చేశారు'. గోపాల్ మనో ప్రపంచం నుంచి జాలువారిన ఈ జ్ఞాపకమూ, 1960ల్లో ప్రభుత్వ వ్యవహారాల్లో ఆంగ్లభాష వాడకాన్ని పూర్తిగా త్యజించేందుకు జరిగిన ప్రయత్నాలపై కథనమూ రెండూ నేరుగా వర్తమానంతో సంభాషించేవే. గోపాల్ ఇలా రాశారు: 'నేను బాధతప్త హృదయంతో నలిగిపోయాను. హిందీని అభిమానిస్తాను, అయితే దాని సామ్రాజ్యవాద డాంబికాన్ని ద్వేషిస్తాను. భాష విషయమై రాజాజీ భావాలతో ప్రభావితుడిని అయిన నేను అధికార భాషగా ఇంగ్లీష్‌కు స్వస్తి చెప్పాలన్న ప్రతిపాదనను ఎటువంటి మినహాయింపు లేకుండా తీవ్రంగా వ్యతిరేకించాను'.

గోపాల్‌కృష్ణ గాంధీ Undying Light : A Personal History of Independent India స్వతంత్ర భారతదేశ ప్రస్థానాన్ని వివరించింది. ఈ విశిష్ట కథనం, జాతి గమనాన్ని ప్రభావితం చేసిన ప్రధాన సంఘటనలు, వివాదాలను వ్యాఖ్యాన సహితంగా వర్ణించింది. ఈ నేపథ్యంలో, కర్ణాటక సంగీత కచేరిలో గాత్ర విద్వాంసుడికి వాద్య సహకారం అందించే వాయులీన వాద్యకారుడు సృజించే నాద లయలా, గోపాల్ స్వీయ జీవనయానం మనకు అవగతమవుతుంది. ఐఏఎస్ అధికారిగా గోపాల్ ఉద్యోగ జీవితం గ్రామీణ తంజావూరు ప్రాంతంలో ప్రారంభమయింది. ఆ తొలినాళ్లలో ఆయన ఒక సిరియన్ క్రైస్తవుడు, ఒక తమిళ జైనుడు, ఒక ముస్లిమ్‌తో కలిసి ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఆ ఉద్యోగ జీవితం ఉచ్చదశలో రాష్ట్రపతి కార్యదర్శిగా, పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా పనిచేశారు. ఆ తరువాత మూడు ఖండాలలో నాలుగు దేశాలలో ఐదు వేర్వేరు దౌత్య బాధ్యతల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. ఈ ఉన్నత విధుల నిర్వహణ గురించి గొప్ప ఖచ్చితత్వం, స్పష్టతతో గోపాల్ రాశారు. దక్షిణాఫ్రికా, శ్రీలంక రాజకీయాలపై ఆయన ఆలోచనాత్మకమైన వృత్తాంతాలు ఎంతో విలువైనవి.

తమిళులు, బెంగాలీలు, దిల్లీవాలాలు ఆయనకు బాగా సుపరిచితులే అయినప్పటికీ ఈ సువిశాల భారతదేశంలోని సకల సామాజిక, సాంస్కృతిక వైవిధ్యాల గురించి గోపాల్‌కు మంచి అవగాహన ఉన్నది. ఈశాన్య భారత సమస్యాత్మక సరిహద్దు ప్రాంతాలు, కశ్మీర్‌కు గోపాల్ తన కథనంలో సముచిత ప్రాధాన్యమిచ్చారు. ఆయన Undying Light పలు ఆసక్తికరమైన ఉదంతాలను వెల్లడించింది. హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైన తరువాత రాజాజీ, ఆయన కుమార్తె నామగిరి హైదరాబాద్‌ను సందర్శించారు. ఆ సందర్భంగా గవర్నర్ –జనరల్ కుమార్తెకు నిజాం నవాబు వజ్రాలు పొదిగిన ఒక నెక్లెస్‌ను బహుమానంగా ఇచ్చారు. అయితే రాజాజీ ఆ ఆభరణాన్ని తీసుకునేందుకు అంగీకరించ లేదు. వితంతువు అయిన తన కుమార్తెకు అటువంటి విలువైన ఆభరణాన్ని ఇవ్వటం సుముచితం కాదని రాజాజీ అభిప్రాయ పడ్డారు. ఆ తరువాత నామగిరి తన తండ్రి వైఖరిని ఆక్షేపించారు. వజ్రాల నెక్లెస్‌ను తిరిగి ఇచ్చివేస్తూ 'మేము గాంధీ గారి శిష్యులం. అంత ఖరీదైన వస్తువులు మాకు అవసరం లేదు' అని చెప్పి ఉండవలసింది.


గాంధీ, రాజాజీల మనుమడుగా గోపాల్‌కు తమ కుటుంబ విశిష్ట నేపథ్యం గురించి, ఆ గొప్పదనం తన జీవితోన్నతికి ఎలా దోహదం చేసిందో, అప్పుడప్పుడూ ఎలా ఆటంకమయిందో గోపాల్‌కు బాగా తెలుసు. న్యూఢిల్లీలోని తమ స్వగృహానికి నిత్యం ఎంతో మంది అసాధారణ వ్యక్తులు వస్తూ పోతుండడాన్ని బాల్యం నుంచి సన్నిహితంగా పరిశీలించిన గోపాల్ ఇలా రాశారు: 'హరిజన సేవ' విషయమై మా కుటుంబానికి ఉజ్వల మయిన యశస్సు ఉన్నది. అయితే మా కుటుంబ సన్నిహిత, స్నేహితులలో దళిత వ్యక్తి ఎవరూ లేరు. అవును, ఒక దళితుడు కూడా లేదు. మాకు ముస్లిమ్ క్రిస్టియన్, సిక్కు స్నేహితులు ఉన్నారు. అమెరికాలో ఆఫ్రికన్ అమెరికన్లు ఎంతో మంది మాకు స్నేహితులే. యూదు మతస్థులూ ఎంతో మంది మాకు స్నేహితులే. అయితే ఒక్క భారతీయ దళితుడు కూడా లేదు'.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురించి గోపాల్ ఇలా రాశారు: 'ఆయన పాత నౌక ఎస్.ఎస్ ఇండియాకు కొత్త కెప్టెన్ కాదుబీ కొత్త నౌక ఎస్.ఎస్.భారత్‌కు కొత్త సరంగు. పాత నౌకకు ప్రజా స్వామిక గణతంత్రవాదం, లౌకికవాదం అనే ఇంజిన్లు ఉండగా కొత్త నౌక మెజారిటేరియన్ జాతీయవాదం, హిందుత్వ అనే ఇంజిన్లతో నడుస్తున్నది'. డిసెంబర్ 1992లో బాబ్రీమసీదు కూల్చివేతకు సంబంధించిన కథనంలో గోపాల్ తన డైరీ నుంచి రెండు వ్యాఖ్యలను ఉటంకించారు: '30 జనవరి 1948 తరువాత భారతదేశ చరిత్రలో ఇది (6, డిసెంబర్ 1992న బాబ్రీ కూల్చివేత) 'చీకటి క్షణం' అని పేర్కొంటూ ఆయన ఒక ప్రశ్నను సంధించారు: 'మనం ఒక నాగరికత పతనం అంచున ఉన్నామా?' 'అన్‌డైయింగ్ లైట్' ముగింపు అధ్యాయంలో వర్తమాన భారతదేశం ఎదుర్కొంటున్న కొన్ని ప్రధాన సమస్యల గురించి గోపాల్ ప్రస్తావించారు. అవి: విశృంఖలంగా పర్యావరణ విధ్వంసం, మత విద్వేషం, రాజ్యాంగ సంస్థల స్వతంత్ర ప్రతిపత్తి క్షీణించడం, రాజకీయ ఎజెండాలకు గతాన్ని ఆయుధంగా ఉపయోగించుకోవడం మొదలైనవి. గోపాల్‌కృష్ణ గాంధీ తన యవ్వనంలో ఆవాహన చేసుకుని, ఉద్యోగ, మేధో జీవితంలో స్ఫూర్తిదాయకంగా నిబద్ధమైన భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య ఆదర్శాలకు అవి పెనుసవాళ్లుగా పరిణమించాయి. అయినప్పటికీ గోపాల్ తన పుస్తకాన్ని ఈ ఆశావహమైన వాక్యంతో ముగించారు: 'భారత్ వెలుగు మసకబారవచ్చు కానీ అది అంతరించదు. భారత్ ఆత్మ తేజస్సు ప్రకాశిస్తూనే ఉంటుంది'. ❑

# కొత్త చూపు.. సమాజానికో దారిదీపం

- బంగారు వి వి ఆచార్యులు

**ఈ** పుస్తకం ఓ మార్క్సిస్ట్ మేధావి డి.వి.వి.యస్. వర్మ గారి రచన. ఈ మేధావి విద్యార్థి ఉద్యమాల నుండి ఆవిర్భవించిన ఓ తెలుగుతేజం. ఈ పుస్తకం 'కొత్తచూపు' ఆయన జీవిత సహచరి, భాగస్వామి శ్రీమతి మనోరమ గారికి అంకితం ఇవ్వడంతో మొదలైనది. ఈ 'కొత్తచూపు'కు ప్రముఖ చరిత్రకారులు, తెలుగు ప్రజల సమగ్ర చరిత్రను రూపొందించటానికే జీవితాన్ని అంకితం చేసిన ప్రొఫెసర్. శ్రీ.వకుళాభరణం రామకృష్ణగారు వారి ముందుమాటలో వర్మ గారిని 'కొత్త ఆలోచనల దారులు పరచిన పథికుడు' అని వ్యక్తీకరించారు. ఆయన మాటలు అక్షర సత్యం. శ్రీ వర్మ గారు విద్యార్థి దశ నుండి, సామాజిక సమస్యలు, ప్రపంచచరిత్ర, మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, గ్రాంస్కి ఆలోచనల్ని అవపోసన పట్టిన ధీశాలి.




వెల : రూ. 100 మాత్రమే

**కొత్త చూపు**

రచన : డి వి వి ఎస్ వర్మ

ప్రతులకు : 1). విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు,

2). డి వి వి ఎస్ వర్మ : 85006 78977

సెల్ నెంబర్‌లో సంప్రదించండి.

వకుళాభరణం రామకృష్ణ గారు వారి ముందు మాటలో" వర్మ గారు మార్క్సిస్ట్ దృక్పథంతో చేసిన కొన్ని సూత్రీకరణలు ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర అధ్యయనానికి మార్గదర్శకాలుగా పనిచేస్తాయనడంలో సందేహం లేదు. స్వాతంత్ర్యానంతర ఆంధ్రదేశ రాజకీయ అధ్యయనానికి వర్మ గారి ఈ పరిశీలన ఒక కరదీపిక. గ్రాంసీనీ అధ్యయనం చెయ్యడానికి లోతైన అవగాహన శక్తి కావాలి. వర్మ గారు గ్రాంసీని వ్యక్తీకరించిన తీరులోని స్పష్టత నన్ను విస్మయ పరిచింది అంటారు. హిస్టారిక్ బ్లాక్, హేజమోని, కౌంటర్ హేజమొని, బాస్టర్డ్ హెజమొని, సవర్ణ మేధావులు, లోకజ్ఞానం విచక్షణా జ్ఞానంగా మారే తీరు వంటి జటిలమైన సైద్ధాంతిక అంశాల్ని తెలుగులో మంచి నీళ్లప్రాయం చేశారు అంటారు.

సీనియర్ పాత్రికేయుడు మిత్రులు డి.సోమసుందర్ పుస్తకాన్ని, వర్మ గార్ని పరిచయం చేస్తూ "ఐదారు దశాబ్దాల వర్మగారి సామాజిక కార్యకలాపాల కుదురుంది నా లాంటి అనేకమంది కార్యకర్తల బలగం మొలకలు వేసింది. అది తెలుగు రాష్ట్రాల్లో విస్తరించి ఉంది. విభిన్న జీవన రంగాలలో ఆ మొలకలు ఎదిగి తమదైన కీలక భూమిక పోషించడం మనం గమనించవచ్చు" అంటారు. వర్మ గారు స్వతహాగా ఉద్యమ నిర్మాత. ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్లు, సంపూర్ణ అక్షరాస్యత, మద్యపాన నిషేధం తదితర అంశాలపై అటవీ భూముల చెట్టుపట్టాలు లాంటి ఎన్నో ఉద్యమాలు స్వయంగా రూపకల్పన చేసుకుని ఉద్యమ నిర్మాణం కావించారు అని తెలిపారు. జాతీయస్ఫూర్తి, దారి దీపం పత్రికలకు సంపాదకునిగా తనదైన శైలితో సంపాదకీయాలు వ్రాయడంతోపాటు, వివిధ పత్రికల్లో

రాజకీయ, సామాజిక సమస్యలపై వ్యాసాలద్వారా చైతన్య పర్చడంతో పాటు. సమస్యలకు చక్కటి పరిష్కారాలు సూచించడం కూడా ఆయన వ్యాసాల ప్రత్యేకత.

ఈ "కొత్త చూపు"లో 1.ఎన్.టి.ఆర్ ఒక మార్క్సిస్ట్ పరిశీలన, 2.ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు, 3. వ్యవస్థను మార్చే ప్రజా ఉద్యమాలు అనే మూడు పుస్తకాలతోపాటు వివిధ సమస్యలపై వ్యాసాలు, సంపాదకీయాలు, రాజకీయ, సైద్ధాంతిక విషయాలపై వ్యాసాలు పొందుపర్చారు. దీనిలో ఈ ఒక్క వ్యాసం గురించి చర్చించినా అదో పెద్ద గ్రంథం అవుతుంది. అయినా కొన్ని అంశాలు చర్చించాల్సి ఉంది.

ఎన్.టి.రామారావు ఒక మార్క్సిస్టు పరిశీలన వాస్తవానికి జూలై 1988న మొదటి ముద్రణ, అదే సంవత్సరం డిసెంబరులో రెండవ ముద్రణ అచ్చువేయబడింది. ఆ కాలంలో ఈ పుస్తకం బహుళ ప్రాచుర్యం పొందింది. ఈ పుస్తకంలో నటనలో ఎనలేని కీర్తి సంపాదించిన ఎన్.ట.ఆర్, ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో రాజకీయ రంగప్రవేశం మీద, పరిపాలన మీద ప్రజలకు గల గాఢమైన అభిమానంపైనా, తీవ్రమైన వ్యతిరేకతపైనా, ఈ రాజకీయ ప్రత్యామ్నాయ ఆవిర్భవించిన తీరు, దాని పర్యవసానాలపైన చేసిన పరిశీలన విశదీకరించబడింది. ఈ పరిశీలన గ్రంథం రాష్ట్ర దేశ రాజకీయ పరిణామాలపై భవిష్యత్ పరిశీలనకు పరిశోధనకు ప్రేరణగా ఉపకరిస్తుందదం ఎలాంటి అతిశయోక్తి కాదు. ఆ కాలంలో ఆ రాజకీయ పరిణామాలపై అనేక పుస్తకాలు వచ్చాయి. ఆయనకు అతీతశక్తులు ఉన్నాయని, రాజకీయ మాంత్రికునిలా అభివర్ణించారు. కొందరు రాజకీయ దురంధరుడు అన్నారు. కొందరు రాష్ట్రానికి పట్టిన గ్రహణం అన్నారు. వ్రాసేవారి ఎవరి దృష్టికోణం వారిది. వర్మగారు మార్క్సిస్టు దృక్కోణంలో పరిశీలించటం మొదలుపెట్టి ఈ పుస్తకానికి రూపకల్పన చేశారు.

**ఇక రెండవది : ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు**

దీనికి పునాది 1952 నుండి 2020 మధ్య ఆంధ్రప్రదేశ్ రాజకీయ ప్రయోగశాలగా ఎలా పరిణామం చెందిందో వివరించిన పుస్తకం. ఈ పుస్తకానికి ముందుమాట రాస్తూ కొప్పర్తి వెంకట రమణమూర్తి మాస్టారు "గతాన్ని పరిశీలించడానికి వెనక్కు చూడాలి. వర్తమానాన్ని అధ్యయనానికి చుట్టూ చూడాలి. భవిష్యత్ నిర్మాణానికి ముందుకు చూడాలి. డబ్బై ఏళ్ల ఆంధ్రప్రదేశ్ రాజకీయ సామాజిక పరిణామాలను అన్ని వైపులా చూస్తూ చేసిన అవలోకన ఇది" అంటారు. గతం వాస్తవాల (facts) మీద నిలబడుతుంది. వాస్తవం పవిత్రమైనది అన్నారు ఇహెచ్ కార్. వాస్తవం ఒకటే అయినా వ్యాఖ్యానాలు అనేకము ఉంటాయి. నిర్జీవ పదార్థాన్ని వ్యాఖ్యానించేటప్పుడు వైవిధ్యం ఉండకపోవచ్చు. కానీ సజీవులైన మానవుల చేత నిర్మించబడిన వైవిధ్య భరితమైన మనుగడను మళ్లీ అదే జీవ లక్షణాలున్న మనుషులు విశ్లేషించ పూనుకొన్నప్పుడు మనకు తెలుసుకున్న గతమే కొత్తగా కనపడుతుంది. కొత్తగా అర్థమౌతుంది. మీరు చదవబోయేది వాస్తవిక ఆధారంగా ఎంతో సృజనాత్మకంగా తయారు చేసిన డాక్యుమెంట్ అంటారు కొప్పర్తి.

**ఇక మూడవది : వ్యవస్థను మార్చే ప్రజా ఉద్యమాలు -**

**కొత్త చూపు - కొత్తదారి**

వాస్తవానికి ఈ పుస్తకం కూడా 2018 ఏప్రిల్‌లో ముద్రణ పొందింది. ఇదో 6 అంశాలతో కూడిన బుక్‌లెట్. అయితే నేటికి ఆ అంశాలు ప్రాశస్త్యము కలిగి ఉన్నాయి. ప్రపంచం త్వరిత గతిన పెను మార్పులకు లోనవుతుంది. ఇరవై సంవత్సరాల క్రితమే పెట్టుబడిదారి వ్యవస్థకు ఇక తిరుగులేదు. ప్రపంచం అంతా దాని ఏకధృవం మీదే నడుస్తుంది అనుకున్నారు. సంపద పెట్టుబడి దారుల దగ్గర ఎంత పెద్దగా జేరితే అదంతా పేదల జేబులు నింపుతుంది. అని నమ్మ బలికారు. అయితే సామాన్య ప్రజానీకం సంపాదన ప్రతిపైసా పెట్టుబడి దారుల దగ్గర పోగు పడుతుంది. సంపాదించిన ప్రతిపైసా పండగలనో, పబ్బాలనో ఏవో స్కీములేసి దోచుకు పోతున్నారు. గతంలో మధ్య తరగతి అనుకునే వర్గం పేదలుగా, పేదలు మరింత పేదలుగా రూపాంతరం చెందుతున్నారు. ఇప్పుడిప్పుడే పెట్టుబడిదారి ఆర్థిక వేత్తలు కూడా మార్క్సిజాన్ని అధ్యయనం చేసే పరిస్థితి వచ్చింది. సమాజంలో నిరుద్యోగం, పేదరికం పెరుగుతుందనడానికి అన్నివర్గాల ప్రజలు తెల్లరేషన్ కార్డులకు ఎగబడటమే తార్కాణం. మాంద్యం తో వచ్చే ప్రజల సామాజిక విప్లవానికి జడిసె అన్ని రాజకీయపార్టీలు ఉచితాలవైపు పరుగులు తీస్తున్నాయి. ప్రజలు కూడా ఉచితాలవైపు ఎదురు చూస్తున్నారు. వీటి నుండి బయట పడాలంటే సమాజానికి ఓ కొత్త చూపు అవసరం. ఆ ఆలోచనలకు ఈ పుస్తకము ఓ దారి దీపం అవుతుంది. ఈ పుస్తకంలో ఇంకా స్ఫూర్తి, దారి దీపం ప్రచురించిన ప్రత్యేక సంచికలకు, స్ఫూర్తి, దారిదీపం పత్రికలకు వర్మ గారు వ్రాసిన సంపాదకీయాలు జత చేయపడ్డాయి. ❑

**ఇది చాలా విలువైన పుస్తకం. పుస్తకంలోని అన్ని అంశాలపై నేను పరిచయం చేస్తే విడిగా పుస్తకం చదివేటప్పుడు అన్ని చదివిన విషయాలులా అనిపిస్తాయి. కావున ఈ పుస్తకం ఎవరికి వారే చదివి చైతన్యం పొందుతారని ఆశిస్తూ..**

మీ మిత్రుడు

- బంగారు వి బి ఆచార్యులు

# సంపన్న దేశాల యువత దృష్టిలో కమ్యూనిజం అంటే ఏమిటి?



- రాజు దాస్

**ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద వ్యతిరేక, సామ్యవాదం పట్ల సానుకూలత పెరుగుతోంది. ఈ మధ్య అమెరికా, రష్యా, ఫ్రాన్స్, చైనాలతో సహా 28 దేశాల్లో ఓ సర్వే జరిగింది. ఈ సర్వేలో ప్రస్తుతం ఉన్న రూపంలో పెట్టుబడిదారీ వ్యవస్థ వలన ప్రపంచానికి ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువని 56 శాతం మంది అభిప్రాయపడ్డారు. జూన్ 2021లో జరిగిన సర్వే ప్రకారం అమెరికాలో 36 శాతం మంది ప్రజానీకం పెట్టుబడి దారీ వ్యవస్థ పట్ల విముఖత వ్యక్తం చేస్తున్నారు.**

ఈ విధమైన అభిప్రాయం కలిగిన వారిలో యువకులు ఎక్కువగా ఉన్నారు. పద్దెనిమిదేళ్ల నుండి 24 ఏళ్ల మధ్య ఉన్న వారిలో పెట్టుబడిదారీ వ్యవస్థను ఈసడించుకుంటున్న వారు 54 శాతం మంది ఉంటే 18-34 ఏళ్ల మధ్య ఉన్న వారిని పరిశీలిస్తే ఇటువంటి అభిప్రాయం కలిగిన వారు 46 శాతం ఉన్నారు. అదే సమయంలో అన్ని వయస్సున్న గ్రూపుల్లో 41 శాతం మంది సామ్యవాదం పట్ల ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. 18-24 సంవత్సరాల మధ్యనున్న వాళ్లల్లో సామ్యవాదం పట్ల ఆసక్తి ప్రదర్శిస్తున్న వారు 52 శాతం వరకూ ఉన్నారు. 25-35 సంవత్సరాల వయస్సున్న వారిలో యాభై శాతం మంది సామ్యవాద వ్యవస్థలను స్వాగతిస్తున్నారు. అక్టోబరు 2021లో జరిగిన ఓ సర్వే ప్రకారం 53 శాతం మంది అమెరికన్ వాసులు బడా పెట్టుబడిదారీ సంస్థల పట్ల విముఖతతో ఉన్నారు. ఈ సర్వే ప్రకారం డెమొక్రటిక్ పార్టీ శ్రేణుల్లో 2010 నాటికి 55 శాతం మంది సామ్యవాద సిద్ధాంతాల పట్ల సానుకూలంగా ఉంటే 2021 నాటికి ఈ మోతాదు 65 శాతానికి పెరిగింది.

అమెరికాయేతర పెట్టుబడిదారీ దేశాల్లోను పరిస్థితి ఇంచు మించు ఇలాగే ఉంది. ఆగస్టు 2021లో కెనడాలో జరిగిన ఓ సర్వే ప్రకారం కెనడాలో మెజారిటీ ప్రజలు (53 శాతం మంది) "ప్రస్తుత ఆర్థిక వ్యవస్థను సమూలంగా మార్చేయాల్సిన అవసరం ఉంద"ని అభిప్రాయపడితే 35 శాతం మంది "పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి వైదొలగాల"ని అభిప్రాయపడ్డారు. సుమారు 25 శాతం మంది ఇటువంటి అభిప్రాయాలను తీవ్రంగా వ్యతిరేకించారు. సాధారణ ప్రజల్లోనూ ప్రత్యేకించి యువతలోనూ పెట్టుబడిదారీ వ్యవస్థ పట్ల వ్యతిరేకత తీవ్రస్థాయిలో ఉన్నట్లు ఈ సర్వే వెల్లడిస్తోంది. 18-34 సంవత్సరాల మధ్య ఉన్న మహిళల్లో 49 శాతం ఈ వ్యతిరేకతతో ఉంటే ఇదే వయో తరగతికి చెందిన పురుషుల్లో 43 శాతం మంది ఇటువంటి అభిప్రాయంతో ఉన్నారు. ఈ దేశాల్లో ఏదో ఒక పార్టీకి ఓటు వేయటంపై ఉన్న వ్యతిరేకతతో పోలిస్తే పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఓటు వేసే వారి సంఖ్య ఎక్కువగా ఉండటం గమనార్హం. మరింత స్పష్టంగా చెప్పాలంటే లిబరల్ పార్టీకి ఓటు వేయటంపై 20 శాతం మంది వ్యతిరేకతతో ఉంటే, 21శాతం మంది కన్సర్వేటివ్



పార్టీలకు ఓటు వేయటానికి సిద్ధంగా లేరు. మధ్యతరహా సోషల్ డెమొక్రటిక్ పార్టీగా ఉన్న ఎన్డీపీ పట్ల 11 శాతం మంది వ్యతిరేకతతో ఉన్నారు. కానీ స్థూలంగా 35 శాతం మంది కెనడావాసులు పెట్టుబడిదారీ వ్యవస్థ పట్ల విముఖతతో ఉన్నారు. ఈ అంశంలో ఉత్తర అమెరికా దేశాలకూ ఐరోపా దేశాలకూ మధ్య పెద్దగా వ్యత్యాసాలు లేవు. 2016 నాటి వివరాలు పరిశీలిస్తే 47 శాతం మంది బ్రిటిషర్లు, 39 శాతం మంది జర్మన్లు పెట్టుబడిదారీ వ్యవస్థ పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేశారు. అంతేకాదు. 36 శాతం మంది బ్రిటిషర్లు, 45 శాతం మంది జర్మన్లు సోషలిజం పట్ల సుముఖతతో ఉన్నారు. (అమెరికాలో 2016 నాటికి పెట్టుబడిదారీ వ్యవస్థ పట్ల విముఖత కలిగిన వారు 27 శాతం ఉంటే సోషలిజం పట్ల సుముఖత వ్యక్తం చేసిన వారు 29 శాతం మంది).

స్థూలంగా చెప్పాలంటే ఆధునిక పెట్టుబడిదారీ దేశాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ పట్ల విముఖతతో పాటు ఏదో ఒకరకమైన సోషలిజం పట్ల సానుకూలంగా ఉన్న జనాభా శాతం గణనీయంగా ఉన్నది. ఈ అభిప్రాయాలు కలిగిన వారు ముందు ముందు పెరిగే అవకాశం కూడా కనిపిస్తోంది. ఇక్కడ రెండు విషయాలు చెప్పాలి. **మొదటిది పెట్టుబడిదారీ వ్యవస్థను అంతమొందించాలంటే వీరి బలం చాలదు అన్నది వాస్తవం. అదే సమయంలో ఈ ప్రజాబలం కేంద్రంగా సోషలిజం దిశగా ఓ మహోద్యమాన్ని నిర్మించటానికి కావల్సిన పునాదిని నిర్మించుకోవచ్చు. రెండో అంశం ఏమిటంటే సోషలిజం పట్ల సానుకూలంగా ఉన్న వారిలో (ప్రత్యేకించి అమెరికాలో) అసలు సోషలిజం అంటే ఏమిటో కూడా తెలీని వారు గణనీయంగా ఉంటారనటంలో సందేహం లేదు.** అదేవిధంగా పెట్టుబడిదారీ వ్యవస్థ లోతుపాతులు తెలిసిన వారు, అది ఏవిధంగా మానవాళికి నష్టదాయకమైనదో అవగాహన కలిగిన వారు కూడా తక్కువమందే ఉంటారు. మన్నికైన పర్యావరణంతో, సామాజిక సమన్యాయంతో కూడిన సోషలిస్టు ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మించాలంటే పెట్టుబడిదారీ వ్యవస్థపై నికరమైన నిర్మొహమాటమైన విమర్శలు ఎక్కుపెట్టాలి. అంతే నికరంగా నిర్మొహమాటంగా శాస్త్రీయ సామ్యవాదాన్ని సమర్థించాలి. 175 ఏళ్ల క్రితం మార్క్స్, ఏంగెల్స్‌లు రాసిన కమ్యూనిస్టు ప్రణాళికలో దీనికి సంబంధించిన కొన్ని ఆలోచనలు ఉన్నాయి. కమ్యూనిస్టు ప్రణాళిక 175 ఏళ్ల ఉత్సవాల సందర్భంగా కమ్యూనిస్టు ప్రణాళిక సాధించిన విజయాలను నెమరువేసుకునే ప్రయత్నమే ఈ వ్యాసం.

గత పాతికేళ్లుగా కమ్యూనిస్టు ప్రణాళిక గురించి చర్చలు విశ్లేషణలు జరుగుతూనే ఉన్నాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మార్క్సిస్టు విశ్లేషకులు సమీర్ అమీన్, కార్వర్, ఫర్, డేవిడ్ హార్వే, పాంటిక్, లీస్ వంటి వారు పలు వ్యాఖ్యానాలు ప్రచురించారు. అయితే ఈ వ్యాఖ్యానాలు కమ్యూనిస్టు ప్రణాళికలోని ఏదో ఒక అంశాన్ని తీసుకుని దానిపై వ్యాఖ్యానించటానికో, వివరించటానికో, విమర్శించటానికో పరిమితం అయ్యాయి. అది ఆత్మ రక్షణ ధోరణి. అప్పటికి ఆచరణాత్మక ధోరణి. కమ్యూనిస్టు ప్రణాళిక యొక్క రాజకీయ సైద్ధాంతిక విస్తృతి, తీవ్రత రీత్యా ఈ రచనపై సాగే ఏ విశ్లేషణ అయినా సమగ్రంగానే ఉండాలన్నది నా అభిప్రాయం. ఇప్పుడిప్పుడే మిలిటెంట్ రాజకీయ అవగాహనలు పెంచుకుంటున్న వారికి ప్రత్యేకంగా యువతను చైతన్యవంతులను చేసే లక్ష్యం దిశగా ఈ విశ్లేషణలు ఉండాలని, ప్రణాళికలోని కీలకమైన అంశాలను సమర్థించటంతోపాటు సమకాలీన చర్చల్లో పాఠకుల రాజకీయ అవగాహన పెంపొందించే దిశగా ఉండాలని భావిస్తున్నాను. పెట్టుబడిదారీ వ్యవస్థ కింద చితికిపోతున్న తమ తమ జీవితాలను చూస్తూ ప్రజలు చైతన్యవంతులవుతున్నారు. దీన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే కొన్ని ఘటనలు, భావనలు, ఆచరణ ఆధారంగా ఏర్పడే సద్యోజనిత చైతన్యమే తప్ప అది వర్గ చైతన్యం కాబోదు. అంటే స్వత: సిద్ధంగా పెట్టుబడిదారీ వ్యవస్థ రథ చక్రాల కింద నలిగిపోయే వారికి ఈ బరువుతో వచ్చే అవగాహనే ఇది. అనుభవం పాఠాలు నేర్పుతుందన్నది నిస్సందేహం. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థలో దైనందిన జీవన పోరాటంలో ఉన్న వారు పెట్టుబడిదారీ వ్యవస్థను అంతమొందించాల్సిన అవసరం, సామ్యవాదాన్ని స్థాపించుకోవాల్సిన అవసరం గురించిన పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. అటువంటి వారికి కావల్సిన పరిజ్ఞానాన్ని అందించే గ్రంథమే కమ్యూనిస్టు ప్రణాళిక.

మార్క్సిజం కంటే కమ్యూనిస్టు ప్రణాళికకే ఎక్కువ ప్రజాదరణ ఉందంటే ఆశ్చర్యం కలుగుతుంది. కానీ ఇది వాస్తవం. 1980 దశకం నుండి మార్క్సిజం మీద ప్రజల ఆసక్తి తగ్గుతూ ఉంటే మార్క్సిజంలో పునాది రచన అయిన కమ్యూనిస్టు ప్రణాళిక కమ్యూనిస్టు ప్రణాళిక మీద ఆసక్తి పెరుగుతూ ఉంది. కేవలం 2008లో ప్రపంచ ద్రవ్య పెట్టుబడి సంక్షోభం సమయంలో మాత్రమే సమగ్ర సిద్ధాంతంగా మార్క్సిజం పట్ల కాస్తంత ఆసక్తి పెరిగింది.

కమ్యూనిస్టు ప్రణాళిక ప్రాధాన్యత పెరుగుతుందనటానికి ఓ చిన్న ఉదాహరణ చెప్పుకోవచ్చు. భారతదేశంలో మావోయిజం ప్రభావంతో పనిచేస్తున్న అనేక బృందాలను అణచివేయటానికి రాజ్యం పెద్ద ఎత్తున దాడి చేస్తోంది. ఒక వ్యక్తి మావోయిస్టు అని ఎలా నిర్ధారణకు వస్తారు అన్న ప్రశ్నకు సమాధానంగా ఓ సీనియర్ పోలీసు అధికారి ఎవరి చేతిలోనైనా కమ్యూనిస్టు ప్రణాళిక కానీ మావో రాసిన రెడ్ బుక్ కానీ కనిపిస్తే అతను

అనుమానితుడవుతాడు అని సమాధానం చెప్పారు. అటువంటి వాళ్లపై నిఘా పెడతాము. ఎక్కువసార్లు వారి నుండి మాకు కావల్సిన సాక్ష్యాధారాలు దొరుకుతాయని కూడా చెప్పారు.

పరిజ్ఞానం పలు రకాలు అని విజ్ఞానశాస్త్ర తత్వవేత్త ఆండ్రూ సేయర్ చెప్తారు. ప్రపంచం గురించి కొన్ని ప్రతిపాదనలు చేయగలటం ఓ రకమైన పరిజ్ఞానం. అటువంటి ప్రతిపాదనలు సాధారణంగా తరచూ పరిశీలనాంశాలుగా ఉంటాయి. మరో రకమైన పరిజ్ఞానం ప్రపంచం గురించి విమర్శనాత్మక జ్ఞానాన్ని అందిస్తుంది. "మన పరిజ్ఞానం, మనం ప్రయోగించే భాష తరచూ మనం ప్రశ్నించటానికి, వాదించటానికి, ఘంటాపథంగా చెప్పటానికి, గౌరవించటానికి లేదా మన వ్యతిరేకతను పదిమందికీ పంచటానికి, సంబంధాలు ఏర్పర్చుకోవడానికి కావల్సిన సాధనాలను అందించే సామాజిక చర్య" అని ఆండ్రూ సేయర్ అంటారు. విమర్శ అవసరమే. ఎందుకంటే సమకాలీన ప్రపంచంలో దోపిడీ వ్యవస్థలను బలోపేతం చేసేవిగా ఉన్న నిర్మాణాల నడుమ ప్రజలకు కావల్సిన అవసరాలు సమకూరటం లేదు. అంతేకాదు. అటువంటి భావనలు ఆలోచనలు ప్రస్తుతమున్న ప్రపంచాన్ని విప్లవాత్మకంగా మార్చటానికి బదులు విప్లవాత్మకమైన కొత్త ప్రపంచాన్నే నిర్మించుకునేలా ప్రేరేపిస్తాయి. కమ్యూనిస్టు ప్రణాళిక ఇప్పుడిప్పుడే సమరశీల అవగాహన పెంపొందించుకుంటున్న యువతరానికి కావల్సిన రెండు రకాల విజ్ఞానాన్ని అందిస్తుంది.

కమ్యూనిస్టు ప్రణాళికలో అనేక ప్రతిపాదనలున్నాయి. (అన్ని రకాల స్థల కాల పరిస్థితులకూ వర్తించే ప్రతిపాదనలు ఇవి). కమ్యూనిస్టు ప్రణాళికలో కనిపించే అనేక కోరికలు, భావనలు మన రోజువారీ జీవితంలో వ్యక్తమయ్యేవే. అంతమాత్రాన ఆ ప్రతిపాదనలు ఓ కొలిక్కి వచ్చాయి కాబట్టి అవన్నీ మన రోజు వారీ జీవితంలో చర్చనీయాంశాలు అయ్యాయని భావించటానికి వీల్లేదు. అదేసమయంలో కమ్యూనిస్టు ప్రణాళికలో ప్రస్తావించిన పరిణామ క్రమం అన్ని దేశాల్లోనూ అన్ని సమయాల్లోనూ ఒకే రీతిలో పురోగమిస్తుందని భావించటానికీ, నిర్ధారణకు రావటానికీ కూడా వీల్లేదు.

కాజువల్ విషయాలు అంటే ఏమిటి? నిర్దిష్ట ఆధారాలతో విరుగుడు ప్రతిపాదించనంత కాలమూ ఇప్పుడున్న వ్యవస్థలోని కొన్ని ప్రత్యేక నిర్మాణాల కారణంగా ఉనికిలో ఉండే పరిస్థితులు కొన్ని అనివార్య పర్యవసానాలకు దారితీస్తాయి. ఇవే మనకు కాజువల్ విషయాలుగా వాదనలుగా వ్యవహారాలుగా అనివార్యతలుగా కనిపిస్తాయి. పెట్టుబడిదారీ సంబంధాల కారణంగా ప్రపంచీకరణ సాధ్యమైంది అని చెప్పుకున్నంత మాత్రాన నిజంగా ప్రపంచం అంతా ఒకే కుగ్రామంగా లేదా వసుధైక కుటుంబంగా మారిందని కాదు. లేదా అన్ని దేశాలూ ఈ ప్రపంచీకరణ పడవలో సమాన హోదాగల కుర్చీలేసుకుని కూర్చున్నారని కాదు. ప్రపంచీకరణపై తమదైన అవగాహనతో చేస్తున్న విమర్శలూ, విమర్శకులూ కూడా ఉన్నారు. కమ్యూనిస్టు ప్రణాళికలో పెట్టుబడిదారీ వ్యవస్థ గురించిన కొన్ని అభిప్రాయాలు, అవగాహనలూ కొన్ని సోషలిస్టు తరహా వాదనలపై సాగించిన విమర్శల నేపథ్యంలో ఏర్పడినవే కావటం ఆసక్తికరమైన అంశం.

**మార్క్సిజంలో పరస్పర అనుబంధమైన, పరస్పరాధారితమైన నాలుగు అంశాలున్నాయి. గతితార్కిక చారిత్రక తత్వశాస్త్రం, చారిత్రక భౌతికవాదం, రాజకీయ అర్థశాస్త్రం, కమ్యూనిస్టు సమాజం గురించి వివరించే ప్రతిపాదనలు లేదా కమ్యూనిస్టు సమాజం గురించిన దృక్పథం. కమ్యూనిస్టు ప్రణాళిలో చివరి మూడు అంశాల గురించిన చర్చ ప్రతిపాదనలు ఉన్నాయి. మొదటి అంశమైన గతితార్కిక చారిత్రక తత్వశాస్త్రం గురించిన ప్రస్తావనలు లేవు. కాకాపోతే కమ్యూనిస్టు ప్రణాళిక యావత్తూ ఈ తాత్విక దృక్పథం ఆధారంగా రూపొందినదే. కమ్యూనిస్టు ప్రణాళిక రాయటానికి మూడేళ్ళ ముందే జర్మన్ ఐడియాలజీ అన్న గ్రంథంలో మార్క్స్, ఏంగెల్స్‌లు గతితార్కిక, చారిత్రక తత్వ శాస్త్ర పునాదులను ధృవీకరించారు.**

చారిత్రక భౌతికవాదం నేపథ్యంలో మార్క్స్ ఏంగెల్స్‌లు తమ ప్రణాళికలో మార్క్సిస్టు సామాజిక సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ వర్గం, సామాజిక ఉత్పత్తి సంబంధాలు, ఉత్పత్తి శక్తుల మధ్య ఉండే సంబంధం, వర్గపోరాటం, రాజ్యాధికారపు వర్గ స్వభావం వంటి అనేక అంశాలను చర్చిస్తారు. రాజకీయ అర్థశాస్త్ర భావనల్లో భాగంగా ప్రణాళిక పెట్టుబడిదారీ వ్యవస్థ, పెట్టుబడిదారీ ప్రపంచీకరణ, పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క సంక్షుభిత స్వభావం గురించి చర్చిస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ స్వాధీనంలోకి వెళ్లిన కార్మికుల దుర్భర జీవనం, కార్మికులు సాగించే ఆర్థిక పోరాటాలను పెట్టుబడిదారీ వ్యవస్థ ఎలా ప్రోత్సహిస్తుంది, ఎలా నీరుగారుస్తుంది అన్న అంశాలను కూడా ప్రణాళిక చర్చించింది. కమ్యూనిస్టు కార్యాచరణ గురించికూడా విస్తారమైన చర్చ మనం ప్రణాళికలో చూడొచ్చు. ఇందులో ముఖ్యంగా పెట్టుబడిదారీ దశ నుండి సమాజం ముందుకు వెళ్లాల్సిన అవసరం ఏమిటి, కమ్యూనిజం అంటే ఏమిటి, కమ్యూనిస్టు సమాజ నిర్మాణం, విప్లవం ఆవశ్యకత, రాజ్యాధికారాన్ని సొంతం చేసుకున్న తర్వాత కార్మికవర్గం చేయాల్సిన పనులు, తీసుకోవాల్సిన చర్యలు, పెట్టుబడిదారీ వ్యతిరేక విప్లవ సాధకుల్లో కార్మికవర్గం యొక్క ప్రత్యేకత, విలక్షణత వంటి అంశాలుపై మార్క్స్ ఏంగెల్స్‌ల అభిప్రాయాలను మనం చూడొచ్చు. ❑

**(అనువాదం : కొండూరి వీరయ్య)**

# విప్లవాలకు కొత్త చూపునిచ్చే లెనిన్ అధ్యయన పద్ధతి



- డి వి వి యస్ వర్మ

ఏప్రిల్ 22 లెనిన్ జయంతి. విప్లవం-లెనిన్ అనేవి విడదీయరాని జంట పదాలు. లెనిన్ పేరు స్ఫురణకువస్తే రష్యాలో జరిగిన అక్టోబరు విప్లవం మన కళ్ల ముందు కదలాడుతుంది. 1917లో రష్యాలో జరిగిన అక్టోబరు విప్లవానికి లెనిన్ సారథి. విప్లవ కార్మికోద్యమాన్ని నిర్మించి, దానిని అధికారం హస్తగతం చేసుకునేందుకు నడిపించాడు. తొలి కార్మిక వర్గ రాజ్యం ఆవిర్భవించింది. సోషలిస్టు సమాజ నిర్మాణానికి రష్యాలో పునాదులు వేశాడు. ఈ విప్లవ కార్యాచరణ క్రమంలో లెనిన్ సిద్ధాంతపరమైన అనేక సవాళ్లను ఎదుర్కొన్నాడు. అక్కడ 'మార్క్సిస్టులమని' చెప్పుకునే వాళ్లు మార్క్స్ భావజాలానికి వక్రీకరణలు చేశారు. వారు మార్క్సిజాన్ని నియతివాదంగా పిడి వాదంగా దిగజార్చారు. ఈ పెడ ధోరణులను లెనిన్ తిప్పి కొట్టాడు.

మార్క్సిజాన్ని ఒక సృజన శీల సిద్ధాంతంగా, కార్యాచరణకు కరదీపికగా. మార్క్స్ భావజాలంలోని విప్లవ సారాంశాన్ని నిలబెట్టాడు. రష్యా పరిస్థితులకు అన్వయించే క్రమంలో మార్క్సిజానికి అనేక కొత్త చిగురులు తొడిగాడు. కొత్త మెరుగులు దిద్దాడు. ఎంతటి సిద్ధాంతమైనా అది ఆచరణలో రుజువు కావాలి. ఒక సిద్ధాంతాన్ని ఆచరణలోకి తేవడానికి నిర్దిష్టమైన ఉపకరణాలను పెంపొందించుకోవాలి. సరిగ్గా లెనిన్ అదే పని చేశాడు. మార్క్స్ కాలంలో కార్మిక వర్గం కూడా చాలా దేశాలలో వివిధ పార్టీలు, సంస్థలలో సంఘటితమైంది. 1848లో, తర్వాత 1871 పారిస్ కమ్యూన్ తిరుగుబాట్లు జరిగాయి. అక్కడ కార్మికవర్గం తాత్కాలిక విజయంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. వివిధ దేశాలలో కార్మికవర్గ పార్టీలను అంతర్జాతీయంగా వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ ఏర్పాటు ద్వారా మార్క్స్ వాటికి దిశా నిర్దేశం చేసే ప్రయత్నాలు చేశాడు. లెనిన్ ఈ అనుభవాలను, గుణపాఠాలను ఆకళింపు చేసుకున్నాడు.

మార్క్స్ భావజాలాన్ని ఆచరణలో పెట్టడానికి ఒక విప్లవకర పార్టీ అవసరాన్ని ప్రకటించాడు. కార్మిక వర్గ "అగ్రగామి దళం" గా ఆ పార్టీకి రూపుదిద్దాడు. ఆర్థిక పోరాటాల స్థాయి నుండి రాజ్యాధికారాన్ని సాధించే విప్లవ పార్టీ నిర్మాణానికి దారులు వేశాడు. అలాంటి అవసరాన్ని అంతర్జాతీయంగా కార్మికోద్యమం గుర్తించేలా చేశాడు. ఈ ఆవిష్కరణ కోసం ఆయన "ఏం చెయ్యాలి "అన్న పుస్తకం రాశాడు. విప్లవ సిద్ధాంతాన్ని విప్లవ కార్యాచరణకు నడిపించే కొత్త తరహా పార్టీకి అంకురార్పణ



చేశాడు. మార్క్స్ కాలంలో జరిగిన కార్మిక వర్గ తిరుగుబాట్లను పెట్టుబడిదారీ వర్గం అణిచివేసింది. పారిస్‌కమ్యూన్‌లో కార్మికవర్గం అధికారం పొందినా కొద్ది రోజులలోనే దానిని పెట్టుబడిదారీ వర్గాలు కూలదోశాయి. ఈ అనుభవాల నేపథ్యంలో పలు దేశాలలో కార్మికవర్గం అధికారం చేపట్టకపోతే అవి విజయం పొందలేవన్న నిర్ధారణకు రావడం సహజం. అలాగే అభివృద్ధి చెందిన దేశాలలో మాత్రమే విప్లవాలు జరుగుతాయన్న నిర్ధారణ కూడా చారిత్రక పరిణామం నుంచి చేసిన సూత్రీకరణే.

మార్క్స్ తన కాలంలో అనేక దేశాలలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్న దశను "పెట్టుబడి" గ్రంథంలో విశ్లేషించారు. అదే సమయంలో "ఆసియా తరహా ఉత్పత్తి విధానం" ప్రత్యేకతలను గుర్తించాడు. మార్క్స్ రచనల్లో పిడివాదం కనిపించదుబీ స్థల కాలాలకు అతీతమైన చారిత్రక నియతివాదం వగైరా రూళ్లకర్ర నియమాలు వుండవు.

మార్క్స్ తర్వాత 40 ఏళ్లలో జరిగిన పరిణామాలను లెనిన్ అధ్యయనం చేశాడు. పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశగా సామ్రాజ్యవాదాన్ని గుర్తించాడు. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థకు అంతిమ దశగాను అది శ్రామిక విప్లవాలకు ప్రారంభ దశ గాను ప్రకటించాడు

"సామ్రాజ్యవాదం – పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యున్నత దశ" పుస్తకంలో సామ్రాజ్యవాదంలోని అంతర్గత వైరుధ్యాలు, మార్కెట్ల

విస్తరణ కోసం జరిగే యుద్ధాలు అనివార్యతను గుర్తించాడు. సామ్రాజ్యవాదం ప్రపంచవ్యాపిత వ్యవస్థగా రూపొందినప్పటికీ ఆయా దేశాల అభివృద్ధిలో అసమానతల వల్ల వాటి మధ్య అంతర్గత వైరుధ్యాల వల్ల ఈ సామ్రాజ్యవాద దేశాల గొలుసులో బలహీనమైన లింకులు ఉంటాయని వాటిని ఛేదించడం ద్వారా కార్మిక వర్గం ఒక దేశంలో కూడా రాజ్యాధికారాన్ని పొంది నిలబెట్టుకునే అవకాశాలు వుంటాయని సూత్రీకరించాడు. ఆనాటి రష్యా అలాంటి బలహీనమైన లింకుగా నిర్ధారించి అక్కడ విప్లవం సాధ్యమేనని ప్రకటించాడు. సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చగలిగితే విప్లవాలు విజయవంతం అవుతాయని ప్రకటించాడు. అలాగే లెనిన్ మరో రచన "రాజ్యము -విప్లవమూ" అన్నది ఇది ప్రపంచ యుద్ధ కాలంలో రాసిన రచన. రెండో కమ్యూనిస్టు ఇంటర్నేషల్‌లో వున్న పార్టీలు రాజ్యం పట్ల ఎలాంటి వైఖరి తీసుకోవాలి అన్న దానిని వివరించడానికి ప్రధానంగా ఉద్దేశించబడిరది.

రెండో ఇంటర్నేషనల్‌లో పార్టీలు విప్లవాలు గురించి మాట్లాడుతూనే తీరా ప్రపంచ యుద్ధం వచ్చే సరికి అవి తమ దేశాల పెట్టుబడిదారీ పాలక వర్గాలను సమర్థించడం ప్రారంభించాయి. ఈ రాజ్యాలు చేస్తున్న యుద్ధాలకు కార్మిక వర్గం ఎందుకు సమర్థించకూడదో వివరించడానికి లెనిన్ ఈ పుస్తకాన్ని రాశారు. మార్క్స్, ఏంగెల్స్ రాజ్యం గురించి చేసిన విశ్లేషణ ఆధారంగా ఈ పుస్తక రచన సాగినా అది యుద్ధ సమయంలో రాజ్యం పట్ల అనుసరించాల్సిన వైఖరిని స్పష్టం చేయడం కోసం రాశాడు. ఒక లెనిన్ పార్టీ తప్ప అన్నీ తమ దేశాల ప్రభుత్వాలకు సమర్ధకులుగా నిలబడితే లెనిన్ దానికి విరుద్ధంగా రష్యాలో పాలకవర్గాన్ని కూలదోసే ప్రత్యామ్నాయాన్ని బోధించాడు. లెనిన్ వ్యూహం ఎత్తుగడలు కూడా ప్రత్యేకతను సంతరించుకున్నాయి. సోషల్ డెమొక్రసీలో రెండు ఎత్తుగడలు ఎలా విప్లవోద్యమాన్ని ముందకు తీసుకుపోవాలో వివరిస్తుంది. అలాగే "ఏప్రిల్ థీసిస్"లో లెనిన్ రూపొందించిన ఎత్తుగడ విప్లవ సాధనకు మార్గం చేసింది. వాస్తవానికి రష్యాలో ఫిబ్రవరి విప్లవం తర్వాత రెండు తరహాల అధికారాలు ఏర్పడ్డాయి. ఒకటి పై స్థాయిలో అధికారం చెలాయిస్తున్న పెట్టుబడిదారీ వర్గం, మరొకటి పట్టణాల స్థాయిలో కింద అధికారాన్ని కార్మికులు, రైతులు, సైనికుల నాయకత్వంలోని సోవియట్లు కలిగి వున్నాయి. అప్పటి సోవియట్లలో మెన్షివిక్కులే అత్యధిక ప్రాబల్యం కలిగి వున్నారు. లెనిన్ పార్టీ బోల్షివిక్‌లు మైనారిటీలో వున్నారు. అయినప్పటికీ అన్ని అధికారాలు సోవియట్లకే అన్న నినాదాన్ని లెనిన్ ప్రకటించాడు. ఎందుకంటే ఈ "సోవియట్ల" రూపాన్ని కార్మికవర్గ రాజ్యానికి ప్రాతిపదికగా గుర్తించాడు. లెనిన్ ఎత్తుగడ ఫలితంగా సోవియట్లు మెన్షివిక్‌లను వదిలి బోల్షివిక్ పక్షాన చేరాయి. అంతిమంగా ఈ ఎత్తుగడే విప్లవాన్ని సాధించి పెట్టింది.

ఇలా సిద్ధాంత రంగంలో, ఆచరణ రంగంలో లెనిన్ ఆనాటి మార్క్సిజానికి కొత్తచూపును ఇచ్చాడు. దాని భావజాల పరిధిని విస్తరింపజేశాడు. ఈ కొత్త చిగురులు వేయడానికి లెనిన్ అధ్యయన పద్ధతి దోహదపడిరది. ఈ అధ్యయన పద్ధతి మీద లెనిన్ ఉద్యమ సహచరి, తర్వాత జీవిత భాగస్వామి అయిన కృపస్కయా ఒక ప్రత్యేక వ్యాసం రాసింది. ఆమె పేర్కొన్న రెండు మూడు ముఖ్య అంశాలను ప్రస్తావించుకుందాం.


లెనిన్ తన కార్యాచరణలో జటిలమైన సమస్యలు ఎదురైనప్పుడు ఆయన మార్క్స్‌ను సంప్రదించేవారు అంటే ఆయన రచనల్ని ఒకటికి రెండుసార్లు చదివేవాడు. మార్క్స్ భావజాలాన్ని సృజనాత్మకమైనదిగా ఆచరణకు కరదీపికగా భావించాడు. పిడివాదాన్ని ఆర్థిక, చారిత్రక నియతివాదాలను ఆమోదించలేదు. ఇతర మార్క్సిస్టులలాగ మార్క్స్ నుంచి స్థల కాలాదులకు సంబంధం లేని ఉటంకింపులతో నిర్ధారణలకు రావడాన్ని నిరసించాడు.

లెనిన్ తనకు ఎదురైన సమస్య కోసం మార్క్స్ అలాంటి సందర్భంలో చేసిన విశ్లేషణను ఎత్తిరాసుకునే వాడు. మార్క్స్ కాలానికి, తన కాలానికి జరిగిన మార్పులను పరిశీలించే వాడు..దేశం కాలం పరిస్థితులకు వున్న వ్యత్యాసాలను వేరు చేసి తనకు ఎదురైన ప్రత్యేకతలకు మార్క్స్ భావజాలాన్ని అన్వయించడానికి పూనుకునేవాడు. అందుకే ఆయన కొత్త ఆవిష్కరణలు చేయగలిగాడు. స్థల కాలాల ప్రత్యేకతలు పరిగణనలో తీసుకోకుండా చేస్తే విశ్లేషణ "అనుకరణగానే" మిగిలిపోతుంది. మార్క్స్ రచనలతో నిరంతర సంభాషణ ద్వారా లెనిన్ తన దేశ కాలపరిస్థితులకు దానిని అన్వయించడంతో సరికొత్త నిర్ధారణలకు రాగలిగాడు. మార్క్సిజాన్ని ఆచరణకు సాధనంగా చేసుకుని విప్లవాన్ని జయప్రదంగా నిర్వహించగలిగాడు.

ఏ దేశంలోనైనా కమ్యూనిస్టులు రష్యా మార్గం, చైనా మార్గం వంటి అనుకరణలతో విప్లవాలను సాధించలేరు. లెనిన్ తరహా లో తమ తమ దేశ, కాల పరిస్థితులకు తగిన స్వతంత్ర మార్గాన్ని రూపొందించు కోవాలి. వారు తమ దేశంలోని ప్రత్యేకతలను, అభివృద్ధి దశను గుర్తిస్తేనే సరిపోదు. ఆ ప్రత్యేకతలకు కొత్త తరహా పరిష్కారాలు అవసరం అవుతాయి. వాటిని ఆవిష్కరించడం నాయకత్వం నిర్వహించాల్సిన ప్రత్యేక విధి. అప్పుడు ప్రజలను సమీకరించే కొత్త లక్ష్యాలు, కొత్త నినాదాలు పుట్టుకొస్తాయి. ప్రజలను ప్రభావితం చేసి విజయాలను సాధించి పెట్టే కొత్త తరహా ఉద్యమాలకు ద్వారాలు తెరుచుకుంటాయి. దానికి కొత్తగా వచ్చిన మార్పులకు, ప్రత్యేకతలకు మార్క్సిజాన్ని అన్వయించే కళను అవగాహన చేసుకోవాలి. లెనిన్ అధ్యయన పద్ధతి అందరికీ అలాంటి కొత్త చూపు ఇస్తుంది. లెనిన్ జయంతిని అర్థవంతంగా నిర్వహించుకుందాం. ❑

# పిల్లలకు ఏం చెప్పాలి.. ఎలా పెంచాలి ?

- పెరియార్ రామస్వామి




- పెరియర్ రామస్వామి పిల్లల పెంపకం ఎలా ఉండాలో చక్కగా సూచించారు.
- మీ చెప్పు చేతల్లో పిల్లల్ని పెంచాలని, మీ మూర్ఖపు, మూఢాచారపు భావాలను వారికి అంటగట్టకండి ! దేవుడు వున్నాడని గుళ్ళూ, గోపురాలు తిప్పించి, వారిచే దండాలు, పూజలు చేయించకండి !!
- పిల్లల చదువు కోసం మీరు ఎంతైనా కష్టపడండి, అంతేగానీ అన్ని కష్టాల్ని ఆ కనిపించని దేవుడే తీర్చేస్తాడని, పిల్లలకి లేనిపోని భ్రమలు మాత్రం కల్పించి చెప్పకండి !!!
- దేవుడే వున్నాడని మీరు గాఢంగా నమ్మిస్తే, మీ పిల్లల్లో స్వంత వ్యక్తిత్వ వికాసం గానీ, స్వంత ఆలోచనా విధానం గానీ వుండదు అన్నిటికీ ఆ దేవుడు మీదే భారం వేసే బలహీనులై పోతారు !!!!
- పిల్లల్లో మేధావితనం పెరగాలి గానీ, భక్తి భావన పెరిగినా ప్రయోజనం లేదు.
- నిజానికి దేవుడు వున్నాడా ? లేదా ? అని నిర్ణయించుకోవలసింది మీ పిల్లలే. ఉన్నాడనే ఓ అబద్ధమైన నమ్మకాన్ని మాత్రం మీరు కలిగించకండి!
- అప్పుడే మీ పిల్లలకు మీరు మేలు చేసినవారవుతారు !!
- స్వంత వ్యక్తిత్వం, స్వంత మనస్తత్వం, స్వంత ఆలోచనా విధానం లేని వాళ్లు ఈ భూమ్మీద చాలా మంది వున్నారు. వారిలో మీ పిల్లలు ఒకరిగా వుండకూడదు ఆ మందలో కలిసిపోయి అసలే వుండకూడదు !!
- మీ పిల్లలకు మీరు మొదట్నుంచీ నేర్పవలసింది మంచి వ్యక్తిత్వం, మూఢ భక్తిత్వం మాత్రం కాదు !!!
- పుట్టినప్పుడు మీరు ఏ మతంలో పుట్టారో మీకు తెలుస్తుందా..? పెరుగుతున్న కొద్దీ మతం, కులం అన్న విషయాలు ఇటు తల్లిదండ్రులు, అటు సమాజం నూరిపోస్తుంది. చదువుకుని ఉద్యోగంలో స్థిరపడే వరకు కూడా మనం తల్లిదండ్రులు సమాజం నూరిపోసిన కుల, మత భావజాలం లోనే బతుకుతాము. 25-30 ఏళ్లు దాటాక ప్రతి వ్యక్తికి ఒక స్థిత ప్రజ్ఞత వస్తుంది. అప్పుడు చిన్నప్పటి నుండి నూరిపోసిన మూర్ఖపు భావాలన్నీ పటాపంచలు అయి మనదైన ఒక ప్రత్యేక వ్యక్తిత్వం, ఒక ప్రత్యేక దృక్పథం ఏర్పడుతుంది. ఆ దృక్పథమే మనల్ని సరైన లక్ష్యం నడిపిస్తుంది. ❑

## మతం.. సాంస్కృతిక ఆయుధంగా..

(23వ పేజీ తరువాయి)

క్షీణించిపోవడం మూలంగా అలవిమాలిన వినిమయ ధోరణులు, అతి ఆధ్యాత్మిక ధోరణులు ప్రబలిపోతున్నాయి. మానవాళి పురోగమనంలో తీవ్ర ఒడిదుడుకులకు దారి తీస్తున్నాయి. పారిశ్రామిక విప్లవానంతరం ఆధ్యాత్మిక ఆలోచనా ధోరణులు ధ్వంసం అయిపోయాయి. మానవాళి ఇవాళ ఆధ్యాత్మిక అరాచకత్వంలో చిక్కుకు పోయింది. విచ్చలవిడి వస్తు వినిమయ వాదం జీవిత ఆదర్శంగా మారి పోవడంతో విచ్చలవిడి దోపిడి నెలకొన్నది. గత వందేళ్లలో ఈ భూమి మీద ప్రకృతి వనరులు 23 రెట్లు అంతరించిపోయాయి. రాబోయే 200 ఏళ్లలో ఈ భూమి మానవ నివాసయోగ్యం కాకుండా పోతుందన్న స్టీఫెన్ హాకింగ్ అంచనా నిజమయ్యే ప్రమాదం ఎదురవుతున్నది. ప్రస్తుతంలో ఉత్పత్తి లేకుండా ప్రకృతి వనరులను స్వాహా చేసి లాభాలను పోగేసుకునే దళారి పెట్టుబడిదారీ విధానం మొదలయ్యింది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం ఒక విధేయ సమాజాన్ని సృష్టించేందుకు ప్రయత్ని స్తుంది. ఆధిపత్య భావజాలం ప్రజలకు కష్టాలు, కడగండ్లకు గురిచేస్తు నానాటికీ పరాయికరణకు లోను చేస్తుంది. కాబట్టి మతం చారిత్రక గతితర్కాన్ని ప్రస్తుత ఏకపక్ష పక్షపాత వాతావరణంలో అలాంటి మత ప్రతిఘటనా శక్తులు ఉనికిలో లేకుండాపోయాయి. ❑


(ది వైర్ సౌజన్యంతో..)

(అనువాదం: కె.సత్యరంజన్)




మా భాషలో ఇంతే

గొంతెత్తకుంటే.. ఇకంతే









రుద్దుడుపై బాదుడు

కార్టూన్స్ : సతీష్ ఆచార్య


**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**


Vol : 3 - Issue No : 7 April 2025




## కొత్త పుస్తకాల స్వీకారం




if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatla Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.